www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 10-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 72 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి ఉ.11.36 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: అనూరాధ సా.6.02 తదుపరి జ్యేష్ఠ వర్జ్యం: రా.12.08-1.52; దుర్ముహూర్తం: ఉ.8.20-9.12, రా.10.20-11.02; అమృతఘడియలు: ఉ.6.32-8.18; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.45 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జర్నలిస్టు కొమ్మినేని అరెస్టు


కొమ్మినేని శ్రీనివాసరావు

పరారీలో విశ్లేషకుడు కృష్ణంరాజు.. అమరావతిని 'వేశ్యల రాజధాని' అనడంపై దళిత నేత కంభంపాటి శిరీష ఫిర్యాదు

హైదరాబాద్‌లో కొమ్మినేనిని అదుపులోకి తీసుకున్న ఏపీ పోలీసులు

రాత్రి పొద్దుపోయేదాకా విజయవాడలోనే.. నేడు కోర్టులో హాజరు

మహిళల నిరసన వెల్లువ.. 'సాక్షి'పై 60కి పైగా ఠాణాల్లో ఫిర్యాదు

ఆ వ్యాఖ్యలు జుగుప్సాకరం, హేయం.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

3

తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర ఒప్పుకోలే.. అందుకే

కాళేశ్వరం చేపట్టాం

విచారణకు హాజరు కావడానికి వెళ్తున్న హరీశ్‌రావు



కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నీళ్లు లేని చోట బ్యారేజీని ప్రతిపాదించింది. మేం అధికారంలోకి వచ్చాక నీళ్లు ఉన్న చోటుకు బ్యారేజీని మార్చాం. తెలంగాణకు ఎప్పటికైనా కాళేశ్వరమే జీవధార.

- కాళేశ్వరం కమిషన్‌తో హరీశ్‌రావు

నాడు కేంద్రం, ఏపీ, మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నా అనుమతివ్వలే

ప్రాణహిత-చేవెళ్లలో ఒక లింక్ మాత్రమే మార్చాం.. ఆరు లింకులు యథాతథం

బ్యారేజీల నీటి నిల్వ నిర్ణయం అధికారులదే..

మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులతోనే ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్

నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ సమయంలోనూ నిర్మాణ స్థలాలు మార్చారు

కాళేశ్వరం కమిషన్ విచారణలో మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించకపోవడం వల్లే కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టామని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఆ ప్రాజెక్టును ఏడు లింకులుగా ప్రతిపాదించగా.. ఆరు లింకులను కాళేశ్వరంలో యథాతథంగా ఉంచామని, ఒకదాన్ని మాత్రమే మార్చామని తెలిపారు. సోమవారం ఆయన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇవ్వడంతో పాటు ఆధారాలను సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అంతర్రాష్ట్ర సమస్యలు, కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ)లో చిక్కుముళ్లు, నిర్మాణ సమస్యల తర్వాతే ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్ జరిపామని తెలిపారు. ఇందుకోసం తాను ఛైర్మన్‌గా, నాటి మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు

మిగతా 12వ పేజీలో...

నిన్ను ఏమడిగారు.. నేనేం చెప్పాలి?

హరీశ్‌తో కేసీఆర్ సమాలోచనలు

కాళేశ్వరం కమిషన్ విచారణ నుంచి నేరుగా ఎర్రవల్లి ఫాంహౌస్‌కు హరీశ్

4 గంటల పాటు సుదీర్ఘ మంతనాలు

రేపు కమిషన్ ముందుకు కేసీఆర్

భారీగా పార్టీ శ్రేణుల సమీకరణ

12



హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో సిట్ కార్యాలయానికి వెళ్తున్న ప్రభాకర్‌రావు

రాతపూర్వక ఆదేశాలిచ్చానా?

ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలిచ్చినట్లు ఉంటే చూపించాలి

నా కింద పనిచేసిన సిబ్బంది.. అరెస్టు సమయంలో ఇచ్చిన వాంగ్మూలాలు చెల్లుబాటు కావు

ఎవరి ఫోన్లనూ అక్రమంగా ట్యాపింగ్ చేయించలేదు

ప్రణీత్‌రావు చేసిన పనితో నాకేం సంబంధం?

అక్కడేం జరిగిందో ఉన్నతాధికారులందరికీ తెలుసు

సిట్‌తో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు వ్యాఖ్యలు

పోలీసులు అడిగిన ప్రశ్నలకు ఎదురు ప్రశ్నలు

ఎదురుదాడి ధోరణిలో సమాధానాలు.. దాటవేత

రివ్యూ కమిటీని ముగ్గులోకి లాగే ప్రయత్నం

8 గంటల పాటు విచారణ.. 11న మళ్లీ రావాలన్న సిట్

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తడబాటు లేదు.. భయం, ఆందోళన అసలే లేవు. ప్రశ్నలకు.. ఎదురు ప్రశ్నలే సమాధానాలు. విచారణ తీరునంతా ముందే ఊహించినట్లు ఎదురుదాడి ధోరణి. మరీ లోతుగా ప్రశ్నిస్తే.. సమాధానాల దాటవేత. ఇదీ.. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు సిట్ అధికారుల ఎదుట వ్యవహరించిన తీరు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో పలు మలుపుల తర్వాత

మిగతా 14వ పేజీలో...

14

ప్రభాకర్‌రావు నీచుడు

ఆయన వల్ల ఎన్నో జీవితాలు నాశనమయ్యాయి

అమెరికాలోనే ఆయనకు కేసీఆర్ కుటుంబం కౌన్సెలింగ్ ఇచ్చింది: కేంద్ర మంత్రి బండి సంజయ్

పీసీసీ పదవుల్లోనూ

సామాజిక న్యాయం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పెద్దపీట

27 మంది ఉపాధ్యక్షులు, 69 మంది ప్రధాన కార్యదర్శులతో పీసీసీ కార్యవర్గం

గతం కన్నా సంఖ్య తగ్గినా.. జంబో టీమే

ఉపాధ్యక్షుల్లో 67% ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు.. ప్రధాన కార్యదర్శుల్లోనూ 68%

ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకూ చోటు

20 ఏళ్లకు పైగా పార్టీలో ఉన్నవారికి ప్రాధాన్యం



న్యూఢిల్లీ/హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో సామాజిక సమతుల్యత పాటించిన కాంగ్రెస్ పార్టీ.. టీపీసీసీ పదవుల్లోనూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది. మహిళలకూ తగిన ప్రాధాన్యం కల్పించింది. 27 మంది ఉపాధ్యక్షులు, 69 మంది ప్రధాన కార్యదర్శులతో పీసీసీ కార్యవర్గాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. గత కార్యవర్గంతో పోలిస్తే.. సంఖ్య కొంత తగ్గినా మరోసారి జంబో టీమ్‌నే ఏర్పాటు చేసింది. ఆ వివరాలను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ సోమవారం రాత్రి వెల్లడించారు. 27 మంది ఉపాధ్యక్షుల్లో ఎనిమిది మంది బీసీలు, ఐదుగురు ఎస్సీలు, ఇద్దరు ఎస్టీలు, ముగ్గురు ముస్లింలకు అవకాశం కల్పించారు. అంటే ఉపాధ్యక్ష పదవుల్లో ఈ

మిగతా 13వ పేజీలో...

శాఖలపై కసరత్తు!

కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై చర్చ

13

జగిత్యాల కాంగ్రెస్‌లో రగడ

లక్ష్మణ్‌ను అభినందిస్తూ మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గీయుల పోటాపోటీ ఫ్లెక్సీలు

సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి కోసం రాజీనామాలు



సంకెళ్లు వేసి.. నేలకు అదిమి..

భారతీయ విద్యార్థి పట్ల అమెరికా అధికారుల అమానుషం

అక్రమంగా వచ్చాడని వెనక్కి పంపిన వైనం.. న్యూజెర్సీలో ఘటన

2

కిక్కిరిసిన లోకల్ రైళ్ల నుంచి జారిపడి నలుగురి మృతి

ముంబైలో ఘటన, 9 మందికి గాయాలు

ఎదురెదురు రైళ్ల ఫుట్‌బోర్డు ప్రయాణికులు పరస్పరం తగలడంతో ప్రమాదం

బస్‌పాస్ చార్జీల బాదుడు!

20 శాతానికి పైగా పెంచిన ఆర్టీసీ

విద్యార్థుల బస్‌పాస్ ధర 50% పెంపు

ఇకపై హైదరాబాద్‌లో మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ విద్యార్థులకు అనుమతి

పెంపుతో ఆర్టీసీకి నెలకు రూ. 2 కోట్లు

టోల్‌ప్లాజా వినియోగ చార్జీల సవరణ

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బస్‌పాస్ చార్జీలను తెలంగాణ ఆర్టీసీ పెంచింది. విద్యార్థులు, ఎన్జీవోలతోపాటు సాధారణ ప్రజల బస్‌పాస్ చార్జీలను 20 శాతానికి పైగా పెంచింది. సోమవారం నుంచే పెంచిన ధరలు అమల్లోకి వచ్చాయి. విద్యార్థులకు రూట్ పాస్ (హైదరాబాద్, వరంగల్) ప్రస్తుతం 4 కిలోమీటర్ల

మిగతా 14వ పేజీలో...

మందుపాతరకు అదనపు ఎస్పీ బలి


అదనపు ఎస్పీ ఆకాశ్‌రావు

ఉచ్చు పన్ని మందుపాతర పేల్చిన నక్సల్స్

డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్‌కు తీవ్ర గాయాలు

ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో ఘటన

నంబాల ఎన్‌కౌంటర్‌కు నిరసనగా నేడు బంద్‌కు మావోయిస్టుల పిలుపు

2

హనీమూన్‌లో హత్య

బాయ్‌ఫ్రెండ్ సహాయంతో ముగ్గురికి సుపారీ ఇచ్చి భర్తను చంపించిన భార్య

» హతుడి భార్య, మిగతా నలుగురి అరెస్టు





షిల్లాంగ్, లఖ్‌నవూ 9: హనీమూన్‌కు వెళ్లిన భార్యాభర్తల్లో భర్త దారుణహత్యకు గురయ్యాడు. కట్టుకున్న భార్యే తన ప్రియుడి సహకారంతో ముగ్గురికి సుపారీ ఇచ్చి భర్తను చంపించిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. హతుడు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన వ్యాపారవేత్త రాజా రఘువంశీ. నిందితురాలు ఆయన భార్య సోనమ్. భర్తను ఆమె ఎందుకు హత్య చేయించాల్సి వచ్చింది? అనేది పోలీసులు వెల్లడించలేదు. రఘువంశీకి, సోనమ్‌కు మే 11న వివాహమైంది. మే 20న ఈ జంట హనీమూన్ కోసం మేఘాలయా వెళ్లింది. 22న నవ దంపతులు ఓ బైక్‌ను అద్దెకు తీసుకొని ప్రఖ్యాత 'లివింగ్ రూట్ వంతెన' మౌలాకియాత్ అనే గ్రామానికి వెళ్లారు. ఆ తర్వాత రఘువంశీ, సోనమ్ కనిపించకుండాపోయారు. మే 24న సోహ్రా వద్ద దంపతులు ఉపయోగించిన బైక్ లభ్యమైంది. ఈ ఘటనపై మేఘాలయా పోలీసులు ఎస్పీ, నలుగురు డీఎస్పీలతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. జూన్ 2న సోహ్రాలోని ఓ జలపాతం దగ్గర్లోని లోయలో రఘువంశీ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. అతడి తలపై బలమైన గాయాలు, శరీరంపై కత్తిపోట్లు ఉన్నట్లు పోస్టుమార్టం నివేదిక పేర్కొంది. రఘువంశీ వేలికి బంగారం ఉంగరం, మెడలో గొలుసు కనిపించలేదు. ఘటన జరిగిన మరుసటి రోజు సమీపంలో రక్తపుమరకలున్న కత్తి లభ్యమైంది. వంతెన వద్ద అల్బర్ట్ అనే టూరిస్ట్ గైడ్ ఘటనపై కీలక విషయాలు వెల్లడించారు. 22న రఘువంశీ, సోనమ్‌లకు అక్కడి విశేషాలను వెల్లడించానని, మర్నాడు.. దంపతులను మరో ముగ్గురితో కలిసి ఉండగా తాను చూశానని, అంతా హిందీలో మాట్లాడుకున్నారని అల్బర్ట్ వివరించాడు. హతుడి భార్య సోనమ్, యూపీలోని నందగంజ్ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలుస్తోంది. మరో ముగ్గురు నిందితులు.. ఆకాశ్ రాజ్‌పుత్ (19), విశాల్ సింగ్ చౌహాన్ (22), రాజ్‌సింగ్ కుశ్వాహ (21), ఆనంద్ కుర్మీ(23)లను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. నలుగురు నిందితుల్లో రాజ్ కుశ్వాహను సోనమ్ బాయ్‌ఫ్రెండ్‌గా అనుమానిస్తున్నారు. రఘువంశీని హత్యచేసేందుకు ఆయన భార్యే తమకు సుపారీ ఇచ్చినట్లుగా నిందితులు వెల్లడించినట్లు పోలీసులు చెప్పారు.

నేను చంపలేదు: సోనమ్

తన భర్త రఘువంశీని తాను చంపలేదని పోలీసుల విచారణలో సోనమ్ చెప్పినట్లు తెలుస్తోంది. తననే కొందరు కిడ్నాప్ చేశారని, తర్వాత గాజీపూర్‌లో వదిలేశారని, అక్కడి నుంచి తన కుటుంబసభ్యులతో మాట్లాడానని సోనమ్ చెప్పుకొచ్చినట్లు తెలుస్తోంది. అయితే, రాజ్ కుశ్వాహతో కొంతకాలంగా సోనమ్ సన్నిహితంగా ఉంటోందని.. పక్కా ప్రణాళిక ప్రకారమే రఘువంశీ హత్య జరిగినట్లు పోలీసులు వర్గాలు అనుమానిస్తున్నాయి. సోనమ్ సోదరుడు గౌరవ్ నడుపుతున్న ఓ కంపెనీలో రాజ్ కుశ్వాహ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జస్టిస్ యాదవ్‌పై అంతర్గత విచారణ నిలిపివేత

» జడ్జిలపై దర్యాప్తు తమ పరిధిలోనిదే అన్న రాజ్యసభ

» శాసన వ్యవస్థతో ఘర్షణ వద్దని వెనక్కి తగ్గిన సుప్రీం

న్యూఢిల్లీ, జూన్ 9: మైనార్టీలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌పై అంతర్గత విచారణను సుప్రీంకోర్టు విరమించుకొంది. న్యాయమూర్తిపై చర్యలు తీసుకునే అధికారం కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉందని స్పష్టం చేస్తూ రాజ్యసభ సచివాలయం నుంచి లేఖ రావడంతో సర్వోన్నత న్యాయస్థానం తన ప్రయత్నాలకు స్వస్తి చెప్పినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గత ఏడాది డిసెంబరు 8న ప్రయాగ్‌రాజ్‌లో విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన సదస్సులో ప్రసంగించిన జస్టిస్ యాదవ్ ముస్లింలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు లౌకికవాదానికి, న్యాయ వ్యవస్థ నిష్పక్షపాత పనితీరుకు విరుద్ధంగా ఉన్నాయంటూ పెద్దయెత్తున విమర్శలు వచ్చాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆయనకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు నివేదిక పంపించారు. దాన్ని పరిశీలించిన అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా..జస్టిస్ యాదవ్ ప్రవర్తనపై సమీక్ష జరిపేందుకు అంతర్గత విచారణను ప్రారంభించారు. అయితే దీనిని అడ్డుకుంటూ మార్చి నెలలో రాజ్యసభ సెక్రటేరియట్ సుప్రీంకోర్టుకు లేఖ రాసింది. దీంతో సుప్రీంకోర్టు తన విచారణను నిలిపివేసింది. శాసన వ్యవస్థతో ఘర్షణ ఉండకూడదన్న ఏకైక కారణంతోనే సర్వోన్నత న్యాయస్థానం ఆ నిర్ణయం తీసుకొంది.

'చిన్నస్వామి'లో తొక్కిసలాటపై నేడు విచారణ

బెంగళూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్సీబీ విజయోత్సవాల సమయంలో జరిగిన తొక్కిసలాటపై హైకోర్టు ధర్మాసనం సుమోటోగా తీసుకున్న కేసు విచారణ మంగళవారం జరగనుంది. ఈ నెల 5న హైకోర్టు ధర్మాసనం సుమోటోగా ఈ ఘటనపై విచారణ చేపట్టి, సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, తొక్కిసలాట ఘటనకు సంబంధించి తమపై కేసులు నమోదు కావడంతో ఆర్సీబీ, డీఎన్ఏ సోమవారం హైకోర్టును ఆశ్రయించాయి. ఆ సంఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని, కేసునుంచి మినహాయింపు ఇవ్వాలని ఆర్సీబీ ఫ్రాంచైజీ పిటిషన్ దాఖలు చేసింది. కాగా, తొక్కిసలాట ఘటనతో సస్పెన్షన్‌కు గురైన బెంగళూరు పశ్చిమ విభాగం అదనపు పోలీస్ కమిషనర్ వికాస్ కుమార్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు.

కేంద్ర న్యాయశాఖ అదనపు కార్యదర్శిగా శ్రీనివాస్

న్యూఢిల్లీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శిగా రామిశెట్టి శ్రీనివాస్ నియమితులయ్యారు. కేంద్ర నియామకాల కమిటీ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. యూపీఎస్సీ ద్వారా ఇండియన్ లీగల్ సర్వీస్‌కు ఎంపికైన రామిశెట్టి శ్రీనివాస్ కేంద్ర న్యాయ శాఖలో ఉప కార్యదర్శిగా ఇంతకుముందు బాధ్యతలు నిర్వర్తించారు. శ్రీనివాస్ ఏపీలోని గుంటూరు జిల్లాలో జన్మించారు. మచిలీపట్నంలో చదువుకున్నారు.

95 ఏళ్ల వరుడు.. 90 ఏళ్ల వధువు!

» 70 ఏళ్ల సహజీవనం తర్వాత వివాహం

» వారికి ఆరుగురు సంతానం



జైపూర్, జూన్ 9: చేతికర్ర పట్టుకొని.. బోసినవ్వుల మధ్య ఆ వధూవరులు పెళ్లి ప్రమాణాలు చేశారు! పెళ్లి కుమారుడికి 95 ఏళ్లు.. పెళ్లి కూతురికి 90 ఏళ్లు. రాజస్థాన్ దుంగార్పూర్ జిల్లాలోని గలందర్ గ్రామంలో ఈ వివాహం జరిగింది. వరుడు రామాభాయ్ అంగారీ, వధువు జివాలీదేవి 70 ఏళ్ల సహజీవనం తర్వాత పెళ్లి చేసుకున్నారు. ఈ జంటకు నలుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు.. ఎంతో మంది మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. వృద్ధ నవ దంపతుల సంతానంలో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. పెద్ద కుమారుడు బాకూ అంగారీ (65) రైతు. రెండో కుమారుడు శివరామ్ (55), మూడో కుమారుడు కాంతీలాల్ (52) ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మరో సంతానం లక్ష్మణ్ (52) రైతు కాగా కూతుళ్లలో సునీత టీచర్‌గా, అనిత నర్సుగా పనిచేస్తున్నారు. సంతానం బలవంతమ్మీదే హల్దీ, మెహందీ వేడుకల నిర్వహణతో పాటు పూర్తి సంప్రదాయ లాంఛనాల మధ్య అత్యంత వైభవంగా వృద్ధ జంట పెళ్లి జరిగింది. ఇప్పుడీ పెళ్లి తాలూకు ఫొటోలు, వీడియోలు నెట్‌లో వైరల్‌గా మారాయి.

విమానం మెట్లపై తూలి పడ్డ ట్రంప్!



న్యూఢిల్లీ, జూన్ 9: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఓ చేదు అనుభవం ఎదురైంది. ఆదివారం న్యూజెర్సీ నుంచి వాషింగ్టన్ డీసీకి వచ్చేందుకు ట్రంప్.. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎక్కుతూ మెట్లపై తూలిపడబోయారు. ఎలాగోలా నియంత్రించుకుని మెట్లెక్కి నవ్వుతూ అభివాదం చేసినా.. ఈ దృశ్యం మీడియా కెమెరాలకు చిక్కింది. ఇంకేముంది.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నెటిజన్లు ట్రంప్‌ను ఆడేసుకుంటున్నారు. 78 ఏళ్ల ట్రంప్‌ను అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌తో పోలుస్తూ 'బైడెన్ 2.0' అంటూ జోకులు వేస్తున్నారు. గతంలో బైడెన్ కూడా ఇలాగే విమానం ఎక్కే క్రమంలో తూలిపడబోగా.. ఆయనపై ట్రంప్ సెటైర్లు వేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. బైడెన్‌కు వయసు మీరిందని, అధ్యక్ష ఎన్నికల్లో ఆయన తనకు పోటీయే కాదని చెప్పేందుకు, "బైడెన్ కనీసం విమానం మెట్లు కూడా ఎక్కలేరు.. దిగలేరు" అంటూ ట్రంప్ 2023 ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు.

ఏఎస్‌జీఈ జర్నల్ అసోసియేట్ ఎడిటర్‌గా ఏఐజీ వైద్యుడు రాకేశ్ కలపాల



హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అమెరికన్ సొసైటీ ఫర్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఎండోస్కోపి(ఏఎస్‌జీఈ) జర్నల్ అసోసియేట్ ఎడిటర్‌గా డాక్టర్ రాకేశ్ కలపాల నియమితులయ్యారు. డాక్టర్ రాకేశ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో ఎండోస్కోపి విభాగానికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. డాక్టర్ రాకేశ్ నియామకంపై ఏపీ సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ గుర్తింపు కలపాల రాకేశ్ నైపుణ్య స్థాయికి లభించిన గౌరవంగా కొనియాడారు. దేశానికి, తెలుగుజాతికి ఆయన గొప్ప విజయాన్ని తీసుకువచ్చారని ఏపీ సీఎం పేర్కొన్నారు.

ఇండియా ఫస్ట్!

మా ప్రతి విధానం వెనుకా ఇదే నినాదం



» 11ఏళ్లలో అన్ని రంగాల్లో శీఘ్ర పరివర్తనం

» సమష్టి విజయాలకు గర్విస్తున్నాం: మోదీ

న్యూఢిల్లీ, జూన్ 9: తన ప్రభుత్వ ఆధ్వర్యంలో గత 11 ఏళ్లలో భారత్ అతి వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరించడమే గాక.. వాతావరణ మార్పులు, డిజిటల్ ఇన్నొవేషన్‌లో అంతర్జాతీయంగా కీలక గొంతుకగా మారిందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. తమ ప్రతి విధానం, నిర్ణయం వెనుక 'ఇండియా ఫస్ట్' చోదక శక్తిగా ఉందన్నారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్..' ఎన్డీఏ ప్రభుత్వ మార్గదర్శక సూత్రంగా పేర్కొన్నారు. దీనిద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ప్రధాని పగ్గాలు చేపట్టి 11 ఏళ్లు.. మూడోసారి బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన సోమవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. '11 ఏళ్ల సేవలో' అనే హ్యాష్‌ట్యాగ్ జోడించారు. ఈ 11 ఏళ్లలో సత్పరిపాలన, పరివర్తనపై దృష్టి కేంద్రీకరించామన్నారు. 140 కోట్ల మంది సమష్టి భాగస్వామ్యం, ఆశీర్వాదంతో వివిధ రంగాల్లో శీఘ్ర అభివృద్ధి, ఎంతో పరివర్తన చోటుచేసుకున్నాయని తెలిపారు. బడుగు వర్గాలకు ప్రభుత్వంలో సరైన ప్రాతినిధ్యం లేదని, వారి ప్రయోజనాలకు విరుద్ధంగా తన ప్రభుత్వం పనిచేస్తున్నట్లుగా ప్రతిపక్షాలు చిత్రించే ప్రయత్నం చేస్తున్నాయని.. కానీ తన మంత్రివర్గంలో 60 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చోటు కల్పించామన్నారు. సామాజిక న్యాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఈ వర్గాలకు గతంలో ఎప్పుడూ ఇంత ప్రాతినిధ్యం లేదన్నారు. ఆర్థికాభివృద్ధి నుంచి సామాజిక సాధికారత వరకు ప్రభుత్వ కృషి మొత్తం ప్రజలే కేంద్రకంగా, సర్వతోముఖాభివృద్ధి దిశగా సాగుతోందన్నారు. ఈ సమష్టి విజయానికి గర్విస్తున్నామని.. ఇదే సమయంలో వికసిత్ భారత్ నిర్మాణానికి మొక్కవోని సంకల్పం తీసుకున్నామని తెలిపారు. వివిధ రంగాల్లో తెచ్చిన మార్పులను వివరించే సమాచారంతో కొన్ని లింకులను ఆయన పోస్టుచేశారు. 'పురోగామి రాజకీయాలను తీసుకొచ్చాం. వికాసవాదాన్ని ప్రధాన స్రవంతిలోకి తెచ్చాం. దేశవ్యాప్తంగా 81 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు అందిస్తున్నాం. 15 కోట్ల ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇచ్చాం. 4 కోట్ల మందికి పైగా పేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చాం. 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించాం. 68 లక్షల మంది వీధి వ్యాపారులకు రుణాలు అందించాం. కొవిడ్ సమయంలో వివిధ పథకాల కింద 20 కోట్ల మంది మహిళలకు నగదు సాయం అందించాం' అని వివరించారు.

సువర్ణాక్షరాలతో లిఖిస్తారు: నడ్డా

మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సానుకూల మార్పులకు గాను దాని 11 ఏళ్ల పాలనను చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖిస్తారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా అన్నారు. రాహుల్‌గాంధీ బాధ్యతారహిత విపక్ష నేత అని మండిపడ్డారు. పహల్గాం దాడి దరిమిలా నిర్వహించిన అఖిల పక్ష సమావేశానికి హాజరై.. ప్రభుత్వం వెంటే ఉంటామని చెప్పారని.. తీరా బయటకు వెళ్లాక బాధ్యత లేకుండా మాట్లాడారని... విదేశాంగ విధానం.. ఆపరేషన్ సిందూర్‌లో ఎన్ని యుద్ధవిమానాలు నష్టపోయామంటూ నిరాధార ప్రశ్నలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. క్రికెట్ మ్యాచ్‌లో ఓటమికి ఆటగాళ్లు అంపైర్‌ను నిందించినట్లుగా.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయానికి ఎన్నికల కమిషన్‌పై విమర్శలు చేస్తున్నారని ఆక్షేపించారు. ఆయనకు భగవంతుడు సద్బుద్ధి ప్రసాదిస్తాడన్న ఆశాభావం వ్యక్తంచేశారు. సోమవారం ఢిల్లీలో నడ్డా విలేకరులతో మాట్లాడారు. 11 ఏళ్ల మోదీ సర్కారు విజయాలను వివరించారు. 'యూపీఏ పదేళ్ల హయాంలో జరిగిన స్కాంలు, విభజన, బుజ్జగింపు రాజకీయాలు, నకారాత్మకతకు మోదీ స్వస్తి పలికారు. సవాళ్లను దీటుగా ఎదుర్కొంటూనే ప్రభుత్వాన్ని జవాబుదారీగా, స్పందించే విధంగా మలిచారు' అని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం ఈ ఐదేళ్లు మాత్రమే గాక.. వచ్చే ఐదేళ్లూ పాలన సాగిస్తుందన్న విశ్వాసం వ్యక్తంచేశారు.

స్వర్ణయుగం: అమిత్‌షా

11 ఏళ్ల మోదీ ప్రభుత్వం.. ప్రజాసేవలో అంకితభావం, సంకల్పం, కృషికి స్వర్ణయుగంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అభివర్ణించారు. మోదీ మూడో టెర్మ్‌లో నవభారతం అభివృద్ధి, స్వావలంబన దిశగా వేగంగా పురోగమిస్తోందని 'ఎక్స్'లో తెలిపారు. భారతీయుల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడం ద్వారా భారత్‌ను ప్రతి రంగంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దే కృషి కొనసాగుతుందన్నారు. గత 11 ఏళ్ల సేవలో 'కనిష్ఠ ప్రభుత్వం.. గరిష్ఠ పాలన'తో దేశాభివృద్ధి వేగం, పరిమాణాన్ని మోదీ ప్రభుత్వం మార్చివేసిందని తెలిపారు.

లోకం తీరు



వర్తమానం వదిలేసి.. 2047 గురించి కలలా?

ప్రచార ఆర్భాటమే తప్ప ఏ మార్పూ లేదు

11 ఏళ్ల మోదీ ప్రభుత్వ పాలనపై రాహుల్



న్యూఢిల్లీ, జూన్ 9: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ 11 ఏళ్ల పాలనపై ప్రతిపక్ష కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. మోదీ ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనం లోపించిందని, ఎలాంటి మార్పు లేదని, ప్రచారం మాత్రమే కనిపిస్తోందని ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. వర్తమానం గురించి మాట్లాడని కేంద్ర సర్కార్.. 2047 గురించి కలలు కంటోందని సోమవారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో కదులుతున్న, రద్దీగా ఉన్న లోకల్ రైలు నుంచి కింద పడి పలువురు ప్రయాణికులు మరణించిన ఘటనపై రాహుల్ స్పందించారు. 'మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనను సెలబ్రేట్ చేసుకుంటుంటే.. ముంబై నుంచి వచ్చిన విషాద వార్త దేశంలోని వాస్తవ పరిస్థితికి అద్దం పడుతోంది' అని అన్నారు. భారతీయ రైల్వే కోట్లాది మంది ప్రజల జీవితాలకు వెన్నెముకగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత.. ఈరోజున ఆ సంస్థ అభద్రత, రద్దీ, గందరగోళానికి చిహ్నంగా మారిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగంలోని ప్రతి పేజీపై నియంతృత్వపు సిరా పూసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. ఈ 11 ఏళ్ల పాలన దేశ ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక నిర్మాణానికి పెద్ద దెబ్బ అని ఎక్స్ పోస్టులో అన్నారు. మోదీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలనపై విమర్శలతో ప్రతిపక్ష కాంగ్రెస్ ఒక బుక్‌లెట్‌ను సోమవారం విడుదల చేసింది.

శుభాన్షు శుక్లా రోదసి యాత్ర రేపటికి వాయిదా

న్యూయార్క్, జూన్ 9: భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లా సహా నలుగురు వ్యోమగాములను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లే యాక్సియం-4 మిషన్ మరోసారి వాయిదా పడింది. నిర్ణీత షెడ్యూలు ప్రకారం మంగళవారం (జూన్ 10) సాయంత్రం 5.52 గంటలకు చేపట్టాల్సిన ఈ ప్రయోగాన్ని.. వాతావరణం అనుకూలించకపోవడంతో 11వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు వాయిదావేసినట్టు ఇస్రో 'ఎక్స్' ద్వారా తెలిపింది. అటు స్పేస్ ఎక్స్ సంస్థ కూడా ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించింది. బుధవారం సాయంత్రం ఐదున్నర గంటలకు లాంచ్ చేయనున్నట్టు.. ఒకవేళ అప్పుడు కూడా కుదరకపోతే గురువారం సాయంత్రం 5.07 గంటల సమయాన్ని బ్యాకప్‌గా నిర్ణయించినట్టు తెలిపింది. యాక్స్-4 మిషన్‌ను తొలుత మే 29న చేపట్టడానికి అన్ని ఏర్పాట్లూ చేసి.. చివరి నిమిషంలో జూన్ 8వ తేదీకి, ఆ తర్వాత జూన్ 10వ తేదీకి వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

479 డ్రోన్లతో రష్యా దాడి

కీవ్, జూన్ 9: ఉక్రెయిన్‌పై రష్యా 479 డ్రోన్లతో విరుచుకు పడింది. ఇరు దేశాల మధ్య యుద్ధం మొదలైన నాటి నుంచి ఒకే రాత్రి ఇన్ని డ్రోన్లు ప్రయోగించడం ఇదే మొదటిసారి. డ్రోన్లతో పాటు వివిధ రకాల 20 క్షిపణులను కూడా తమ దేశంలోని వివిధ ప్రాంతాలపైకి రష్యా పంపిందని ఉక్రెయిన్ తెలిపింది. ముఖ్యంగా మధ్య, పశ్చిమ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయని పేర్కొంది. రష్యా ప్రయోగించిన డ్రోన్లలో 277 డ్రోన్లను, 19 క్షిపణులను తమ వైమానిక దళం గాలిలోనే ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. కేవలం పది డ్రోన్లు మాత్రమే లక్ష్యాలను ఛేదించగలిగాయని తెలిపింది.


సంకెళ్లు వేసి.. నేలకు అదిమి..

భారతీయ విద్యార్థి పట్ల అమెరికా అధికారుల అమానుషం

» అక్రమంగా వచ్చాడని వెనక్కి పంపిన వైనం

» న్యూజెర్సీ విమానాశ్రయంలో ఘటన

వాషింగ్టన్, జూన్ 9: అక్రమ వలసదారులను వెనక్కి పంపటంలో భాగంగా.. ఓ భారతీయ విద్యార్థిని అమెరికా అధికారులు చేతులు వెనక్కి కట్టి, సంకెళ్లు వేసి, నేలకు అదిమి పెట్టిన అమానుష ఘటన వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని న్యూజెర్సీలో నేవార్క్ విమానాశ్రయంలో జరిగిన ఈ దారుణంపై భారతీయ అమెరికన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'హెల్త్‌బాట్స్ ఏఐ' అనే సంస్థ ప్రెసిడెంట్‌గా ఉన్న ఎన్నారై కునాల్ జైన్.. ఈ ఘటన తాలూకు వీడియోను ఎక్స్‌లో షేర్ చేశారు. 'విమానాశ్రయంలో ఓ భారతీయ యువ విద్యార్థికి నేరస్థునిలా బేడీలు తగిలించి తిప్పి పంపటం చూశాను. కలలు సాకారం చేసుకోవటానికి ఆ యువకుడు ఈ దేశానికి వచ్చాడు. అంతేగానీ, ఎవరికీ హాని చేయటానికి కాదు. ఆ అబ్బాయి ఏడుస్తుంటే కూడా నేను ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితిలో ఉండిపోయాను. నా గుండె పగిలిపోయినట్లు అనిపించింది. నిజంగా ఇది మానవ విషాదం' అని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు యువకుడు హరియాణా భాష హరియాణ్వీ మాట్లాడుతున్నట్లు అనిపించిందని తెలిపారు. ఈ తరహా ఘటనలు ఇటీవలి కాలంలో తరచూ జరుగుతున్నాయన్నారు. 'వీసా లభించిన మర్నాడే ఉదయం అమెరికాలో అడుగుపెడుతున్న ఈ పిల్లలు.. తమ రాకకు కారణాలేమిటో సహేతుకంగా అధికారులకు చెప్పలేకపోతున్నారు. దాంతో వారిని నేరస్థుల్లా చూస్తూ, అదే రోజు సాయంత్రం విమానంలో తిప్పిపంపుతున్నారు' అని తెలిపారు. జైన్ షేర్ చేసిన ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. 'నేనేమీ పిచ్చివాడిని కాదు.. నన్ను అధికారులు పిచ్చివాడిలా మార్చాలని చూస్తున్నారు' అంటూ ఆ యువకుడు అరవటం ఓ వీడియోలో ఉంది. కాగా, పలువురు భారతీయ అమెరికన్లు ఈ ఘటనపై ఆగ్రహం, వ్యక్తం చేస్తున్నారు.



లాస్‌ఏంజెలెస్‌లో ట్యాక్సీలకు ఆందోళనకారుల నిప్పు

లాస్ ఏంజెలెస్‌కు విముక్తి కల్పిస్తాం!

అక్రమ వలసదారుల నుంచి లాస్ ఏంజెలెస్‌కు విముక్తి కలిగిస్తామని, వలసదారుల ఉద్యమాలను అణిచివేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీనికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సెక్రటరీ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ క్రిస్టీ నియోమ్‌ను ఆయన ఆదేశించారు. వలసదారుల బారి నుంచి నగరానికి స్వేచ్ఛకల్పించాలని పేర్కొన్నారు. "అమెరికాలో ఒకప్పుడు గొప్ప నగరంగా ఉన్న లాస్ ఏంజెలెస్.. అక్రమ వలసదారుల దండయాత్ర, నేరస్థుల ఆక్రమణలతో నిండిపోయింది. ఇప్పుడు హింసాత్మక తిరుగుబాటు దారులు ఫెడరల్ ఏజెంట్లపై(పోలీసులు) దాడులు చేస్తున్నారు. అంతేకాదు.. మనం చేపట్టిన బహిష్కరణ కార్యకలాపాలను నిలువరించే ప్రయత్నం చేస్తున్నారు" అని ట్రంప్ స్పష్టం చేశారు.

12 దేశాల పౌరులపై అమెరికా నిషేధం

డాకర్ (సెనెగల్), జూన్ 9 : విదేశాంగ విధానాన్ని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరింత కఠినతరం చేసింది. అమెరికాలో ప్రయాణించకుండా 12 దేశాల పౌరులపై నిషేధం విధించింది. మరో ఏడు దేశాల పౌరుల ప్రవేశాలపై కఠిన ఆంక్షల వేటు వేసింది. ఈ ఆదేశాలు మంగళవారం (భారత్ కాలమానం) నుంచి అమలులోకి వస్తాయి. దీని ప్రభావం ఆఫ్రికా, పశ్చిమాసియాలోని దేశాలపైనే అధికంగా పడనుంది. నిషేధం వేటు పడిన దేశాల్లో అఫ్ఘానిస్థాన్, ఇరాన్, మయన్మార్, చాద్, కాంగో, గినియా, ఎరిట్రియా, హైతీ, లిబియా, సోమాలియా, సూడాన్, యెమెన్ ఉన్నాయి. ఇక.. ప్రయాణ ఆంక్షలకు గురైన దేశాల్లో బురుండీ, క్యూబా, లావోస్, సియర్రా లియోన్, టోగో, తుర్క్‌మెనిస్థాన్, వెనెజులా ఉన్నాయి. అమెరికా బయట ఉంటూ, ధ్రువీకరించిన వీసాలు లేనిపక్షంతో ఈ ఏడు దేశాల పౌరులను అమెరికాలో ప్రయాణించడానికి అనుమతించరు.

నక్సల్స్ మందుపాతర పేలి అదనపు ఎస్పీ మృతి

దుమ్ముగూడెం/చింతూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు వలపన్ని.. ఓ అదనపు ఎస్పీని బలిగొన్నారు. తొలుత రోడ్డుపై ఎక్స్‌కవేటర్‌ను తగులబెట్టి.. అక్కడికి పోలీసులు వచ్చే మార్గంలో మందుపాతరను అమర్చారు. ఈ ఘటనలో ఏఎస్పీ ఆకాశ్‌రావు గిర్పుంజే దుర్మరణంపాలయ్యారు. మరో ఇద్దరు పోలీసు అధికారులకు గాయాలయ్యాయి. బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ కథనం ప్రకారం.. సుకుమా జిల్లా కుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో క్వారీ దగ్గర ఎక్స్‌కవేటర్‌ను మావోయిస్టులు తగులబెట్టారు. ఆ సమయంలో కుంట పోలీసు వసతిగృహంలో ఉన్న అదనపు ఎస్పీ ఆకాశ్‌రావు గిర్పుంజే(42) విషయం తెలుసుకుని, తన సిబ్బందితో కలిసి వాహనాల్లో ఘటనాస్థలికి బయలుదేరారు. పోలీసులు వస్తారనే ఉద్దేశంతో ఆ మార్గంలో మావోయిస్టులు మందుపాతరను అమర్చారు. ఏఎస్పీ వాహనం అక్కడికి చేరుకోగానే.. మందుపాతరను పేల్చి, కాల్పులు జరిపారు. పోలీసులు ఎదురుకాల్పులకు దిగడంతో.. మావోయిస్టులు సమీప అడవుల్లోకి పారిపోయారు. ఈ ఘటనలో ఏఎస్పీ ఆకాశ్‌రావు, డీఎస్పీ భానుప్రతాప్ చంద్రకర్, ఇన్‌స్పెక్టర్ సోనాల్ గవ్లా తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్పీ చికిత్స పొందుతూ మృతిచెందారు. కాగా, నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా నక్సల్స్ మంగళవారం దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చారు.

ఇజ్రాయెల్ బలగాలు నన్ను కిడ్నాప్ చేశాయి

పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా ఆరోపణ

జెరూసలేం, జూన్ 9: గాజా వాసులకు మానవతా సాయంగా బేబీ ఫుడ్, మందులు ఇతర ఆహార పదార్థాలను తీసుకొని వెళ్తున్న పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్‌ను, ఆమెతో పాటు ఉన్న మరికొంత మంది హక్కుల కార్యకర్తలను ఇజ్రాయెల్ బలగాలు మధ్యలోనే అడ్డుకున్నాయి. వారు వెళ్తున్న ఓడను మధ్యధరా సముద్రంలోనే చుట్టుముట్టాయి. థన్‌బర్గ్, ఇతర కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నాయి. దీనిపై గ్రెటా థన్‌బర్గ్ వీడియో విడుదల చేశారు. ఇజ్రాయెల్ బలగాలు తమను కిడ్నాప్ చేశాయని ఆరోపించారు. అయితే, థన్‌బర్గ్ ఆరోపణలను ఇజ్రాయెల్ ఖండించింది. పడవలో మానవతా సాయాన్ని తీసుకురావడాన్ని పబ్లిసిటీ స్టంట్‌గా అభివర్ణించింది. అది 'సెలెబ్రిటీల సెల్ఫీ యాత్ర' అని ఎద్దేవా చేసింది. ఓడ ఇజ్రాయెల్ పోర్టుకు చేరుకున్న తర్వాత థన్‌బర్గ్, హక్కుల కార్యకర్తలందరినీ వారి స్వదేశాలకు పంపిస్తామని తెలిపింది. వారు తీసుకువచ్చిన మానవతా సాయాన్ని ఇప్పటికే ఏర్పాటు చేసిన మార్గాల ద్వారా గాజాకు చేరవేస్తామని వెల్లడించింది.

కదులుతున్న రైళ్లలోంచి జారిపడి నలుగురి మృతి



» ముంబ్రా రైల్వే స్టేషన్ సమీపంలో ఘటన, 9 మందికి గాయాలు

» రద్దీయే కారణమన్న అధికారులు

ముంబై, జూన్ 9: మహారాష్ట్ర థానే జిల్లాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. రద్దీగా ఉన్న రెండు లోకల్ ట్రైన్ల నుంచి జారిపడి నలుగురు ప్రయాణికులు మృతిచెందగా, తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. ముంబ్రా రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. కసారా, ఛత్రపతి శివాజీ టెర్మినస్ వైపు నుంచి ఎదురెదురుగా వెళ్తున్న రెండు రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయి ఉన్నాయని, ఇవి ఒకదానినొకటి దాటుతున్నప్పుడు ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. రెండు రైళ్లలో ఫుట్‌బోర్డులపై ప్రయాణిస్తున్న వారు ఒకరికొకరు తగలడంతో అదుపుతప్పి కిందపడిపోయారని అన్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించామని, ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామని రైల్వే పోలీసులు తెలిపారు. "ముంబై లోకల్ ట్రైన్లలో నిత్యం లక్షలాది మంది ప్రయాణం చేస్తుంటారు. రద్దీ సమయాల్లో తలుపులు తెరిచే ఉంచడం, ప్రయాణికులు ఫుట్‌బోర్డుపై ప్రయాణించడం సర్వసాధారణమైపోయింది" అని అధికారులు అన్నారు. ఈ క్రమంలో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు అన్ని సబర్బన్ రైళ్లకు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఓ రైల్వే శాఖ అధికారి తెలిపారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే ఘటనపై విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు. ఘటనపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని శివసేన(యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది డిమాండ్ చేశారు.

ముగిసిన మావోయిస్టు సుధాకర్ అంత్యక్రియలు

పెదపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కీలకనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు సుధాకర్(65) అంత్యక్రియలు ఏపీలోని ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలు గ్రామంలో సోమవారం ఉదయం ముగిశాయి. సుధాకర్ మృతదేహంపై ఎర్రజెండా కప్పి పలువురు నివాళులర్పించారు. సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు, రచయితలు విప్లవ గీతాలను ఆలపించారు. సుధాకర్ మృతదేహాన్ని సందర్శించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. సుధాకర్ మృతదేహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి శ్మశానవాటికకు తరలించగా, సుధాకర్ అన్న ఆనందరావు అంత్యక్రియలు నిర్వహించారు.

నిఘా నీడలో మావోయిస్టు అడెల్లు అంత్యక్రియలు

బోథ్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అడుగడుగునా పోలీసుల నిఘా మధ్య మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ అంత్యక్రియలు సోమవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెరలో జరిగాయి. అంతకుముందు ఉదయ మొదలైన అంతిమ యాత్ర మధ్యాహ్నం రెండు గంటల వరకూ సాగింది. వివిధ సంఘాల కార్యకర్తలు ఎర్ర జెండాలతో చేతబూని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయగా, కొందరు కళాకారులు విప్లవ గీతాలు ఆలాపించారు. తదుపరి గ్రామ శ్మశాన వాటికలో అడెల్లు అంత్యక్రియలు పూర్తి చేశారు.

జర్నలిస్టు కొమ్మినేని అరెస్టు

పరారీలో విశ్లేషకుడు కృష్ణంరాజు.. అమరావతిని వేశ్యల రాజధానిగా చిత్రించడంపై దళిత నేత ఫిర్యాదు

- హైదరాబాద్‌లో కొమ్మినేనిని అదుపులోకి తీసుకున్న ఏపీ పోలీసులు.. విజయవాడకు తరలింపు
- నేడు మంగళగిరి కోర్టులో హాజరు
- జగన్ మీడియాపై ఏపీలో 60కి పైగా ఫిర్యాదులు



హైదరాబాద్‌లో కొమ్మినేనిని అదుపులోకి తీసుకుంటున్న ఏపీ పోలీసులు

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి వేశ్యల రాజధాని అని జగన్ చానల్లో తీవ్ర వ్యాఖ్యలు చేసిన కేసులో యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసులు అరెస్టుచేశారు. ప్రధాన నిందితుడు, ఎనలిస్టు కృష్ణంరాజు మాత్రం ఇంటికి తాళాలు వేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన కోసం పోలీసు బృందాలు పెద్దఎత్తున గాలిస్తున్నాయి. ఇటీవల జగన్ చానల్లో యాంకర్ కొమ్మినేని నిర్వహించిన లైవ్ డిబేట్లో.. అమరావతి దేవతల రాజధాని కాదు... వేశ్యల రాజధాని అని కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేశారు. కొమ్మినేని ఆయన్ను వారించకుండా చర్చను కొనసాగించారు. దీనిపై ఏపీ రాజధాని ప్రాంతం సహా రాష్ట్ర వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకాయి. మహిళలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేస్తున్నా.. ఆ ఇద్దరు గానీ, సాక్షి యాజమాన్యం గానీ కనీసం క్షమాపణలు చెప్పకపోవడంతో వారు మండిపడుతున్నారు. ఈ క్రమంలో రాజధాని ప్రాంత దళిత జేఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష తుళ్లూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యంపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు పలు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం తుళ్లూరు పోలీసులు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టుల కాలనీకి వెళ్లి కొమ్మినేని నివాసంలో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌పై సోమవారం రాత్రికి విజయవాడ తీసుకొచ్చారు. తొలుత రాజధానిలోని తుళ్లూరు పోలీసు స్టేషన్‌కు గానీ.. గుంటూరు గానీ తీసుకురావాలని భావించారు. అయితే ఈ ప్రాంతంలో తీవ్ర ఆగ్రహంతో ఉన్న మహిళలు ప్రతిఘటించవచ్చని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో పోలీసులు విజయవాడలోనే ఆయన్ను రహస్య ప్రాంతంలో ఉంచారు. రాత్రి పొద్దుపోయాక నల్లపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. మంగళవారం ఉదయం ఆయన్ను మంగళగిరి కోర్టులో హాజరుపరుస్తారని అంటున్నారు.

మూడ్రోజుల కిందటే కృష్ణంరాజు పరార్

అమరావతిపై తన వ్యాఖ్యలకు మహిళలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రధాన నిందితుడైన కృష్ణంరాజు మూడ్రోజుల కిందటే విజయవాడలోని ఇంటికి తాళం వేసి కుటుంబంతోపాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన ఆచూకీ కోసం 3 ప్రత్యేక పోలీసు బృందాలు వివిధ ప్రాంతాల్లో గాలిస్తున్నాయి. సాధ్యమైనంత త్వరలోనే కృష్ణంరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామంటున్నారు.

నిరసనలు, ఫిర్యాదుల వెల్లువ..

మరోవైపు జగన్ మీడియా తీరుపై రాష్ట్రవ్యాప్తంగా మహిళల నిరసనలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. జగన్ పత్రిక కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపడుతున్నారు. ఇదే సమయంలో ఇప్పటికే 60కి పైగా పోలీసు స్టేషన్లలో మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యంపై పెద్దఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. రాజధాని ప్రాంతమైన తుళ్లూరు పోలీసు స్టేషన్లో వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఇందులో ఏ-1గా కృష్ణంరాజు, ఏ-2గా కొమ్మినేని శ్రీనివాసరావు, ఏ-3గా సాక్షి యాజమాన్యాన్ని చేర్చారు. లైవ్ డిబేట్లో అప్పటికప్పుడు యాదృచ్ఛికంగా మాట్లాడలేదని.. ఉద్దేశపూర్వకంగానే కుట్రపూరితంగా విద్వేషాలు రెచ్చగొట్టాలనే అమరావతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసినట్లు మహిళలతో పాటు వివిధ రాజకీయ పక్షాలు, మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఆ వ్యాఖ్యలు జుగుప్సాకరం, హేయం

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: వెంకయ్య నాయుడు

న్యూఢిల్లీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): 'అమరావతిపై చేసిన జుగుప్సాకరమైన వ్యాఖ్యలు అత్యంత దారుణమైనవి, హేయమైనవని. సభ్యసమాజం సహించలేనివి' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. 'అమరావతి ప్రాంతంలో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా, ప్రవృత్తిగా జీవనం సాగిస్తూ... భవిష్యత్ తరాల కోసం రైతులు చేసిన త్యాగాలు నిరుపమానమైనవి. అలాంటి రైతులను, ముఖ్యంగా మహిళా మూర్తులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కిరాతకమైనవి. ఆడబిడ్డల ఆత్మగౌరవానికి భంగం కలిగించడం క్షమించరాని నేరం. ఇందుకు బాధ్యులైన ప్రతి ఒక్కరి మీద చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.

'సాక్షి'పై జనాగ్రహం

- ఏపీ వ్యాప్తంగా మహిళల నిరసనలు
- మంగళగిరి కార్యాలయం ముట్టడి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అమరావతి రాజధానిని వేశ్యల రాజధాని అంటూ సాక్షి టీవీ చానల్‌లో చేసిన వ్యాఖ్యలపై మహిళా లోకం భగ్గుమంది. రాష్ట్రవ్యాప్తంగా సాక్షి కార్యాలయాల ఎదుట మహిళలు ఆందోళనలు నిర్వహించారు. కొన్నిచోట్ల గేట్లెక్కి నిరసన తెలిపారు. చెప్పులు, చీపుర్లు, చాటలు చూపుతూ సాక్షి యాజమాన్యానికి హెచ్చరికలు చేశారు. పలు పట్టణ కేంద్రాల్లోనూ మహిళలు ఆందోళనలు నిర్వహించారు. పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. రాజధానిలోని తుళ్లూరు నుంచి వందల సంఖ్యలో మహిళలు మంగళగిరిలోని సాక్షి యూనిట్ కార్యాలయానికి చేరుకున్నారు. మంగళగిరి మహిళలు కూడా వారి వెంట నడిచారు. వారంతా సాక్షి కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గుంటూరు నగరంలోని సాక్షి కార్యాలయాన్నీ మహిళలు ముట్టడించారు. పొన్నూరు పట్టణంలోనూ వందలాది మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. సాక్షి మీడియాను బహిష్కరించాలని, కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులను శిక్షించాలని, జగన్, భారతి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విజయవాడ ఆటోనగర్‌లోని సాక్షి కార్యాలయం వద్ద సాక్షి బోర్డును తొలగించి కాళ్లతో తన్నారు. దిష్టిబొమ్మలు, సాక్షి ప్రతులను దహనం చేశారు. సాక్షి టీవీ చానల్‌ను బ్యాన్ చేయాలని విశాఖపట్నంలోని సాక్షి యూనిట్ కార్యాలయం ఎదుట తెలుగు మహిళలు, వీర మహిళలు డిమాండ్ చేశారు. పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేశారు.

ముగిసిన చేప ప్రసాదం పంపిణీ

- 59,231 కొర్రమీను చేప పిల్లల విక్రయాలు

గోషామహల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మృగశిర కార్తె సందర్భంగా బత్తిని కుటుంబం నిర్వహిస్తున్న చేప ప్రసాదం పంపిణీ సోమవారం ముగిసింది. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పంపిణీ సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. చేప ప్రసాదం ముగింపు సమయానికి మొత్తంగా 30 గంటల్లో 70 వేల మంది చేప ప్రసాదాన్ని స్వీకరించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప మందు దొరకని వారి కోసం దూద్‌బౌలి, కవాడిగూడ, వనస్థలిపురంలోని తమ నివాసాల్లో రెండు రోజుల పాటు చేప మందు పంపిణీ చేయనున్నట్లు బత్తిని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా చేప మందు పంపిణీకి సహకరించిన వారందరికీ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితులు ఉద్యమించాలి

- ఏపీ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 3 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారని, వారికి న్యాయం జరగాలంటే పోరాటాలకు సిద్ధంకావాలని ఏపీ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో రూ.900 కోట్ల వరకు బాధితులకు అందినా తెలంగాణలో నయాపైసా కూడా అందలేదన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం కార్యదర్శి జి.వి.రావు మాట్లాడుతూ.. ఏపీలో ఏర్పాటు చేసినట్లు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మిత్రభేదం

ఇద్దరు సెలబ్రిటీల మధ్య ఘర్షణ మిగతావారికి చూడముచ్చటగానే ఉంటుంది. అగ్రరాజ్యాధినేత డోనాల్డ్ ట్రంప్‌కూ, అపరకుబేరుడు ఎలాన్ మస్క్‌కూ మధ్యన అలనాటి ఆత్మీయతలూ ఆలింగనాలు చెరిగిపోయి, అపహాస్యాలు, అవహేళనల దశ కూడా దాటిపోయి, ఇప్పుడు అనుమానాలూ హెచ్చరికల వరకూ పరిస్థితి వచ్చేసింది. అంతిమంగా ఎవరిది పైచేయి కావచ్చునన్న విశ్లేషణలను అటుంచితే, స్వప్రయోజనాలను రక్షించుకొనే విషయంలోనే వీరిద్దరి మధ్యా ఘర్షణ ఏర్పడిన మాట వాస్తవం.

ట్రంప్‌ను గెలిపించింది తానేనన్న అహంకారం మస్క్‌కు ఉన్నా తప్పేమీలేదు. అధికారికంగా ఓ మూడువందల మిలియన్ డాలర్ల ఎన్నికల ఖర్చు భరించి, తన గుప్పిట్లో ఉన్న సోషల్‌మీడియాద్వారా ట్రంప్‌ను అమెరికా రక్షకుడుగా ప్రచారం చేసి మరీ ఆయనను కుర్చీలో కూర్చోబెట్టాడు మస్క్. అధికారంలోకి రాకముందునుంచే మస్క్‌ను మించిన మేధావి ఈ భూప్రపంచంలోనే లేడంటూ ఆకాశానికి ఎత్తేసిన ట్రంప్, కుర్చీలో కూచోగానే, తన తరువాత తనంతటివాడు ఆయనేనని స్పష్టంచేస్తూ సమస్తవ్యవస్థలనూ ప్రక్షాళించే బాధ్యతలను అప్పగించాడు. అమెరికా ఒక్కటే కాదు, మిగతా ప్రపంచం కూడా ఏనాడూ ట్రంప్‌వేరు, మస్క్ వేరు అనుకోలేదు. ఎలాన్ ఎలా అంటే అలా చెల్లుబాటయ్యేలా సమస్త శక్తినీ, సర్వాధికారాలనూ అతడికి ధారపోసి తనను అధికారంలోకి తెచ్చిన ఆ రుణం తీర్చుకోవడానికి ట్రంప్ సిద్ధపడ్డాడు. ఖర్చులు తగ్గించేపేరిట అన్నిరంగాల్లోనూ వేలుపెడుతున్నాడని, సైనిక రహస్యాలనూ, గూఢచర్యం గుట్టునూ తెలుసుకుంటున్నాడని ఎన్నో విమర్శలు వచ్చాయి, న్యాయస్థానాల్లో కేసులూ పడ్డాయి. ఇలా మస్క్ మంచి జోరుమీద ఉండగా, ఖర్చు తగ్గించే ఎజెండాకు పూర్తిభిన్నంగా ట్రంప్ తెరమీదకు తెచ్చిన సదరు బిగ్ బ్యూటిఫుల్ బిల్ ఇద్దరి మధ్యా వివాదానికి కారణమైంది. చిన్నమధ్యతరహా పరిశ్రమలకు పన్నుల్లో కోతనూ, భారీ వ్యయాన్ని ప్రతిపాదిస్తున్న ఈ బిల్లుమీద మస్క్ తన మనసులో ఉన్న ఆగ్రహాన్ని పూర్తిగా కక్కేశారు. ఒకపక్క వేలాదిమంది ఉద్యోగాలు పీకేస్తూ, విదేశీనిధులను నిలిపివేస్తూ తాను ప్రతీ డాలర్ కూడబెడుతూంటే ఈ నికృష్టపు బిల్లు ఏమిటన్నది మస్క్ వాదన. ఈ ఘర్షణ మధ్యనే, ఒక పదవిని భర్తీచేసే విషయంలో ఆర్థికమంత్రికి అనుకూలంగా ట్రంప్ వ్యవహరించినందున మస్క్ మనసు నొచ్చుకుందని, తనతో అవమానకరంగా వ్యవహరించిన ఆర్థికమంత్రి స్కాట్ బిసెంట్‌తో ముష్టిఘాతాలకు దిగాడని ఇటీవలే ఓ వార్త వెలుగులోకి వచ్చింది. యావత్ ప్రపంచంలో మస్క్‌ను మించిన మేథావి తనకు కనబడనేలేదని ఒకప్పుడు ప్రశంసించిన ట్రంప్ అదేనోటితో చివరకు పిచ్చోడని తీసిపారేశారు. మస్క్‌కు వీడ్కోలు చెప్పడానికి కూడా ట్రంప్‌కు మనసురాలేదని అంటారు. ఒక విధానపరమైన అసమ్మతిగా మొదలైన ఈ వ్యవహారానికి శ్రుతిమించిన అహంకారాలు తోడై విస్తృత రాజకీయ యుద్ధంగా మారింది. ట్రంప్ గతాన్ని తవ్వుతూ, ప్రత్యేకించి జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసు ప్రస్తావన చేస్తూ, అధ్యక్షుడిని అభిశంసించాలంటూ పోస్టులు పెట్టడం వరకూ మస్క్ పోయారు. తాను వ్యతిరేకిస్తున్న బిల్లుకు అనుకూలంగా ఓటేసిన రిపబ్లికన్లను వచ్చే ఏడాది ఎన్నికల్లో ఓడిస్తానని కూడా శపథం చేశారు. డెమొక్రాట్లకు ఆర్థికసాయం చేస్తే నిన్ను ఇక క్షమించేది లేదని ట్రంప్ మరోపక్క బెదిరిస్తున్నారు. మస్క్, టెస్లాలమీద ట్రంప్ మనసు విరిగిపోయిన కారణంగా ఆ సంస్థ లక్షలాదికోట్లు కోల్పోయింది. గతంలో స్పేస్ ఎక్స్‌ను అమితంగా శ్లాఘించిన ట్రంప్ ఇప్పుడు దానితో ఫెడరల్ ప్రభుత్వానికి ఉన్న కాంట్రాక్టులన్నీ రద్దుచేస్తానని బెదిరిస్తూ, నాసా ప్రాజెక్టుల భవిష్యత్తునే ప్రశ్నార్థకంగా మార్చేశారు.

తనకు హామీ ఇచ్చినదానికి భిన్నంగా చమురులాబీ పక్షాన ట్రంప్ నిర్ణయాలు కొనసాగుతూండటంతో, ఈ విద్యుత్ వాహనాల తయారీదారుడు తట్టుకోలేకపోతున్నారని అంటారు. నాసా అధినేత నియామకం కూడా ఇరువురి మధ్యా వైషమ్యాలు పెంచిందట. ట్రంప్–మస్క్ వివాదం రాజకీయాల్లో వ్యాపారవేత్తల ప్రత్యక్షపాత్రమీద తీవ్ర చర్చను లేవనెత్తుతోంది. పారిశ్రామికవేత్తలకు, రాజకీయనాయకులకు మధ్య ఉన్న సంబంధం తెలియనిదేమీ కాదు. ఎన్నికల ఖర్చుకోసం వారినుంచి నిధులు అందుకోవడం, అధికారంలోకి వచ్చిన తరువాత వారికి కొన్ని మేళ్ళు చేసిపెట్టడం అనాదిగా ఉన్నదే. కానీ, అమెరికాను మళ్ళీ మహోన్నత దేశంగా నిలబెడతానన్న ట్రంప్ తనకు ఎన్నికల నిధులు సమకూర్చిన మస్క్‌కు ప్రభుత్వంలో కీలకబాధ్యతలు అప్పగించి చిట్టచివరకు తనకూ, దేశానికీ కూడా అప్రదిష్ఠ మిగిల్చారు.

యుద్ధారవాలు... నదీబంధనాలు!

మధ్యతరగతి ప్రజల్లో వారుణాస్త్రం గురించి తెలియనివారు ఉండరు. ప్రాచీన సాహిత్యంతో పరిచయం లేకపోయినా పౌరాణిక సినిమాలు కొన్నైనా చూసి ఉంటే దాని మహిమ కొంతైనా అర్థం అవుతుంది. ప్రత్యర్థులను అన్నివైపుల నుంచి నీటి ఉధృతిలో ముంచి ఆయుధాలు ప్రయోగించకుండా కట్టడిచేసి యుద్ధంలో పైచేయి సాధించటం వారుణాస్త్ర ప్రయోగ లక్ష్యంగా ఉండేది. కల్పిత కథల్లో ఊహాస్త్రంగా దాన్ని భావించినప్పటికీ, నీటిని ఆయుధంగా ఉపయోగించుకుని శత్రువును దెబ్బతీయటం అన్ని దేశాల చరిత్రల్లో కనపడుతుంది. కాలువలకు గండికొట్టటం, వంతెనలను కూల్చటం, చెరువులను విషతుల్యం చేయటం, డ్యాంల్లో నీటిని ఒక్కపెట్టున వదలటం యుద్ధాల్లో ఎన్నో సార్లు జరిగింది. యుద్ధనీతులు, ధర్మాల పాటింపు గురించి గొప్పగా చెప్పుకొన్నా ఆచరణలో వాటికి విరుద్ధంగా జరిగిన దారుణాలే ఎక్కువ.

పహల్గాంలో తీవ్రవాదుల కిరాతం తర్వాత మళ్లీ నీటి యుద్ధాల ప్రస్తావనలు ఎక్కువయ్యాయి. ఆ దారుణానికి ప్రతీకార చర్యగా సింధూ జలాల ఒప్పందం అమలును తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తర్వాత పాకిస్థాన్ పాదాక్రాంతం అవ్వక తప్పదనే వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. సింధూ జలాలను కట్టడి చేస్తే పాకిస్థాన్ నవనాడులూ కుంగిపోతాయని ప్రభుత్వవర్గాల అంచనాలతో ఏకీభవించే వారందరూ ప్రకటనలతో హోరెత్తించారు. సింధూ జలాల ఒప్పందాన్నీ అది కుదరటానికి జరిగిన 10 ఏళ్ల కసరత్తునీ లోతుగా పరిశీలించిన వారు.. దాన్నుంచి వైదొలగటం అంతతేలిక కాదనే విషయాన్ని పదేపదే చెబుతున్నా దాన్ని పట్టించుకునే వారి సంఖ్య తక్కువగానే ఉంది. ఒప్పందం కుదిరి 65 ఏళ్లు అవుతున్నా భారత్ తనకు కేటాయించిన జలాలనే ఇంకా పూర్తిగా ఉపయోగించుకోలేదు. అనుకున్న విధంగా జలవిద్యుత్తు ప్రాజెక్టులనూ సకాలంలో కట్టలేకపోయింది. లభించిన నీటిని పూర్తిగా ఉపయోగించుకోటానికి ఇంకా పదేళ్లు పట్టొచ్చు. కనీవినీ ఎరగనంత వేగంతో ఇప్పుడు ప్రాజెక్టులను కట్టి నీటిని నిలువరించినంత మాత్రాన పాక్ నుంచి తీవ్రవాదం ముప్పు ఆగుతుందన్న భరోసా లేదు!

మత భావజాలం ఆధారంగా తలెత్తే తీవ్రవాదాలు ప్రభుత్వాలను సైతం ఖాతరుచేయని పరిస్థితులే చాలా చోట్ల ఉన్నాయి. ఒకనాటి రష్యాని దెబ్బతీయటానికీ, కమ్యూనిస్టు భావజాలం విస్తరించకుండా ఉండటానికీ ఇస్లామిక్ తీవ్రవాదానికి అమెరికా అండదండలు అందించింది. గల్ఫ్, అరబ్బు దేశాల్లో రాచరిక, మత రాజ్యాలకు దశాబ్దాలపాటు చేదోడు వాదోడుగా నిలబడింది. ఇప్పటికీ నిలుస్తోంది. ఇస్లామిక్ తీవ్రవాద శక్తులు తనకు ముప్పుగా పరిణమించే స్థాయికి వచ్చినప్పుడు మాత్రమే 'వార్ ఆన్ టెర్రర్' అంటూ యుద్ధాలు మొదలుపెట్టి వాటిని సైతం మధ్యలో వదలివేసింది. ఆఫ్ఘనిస్థాన్‌ను మళ్లీ తాలిబన్లకు అప్పగించటమే ఇందుకు నిదర్శనం. అమెరికా ప్రత్యక్ష, పరోక్ష ఆశీస్సులు లేని నిరంకుశ, అప్రజాస్వామిక దేశాలను ఇప్పటికీ వేళ్లమీద లెక్కించొచ్చు.

తీవ్రవాద, మతతత్వ భావజాలాలను ఓడించటంలో హింస, అణచివేత, ఆయుధ ప్రయోగాల పాత్ర ఉన్నా వాటితోనే అవి సమసిపోయిన సంఘటనలు ఆధునిక చరిత్రలో కనపడవు. తీవ్రవాదం పట్ల ఆకర్షితంకాని రీతిలో ఆర్థిక ఫలాలనూ భద్రమైన జీవితాన్నీ ప్రజలకు అందించటమే అసలు పరిష్కారం అన్నది కాదనలేని సత్యం. తీవ్రవాద సంస్థలకూ బృందాలకూ నాయకత్వం వహించే వారు పైవర్గాల నుంచి వచ్చినా ఆయుధధారులై ముందుండే వాళ్లలో అట్టడుగువర్గాలే ఎక్కువ. ఆర్థికంగా ఫలాలు దక్కని అసంతృప్తులే తీవ్రవాదానికి అసలుసిసలైన పదాతిదళాలుగా వ్యవహరిస్తున్నారు.



ఇప్పటికే పాక్‌కు అన్ని విధాలుగా చేదోడు వాదోడుగా మారిన చైనా.. సింధూ జలాల ఒప్పందంపై మౌనంగా ఉంటుందనీ చెప్పలేం. భూటాన్, ఆఫ్ఘనిస్థాన్ మినహా భారత్ చుట్టూ ఉన్న అన్ని దేశాల్లోనూ చైనా ప్రాబల్యాన్ని విపరీతంగా పెంచుకుంటోంది. ఒకరకంగా ఇది చైనా చక్రబంధం. దీని నుంచి చాకచక్యంగా బయటపడటమే ఇప్పుడు అత్యవసరం. యుద్ధారవాలతో దీన్ని తొలగించుకోలేం. ఉన్మత్త ప్రలాపాలు దౌత్యనీతికి ప్రత్యామ్నాయాలు కాలేవు!

భారత ఉపఖండంలో నదీ వ్యవస్థలు చాలా సంక్లిష్టమైనవి. కోట్లమందిని ప్రభావితంచేసే ఆ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని తీవ్రవాదాన్ని కట్టడి చేయాలనుకోవటం వ్యూహాత్మకంగా ప్రమాదాలూ సవాళ్లతో కూడుకున్నది. వాతావరణ మార్పులతో నదీ వ్యవస్థలు ఇప్పటికే అల్లకల్లోలం అవుతున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే రానున్న కొన్ని దశాబ్దాల్లో పంటల దిగుబడుల్లో 10 నుంచి 40 శాతం లోపు కోతలుపడే ప్రమాదం ఉందన్న హెచ్చరికలను పర్యావరణ శాస్త్రవేత్తలు చేస్తున్నారు. 2010 జులైలో పడిన భారీ వర్షాలతో సింధూనది పరివాహక ప్రాంతం కకావికలైంది. పాకిస్థాన్‌లో అయిదో వంతు భూభాగం వరద తాకిడికి గురైంది. రెండు కోట్ల మంది తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. 140 లక్షల మంది ఇళ్లను పోగొట్టుకున్నారు. వేలమంది చనిపోయారు. ఆర్థిక వృద్ధిలో 2 శాతం కోతపడింది. నదుల పరివాహక ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకోకుండా డ్యాంలు కట్టుకుంటూ పోయి, వాటిని రాజకీయ కారణాలతో నియంత్రించటం మొదలుపెడితే 2010 నాటి తరహా బీభత్సాలను ఎదుర్కోవటం ఇంకా కష్టమవుతుంది. మానవ ధనదాహ కార్యకలాపాల ప్రమేయంతో హిమాలయ నదుల ప్రవాహ ప్రకోపం ఊహించని రీతిలో వ్యక్తమవుతోంది. పాక్‌తో పాటు భారత్, బంగ్లాదేశ్‌లకు ఆ ప్రమాదం ఏదోరకంగా ఎదురవుతూనే ఉంది. గంగ, బ్రహ్మపుత్ర నదులకు తరచూ వస్తున్న వరదలే ఇందుకు నిదర్శనం. సముద్రమట్టాల పెరుగుదలకూ అదే ప్రధాన కారణం.



■ రాహుల్ కుమార్

సింధూ దాని ఉపనదుల కింద ఈనాటి వ్యవసాయానికి ఉన్న చరిత్ర కొంత విశిష్టమైంది. బ్రిటిష్ కాలంలో ఏర్పాటైన కాలువ కాలనీలతో అది మొదలైంది. ఈ కాలనీల కింద 60 లక్షల ఎకరాల పైచిలుకే సాగవుతోంది. 1885 నుంచి 1940 వరకూ తొమ్మిది కాలువ కాలనీలను సృష్టించారు. కాలువలు ప్రవహించే ప్రాంతాలకు తరలి వెళ్లటం ఉమ్మడి పంజాబు చరిత్రను తీవ్రంగా ప్రభావితం చేసింది. బ్రిటిషు పాలకులు అక్కడికి వలసలను విపరీతంగా ప్రోత్సహించారు. ముఖ్యంగా మాజీ సైనికులకు పెద్ద ఎత్తున భూములను పంపిణీ చేశారు. జాట్ సిక్కులు, ముస్లిం రాజ్‌పుత్‌లు మాజీ సైనికుల్లో ప్రధానంగా ఉండేవారు. మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యే నాటికి భారత్‌లోని మొత్తం సైన్యంలో 60 శాతం మంది ఉమ్మడి పంజాబు రాష్ట్రం నుంచే ఎంపికయ్యారు. వీరోచిత జాతులుగా కొన్ని కులాలనే బ్రిటిషు పాలకులు పరిగణించేవారు. సైన్యంలో చేర్చుకునేటప్పుడే ప్రతి వ్యక్తి కులాన్నీ, వారి వంశ వీరోచిత చరిత్రనూ విపులంగా నమోదు చేసేవారు. దేశ విభజన సందర్భంగా కాలువ భూములను వీడాల్సిన పరిస్థితి పంజాబులో లక్షల కుటుంబాల జీవితాలను తలకిందులను చేసింది. సైనిక నేపథ్యం ఉండి, ఆయుధ ప్రయోగ సామర్థ్యం ఉన్న ప్రజల మధ్య మత వైషమ్యాలు రాజుకోవటం.. లక్షలాది ప్రాణాలను కోల్పోయేలా చేశాయి. పంజాబు కాలువల కాలనీ ప్రాంతాల నుంచి వచ్చిన వారే ఇప్పటికీ పాక్ సైన్యాన్ని శాసిస్తున్నారు. అక్కడి ఉన్నతోద్యోగులూ అధికంగా ఆ ప్రాంతం వారే. పాక్‌లో 'పంజాబు సామ్రాజ్యవాదం' రాజ్యమేలుతోందన్న భావం ఏర్పడటానికి ఈ ఆధిపత్యమే కారణం.

బ్రిటిషు పాలకులు సృష్టించిన కృత్రిమ సరిహద్దుల పరిధుల్లో నదుల వ్యవస్థలను సక్రమంగా, పర్యావరణ హితంగా ఉపయోగించుకోవటం భారత ఉపఖండం ముందున్న పెద్ద సవాలుగా ప్రముఖ దక్షిణాసియా చరిత్రకారుడు ఇయన్ టాల్‌బట్ వ్యాఖ్యానించారు. ఆ సరిహద్దుల పరిధులు దాటే విధంగా దేశాలు ఆలోచనలు చేసి సరైన పర్యావరణ వ్యూహంతో ఆచరించకపోతే విపరిణామాలనే ఎదుర్కోవల్సి వస్తుందని కూడా హెచ్చరించారు. ఉదాహరణకు బంగ్లాదేశ్ ఉపరితలంపై ప్రవహించే నీటిలో 90 శాతం టిబెట్, భారత్‌లో ఉన్న నదీవ్యవస్థల నుంచే వస్తుంది. అంటే బయటి దేశాల్లో కట్టే డ్యాంలు, రిజర్వాయర్లు, కాలువలు, అడవుల నిర్వహణ బంగ్లాదేశ్ నీటి లభ్యతను, వరదలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. సింధు, బ్రహ్మపుత్ర నదులు టిబెట్ భూభాగం నుంచే మొదలవుతాయి. నదుల ఆరంభ పరిసర ప్రాంతాలపై ఆధిపత్యం ఉన్న దేశాలు అనుసరించే విధానాలు ప్రవాహాలను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశాలే ఎక్కువ. పాక్, బంగ్లాదేశ్‌లను భారత్ అలా ప్రభావితం చేస్తే భారత్ విషయంలో చైనా కూడా అదే దారితొక్కే అవకాశం ఉంటుంది. నదీ ప్రవాహాల సమస్య దక్షిణాసియా దేశాల సంబంధాలను భవిష్యత్తులో తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉందని 2016లో టాల్‌బట్ ఊహించినదే నిజమైతే నిరంతర ఉద్రిక్తతలతో ఆర్థిక వ్యవస్థలూ ప్రజలూ సతమవ్వక తప్పదు.

ఇంకో ఆసక్తికరమైన విషయాన్నీ ఇక్కడ చెప్పుకోవచ్చు. భారత్–బంగ్లా సరిహద్దు 2500 మైళ్లు ఉంటే అందులో నాలుగోవంతు నదులే సరిహద్దులుగా ఉన్నాయి. వీటి ప్రవాహమార్గాలు మారిపోవటంతో రెండు దేశాల మధ్య ఎన్నో పేచీలు తలెత్తుతున్నాయి. నదుల ప్రవాహాలు మారటంతో ఏర్పడే ఇసుక దిబ్బల హక్కులు కూడా వివాదాలకు దారితీస్తున్నాయి. లక్షలమంది ఈ దిబ్బలపై ఆధారపడి మనుగడ సాగించటం అక్కడ సర్వసాధారణం.

నదుల ఆరంభ పరిసర ప్రాంతాలపై ఆధిపత్యం ఉన్న దేశాలు అనుసరించే విధానాలు ప్రవాహాలను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశాలే ఎక్కువ. పాక్, బంగ్లాదేశ్‌లను భారత్ అలా ప్రభావితం చేస్తే భారత్ విషయంలో చైనా కూడా అదే దారితొక్కే అవకాశం ఉంటుంది.

దక్షిణాసియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో సింధూజలాల ఒప్పందం నుంచి వైదొలగి నచ్చిన రీతిలో డ్యాంలు కట్టుకుని, విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవటం అనేది ఏటికి ఎదురీదటం లాంటిది. దానికి చెల్లించాల్సిన మూల్యమూ ఎక్కువగానే ఉండొచ్చు! ప్రపంచబ్యాంకు చొరవతో 1960లో భారత్–పాక్ మధ్య ఆ ఒప్పందం జరిగినా దానికి ముందు పదేళ్లపాటు చర్చలు సాగాయి. అమెరికా తెరవెనుక నుంచీ మొత్తం వ్యవహారాన్ని నడిపించింది. సింధూ, దాని ఉపనదుల జలాలపై పాక్‌లో 15 కోట్ల మంది ప్రజలు ఆధారపడి ఉన్న నేపథ్యంలో భారత్ కొత్త ప్రాజెక్టులు కడితే అమెరికా ఎలా వ్యవహరిస్తుందో ఇప్పుడే చెప్పలేం. గతంలో లాగా పాక్ అవసరం అమెరికాకు ఇప్పుడు లేదు. పావు శతాబ్దం నుంచి భారత్‌కు దగ్గర అవ్వటానికే అమెరికా ప్రయత్నిస్తోంది. మరోవైపున టిబెట్ నుంచి పెద్దఎత్తున నీటిని తరలించటానికి చైనా భారీ ప్రణాళికలే రచిస్తోంది. బ్రహ్మపుత్ర నుంచి హోయాంగ్ హో (యల్లో రివర్) నదిలోకి అనేక మార్గాల ద్వారా నీటిని మళ్లించి ఉత్తర చైనా నీటి, విద్యుత్తు సమస్యలను తీర్చనుంది. చైనా సగం జనాభా ఉత్తరభాగంలోనే ఉంది. బ్రహ్మపుత్రపై 60000 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే మహా భారీ ప్రాజెక్టుకు కిందటి డిసెంబరులో అనుమతులు కూడా మంజూరు చేసింది. ఇప్పటికే పాక్‌కు అన్ని విధాలుగా చేదోడు వాదోడుగా మారిన చైనా.. సింధూ జలాల ఒప్పందంపై మౌనంగా ఉంటుందనీ చెప్పలేం. భూటాన్, ఆఫ్ఘనిస్థాన్ మినహా భారత్ చుట్టూ ఉన్న అన్ని దేశాల్లోనూ చైనా ప్రాబల్యాన్ని విపరీతంగా పెంచుకుంటోంది. ఒకరకంగా ఇది చైనా చక్రబంధం. దీని నుంచి చాకచక్యంగా బయటపడటమే ఇప్పుడు అత్యవసరం. యుద్ధారవాలతో దీన్ని తొలగించుకోలేం. ఉన్మత్త ప్రలాపాలు దౌత్యనీతికి ప్రత్యామ్నాయాలు కాలేవు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

జాతికిబాట పైడిమర్రి 'ప్రతిజ్ఞ'

జాతీయ గీతం, జాతీయ గేయాలను ఎవరు రచించారని విద్యార్థులనడిగితే.. ఠక్కున సమాధానం చెప్తారు. ఆ రచయితలకు చరిత్రలో సముచిత స్థానం లభించింది. 'ప్రతిజ్ఞ' రచయిత ఎవరని అడిగితే మాత్రం కొందరే సమాధానం చెప్తారు!

జూన్ 10, 1916లో నల్లగొండ జిల్లా అన్నెపర్తి గ్రామంలో పైడిమర్రి వెంకటసుబ్బారావు జన్మించారు. పలు భాషల్లో ప్రావీణ్యం ఉన్న పైడిమర్రి.. వెట్టిచాకిరి, భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా పలు రచనలు చేశారు. ఆయన తన 18వ ఏటనే 'కాలభైరవుడు' కలం పేరుతో ఓ నవల రాశారు. 'ఉషస్సు కథలు' కథా సంపుటిని రచించారు. దేవదత్తుడు, తులసీదాస్, త్యాగరాజు మొదలైన పద్యకావ్యాలు, బ్రహ్మచర్యం, గృహస్థ జీవితం, స్త్రీధర్మం, ఫిరదౌసి, శ్రీమతి అనే నాటకాలు రాశారు. అనేక అనువాద రచనలూ చేశారు. 1945–46సంవత్సరాల్లో నల్లగొండలో నిర్వహించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సభల్లో ప్రముఖ పాత్ర వహించారు.



ప్రతిజ్ఞను పైడిమర్రి 1962లో రచించారు. దాన్ని చదివి ఉప్పొంగిపోయిన సాహితీవేత్త తెన్నేటి విశ్వనాథం, నాటి విద్యాశాఖ మంత్రి పీవీజీ రాజు దృష్టికి తీసుకెళ్లారు. తరువాత బెంగళూరులో నిర్వహించిన కేంద్ర విద్యా సలహా మండలి సమావేశంలో ఈ రచనను జాతీయ ప్రతిజ్ఞగా ఆమోదించారు. 'భారతదేశం నా మాతృభూమి..' అంటూ సాగే ప్రతిజ్ఞ (జనవరి 26, 1965 నుంచి) దేశంలోని ప్రతి పాఠశాలలో రేపటి పౌరుల గుండెల నిండా దేశభక్తిని పాదుకొల్పుతున్నది. పైడిమర్రి పేరు అంతగా ప్రాచుర్యంలో లేకపోవడం పెద్ద చారిత్రక తప్పిదంగా నేటితరం రచయితలు, మేధావులు గుర్తించారు. ఎలికట్టె శంకర్రావు 2011లో 'ప్రతిజ్ఞ పదశిల్పి పైడిమర్రి' అనే పేరుతో ప్రత్యేక సంచికను ప్రచురించారు. అంతకుముందు ఇదే పేరుతో ఆంధ్రజ్యోతి దినపత్రిక ఓ వ్యాసాన్ని ప్రచురించింది. పైడిమర్రి జీవితచరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని జన విజ్ఞాన వేదిక డిమాండ్ చేసింది. ఫలితంగా 6వ తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో పైడిమర్రి జీవిత చరిత్రను పొందుపర్చారు.

పైడిమర్రి జీవిత చరిత్రను ఎం.రాంప్రదీప్ తెలుగులో 'భారతదేశం నా మాతృభూమి' పేరుతోనూ, ఆంగ్లంలో 'ది ఫర్గాటెన్ పేట్రియాట్' పేరిట ప్రచురించారు. పైడిమర్రి విగ్రహాన్ని ఆయన స్వగ్రామంలో ఏర్పాటు చేయిస్తామని ఆయన శతజయంతి ఉత్సవాల సందర్భంగా 2016లో తెలంగాణ సాహితీవేత్తలు ప్రకటించారు. కానీ అది నేటికీ కార్యరూపం దాల్చకపోవడం విచారకరం. దేశానికి 'ప్రతిజ్ఞ'ను అందించిన పైడిమర్రిని సముచితంగా గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– యం. రాంప్రదీప్

(నేడు పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి)

ఎవరికి ఈ సంబురాలు?

తెలంగాణ ఆవిర్భవించి పదకొండేళ్లు నిండాయి. కానీ ఉద్యమకారుల జీవితాలేమాత్రం మారలేదు. వారి కోసం ప్రభుత్వాలు ఇప్పటి వరకూ చేసిందేమీ లేదు. వారి వల్లనేకదా ఈనాడు తెలంగాణకు చెందినవారు పాలకులై రాష్ట్రాన్ని ఏలుతున్నారు! ఉద్యమకారులపై ప్రభుత్వాలకు కృతజ్ఞతా భావన ఎందుకు లేదు? ఉద్యమ కాలంలో చాలామంది తమ విలువైన సమయం, యవ్వనం తెలంగాణ సాధనకే అంకితం చేశారు. మరి తెలంగాణ పాలకులే కదా ఇప్పుడు వారి త్యాగాలను గుర్తించి ఆదుకోవాల్సింది?! మొన్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు.. ప్రభుత్వం తమకు గతంలో ఇచ్చిన హామీల తాలూకు ప్రకటన చేస్తుందని ఉద్యమకారులంతా ఎదురు చూశారు. కానీ వారికి నిరాశే మిగిలింది.



1969 నాటి తొలిదశ ఉద్యమకారులెందరో చనిపోయారు. ప్రస్తుత ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందనే ఆశతో మలిదశ ఉద్యమకారులు బతుకుతున్నారు. కానీ ఈ ఎదురుచూపుల్లోనే ఎందరో ఉద్యమకారుల జీవితాలు రోజురోజుకూ చితికిపోతున్నాయి.

ఊరూరా ఒక కాలనీ.. అందులో ఇందిరమ్మ పేరు మీదనో, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ పేరు మీదనో, ఏదో విధంగా పాలకులకు విశ్వసనీయత దక్కేలా ఉద్యమకారులకు గృహాలు నిర్మించి ఇవ్వొచ్చు కదా! నాణ్యమైన వైద్యం నేడు చాలా పిరం అయిపోయింది. హెల్త్ ఇన్సూరెన్సు, బతుకుదెరువుకు ఉపాధి అవకాశాలు కల్పించి ఉద్యమకారులను ఆదుకోవాల్సిన అవసరం పాలకులపై ఉన్నది. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం కనీసం ప్రాథమికంగా ఒక ఐడెంటిటీ కార్డ్ లేదా సర్టిఫికెట్ ఇచ్చి గౌరవించినా, వారి పోరాటానికి కొంత గుర్తింపు, విలువ ఇచ్చినవారవుతారు.

ఉద్యమకారులను ఆదుకోవడమంటే.. ఓ పదిమందికి తలో కోటి రూపాయలు, ప్లాట్ ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదు. గత ప్రభుత్వం తమ పార్టీకి అనుబంధంగా ఉన్న కొంతమందిని మాత్రమే పట్టించుకున్నది. అసలైన ఉద్యమ సమాజాన్ని పట్టించుకోలేదు. ఈ పరిస్థితిని మారుస్తామంటూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక రెండో ఏడాది ఆవిర్భావదినోత్సవ వేడుకల్లోనూ ఉద్యమకారులకు అనుకూల ప్రకటనేమీ రాకపోవడం విచారకరం. ఐతే, ఉద్యమకారులు ఇప్పుడు ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు వదులుకుని నిరాశాజీవుల్లా మిగిలిపోతారో లేక తెలంగాణ ఉద్యమంలో చూపిన పోరాట పటిమను ప్రదర్శిస్తారో, లేదా ఇంకేదైనా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకొని తమ హక్కులను సాధించుకుంటారో! ఆ లోపు ప్రభుత్వమే గ్రహించి, వారికిచ్చిన హామీలను నెరవేరిస్తే మరో ఉద్యమం అవసరం ఉండదు.

– సయ్యద్ రఫీ (చిత్ర దర్శకుడు)

రైతు లాభంతో కార్పొరేట్లకు నష్టమా?

శివరాజ్ సింగ్ చౌహాన్ కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా సంవత్సర కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంలో 'బిజినెస్ స్టాండర్డ్' అనే ఒక ఆంగ్ల వాణిజ్య పత్రిక ఆయనను ఇంటర్వ్యూ చేసింది. గతంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలం పని చేసి, వ్యవసాయ రంగం పట్ల విశేష శ్రద్ధ చూపిన వాడిగా, కేంద్రంలో ఆయన హయాంలో రైతాంగానికి మంచి జరుగుతుందని మనం ఆశించడం సహజం. కాగా, ఆయన ఇచ్చిన ఈ ఇంటర్వ్యూను పరిశీలిస్తే ఆయన పని చేస్తున్న చట్రంలో రైతాంగానికి ఆయనైనా ఎవరైనా పెద్దగా ఒరగ పెట్టగలగింది ఏమీ లేదని అర్థం అవుతుంది.

మొదటుగా అసలు దేశంలో రైతాంగానికి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కావల్సింది ఏమిటి? అనేది ప్రశ్న. దీనికి రెండు జవాబులు ఉన్నాయి: ఒకటి– వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం ద్వారా రైతు ఆదాయాన్ని పెంచడం. రెండవది– వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను హామీ చేయడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం.

అనేక దశాబ్దాల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే, హరిత విప్లవం అనంతరం దేశంలో వ్యవసాయ ఉత్పత్తి భారీగా పెరిగినప్పటికీ, వ్యవసాయదారుల స్థితిగతులు మాత్రం రాను రాను దిగజారిపోతున్నాయి. 1970–2015ల మధ్య 45ఏళ్ళ కాలంలో గోధుమలకు కనీస మద్దతు ధర కేవలం 19 రెట్లు మాత్రమే పెరిగింది. కాగా, అదే కాలంలో ప్రభుత్వ ఉద్యోగుల ఆదాయాలు 120 రెట్లు, కళాశాల ఉపాధ్యాయుల వేతనాలు 150 రెట్లు, పాఠశాల ఉపాధ్యాయుల ఆదాయాలు 280 రెట్లు పెరిగాయి!

అంటే ఇక్కడ, ఉత్పత్తిని పెంచుతూ పోయినా రైతాంగం ఆర్థిక స్థితి మెరుగుపడదని మనకు అర్థం అవుతుంది. ఇందుకే స్వయంగా శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యవసాయరంగ 'అనుకూల' పాలనా కాలంలో కూడా మధ్యప్రదేశ్‌లో రైతాంగ సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోయాయి. వాస్తవానికి శివరాజ్ సింగ్ పాలనా కాలంలో మధ్యప్రదేశ్‌లో వ్యవసాయ రంగం దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా అద్భుతమైన ముందడుగు సాధించింది. అక్కడ ఉత్పత్తి విపరీతంగా పెరిగింది. ఉదాహరణకు, ఆ రాష్ట్రంలో 2011–12లో 149 లక్షల టన్నులుగా ఉన్న వరి, గోధుమలు, ముతకధాన్యాలు, పప్పుధాన్యాల ఉత్పత్తి, 2021–22 నాటికి 349 లక్షల టన్నులకు, అంటే రెట్టింపుకు పెరిగింది. ఇది, ఆ రాష్ట్ర వ్యవసాయ రంగంలో సగటున 9.12 శాతం వార్షిక వృద్ధి రేటుకు సమానం.

ఇంతగా ఉత్పత్తి సాధించినప్పటికీ రైతాంగానికి వ్యవసాయం మాత్రం లాభసాటి కాలేదు. పైగా, ఈ రికార్డు స్థాయి పంటల ఉత్పత్తితో మార్కెట్‌లో సరఫరా భారీగా పెరిగి ధరలు పతనమయ్యాయి. రైతులు రికార్డు స్థాయి పంటలను పండించినా, వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిన్నా– అంటే, పంట ఉత్పత్తి పెరిగినా, పడిపోయినా– అంతిమ ఫలితం మాత్రం రైతు నష్టపోవడమే అన్నది మధ్యప్రదేశ్ రైతాంగానికి అర్థమయింది. అందుకే 2017లో మధ్యప్రదేశ్‌లోని మాందసూర్‌లో రైతాంగం ఆందోళనలకు దిగింది. గిట్టుబాటు ధరల కోసం, వర్షాభావం వల్ల జరిగిన పంట నష్టానికి పరిహారం కోసం ఉద్యమిస్తోన్న రైతాంగంపై కాల్పులు జరిగాయి, ఆరుగురు రైతులు చనిపోయారు. ఫలితంగా, వ్యవసాయ ఉత్పత్తిలో ప్రగతి సాధించినప్పటికీ, మధ్యప్రదేశ్‌లో 2018 ఎన్నికలలో శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఓటమి పాలయ్యింది.

కార్మికులనూ, ఉద్యోగులనూ సాధ్యమైనంత తక్కువ వేతనాలతో పని చేయించుకోవడం కార్పొరేట్ల స్వభావం. దీని కోసం నగర ప్రాంతాల్లో నిత్యావసరాల ధరలు సాధ్యమైనంత తక్కువ ఉండటం కూడా వారికి అవసరం. ఇందుకోసమే కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాలు రైతు ప్రయోజనాలనూ, ఆర్థిక స్థితిగతులనూ పణంగా పెట్టి, వారి ఉత్పత్తులను తక్కువ ధరకు నగరాలకు తరలిస్తున్నాయి. నేడు అమలు జరుగుతోన్న సంస్కరణల సారాంశం ఇదే.



ఈ సమస్యల నేపథ్యంలోనే దేశ రైతాంగం కూడా మూడు రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీని చుట్టుముట్టి ఆందోళనకు దిగింది. ప్రధాని నరేంద్ర మోదీ రైతాంగానికి క్షమాపణ చెప్పి ఆ మూడు చట్టాలను ఉపసంహరించుకున్నారు. అలాగే కనీస మద్దతు ధర అంశం పైన కమిటీని కూడా ఏర్పరిచారు. అయితే, అనంతంగా సాగుతోన్న చర్చోపచర్చలు, కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచనల తర్వాత కూడా, నేటికీ, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కావాలనే రైతాంగ డిమాండ్ అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఈ విషయంలో ప్రభుత్వ మొండి వైఖరికి కారణం ఏమిటి?

ఇంటర్వ్యూలో ఈ అంశంపై శివరాజ్ సింగ్ చౌహాన్ పలుమార్లు జవాబును దాటవేశారు. "మీ ప్రభుత్వం ఉత్పత్తి పెంపుదలపై అతిగా దృష్టిని పెడుతోంది, కాగా భారత రైతాంగం తాలూకు అసలు సమస్య పడిపోతూవున్న వారి ఆదాయాలు" అన్న ప్రస్తావనకు స్పందనగా చౌహాన్: "...ఒక ప్రక్కన మేము 145 కోట్ల జనాభాకు సేవ చేయవలసి ఉంది," అనే అస్పష్టమైన జవాబును ఇచ్చారు. అయితే దీని పరమార్థం స్పష్టమే! "మేము రైతాంగానికి గిట్టుబాటు ధరలను ఇస్తే– అది దేశంలోని మిగతా జనాభాకు సమస్య అవుతుంది" అని ఆ మాటల అర్థం. అదెలా? అన్న ప్రశ్నకు జవాబు సులువే. రైతుకు గనుక స్వామినాథన్ కమిటీ సూచించిన తరహాలో గిట్టుబాటు ధరను ఇస్తే – అది వినియోగదారులకు ధరల పెరుగుదల రూపంలో 'భారం' అవుతుందనేది– ఈ జవాబు అంతరార్థం.

అయితే, కనీస మద్దతు ధర విషయంలో ప్రభుత్వం రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకపోవడానికి కారణం వినియోగదారుల ప్రయోజనమేనా? ఖచ్చితంగా కాదు. ఇదే నిజమైతే మన పాలకులు ప్రజల కనీస అవసరాలపైన కూడా జి.ఎస్.టి వంటి పన్నులను విధించేవారు కాదు. ఈ పన్నుల భారం వలన కూడా, నేడు మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరిగాయన్నది తెలిసిందే.

అసలు సమస్య వినియోగదారులది కాదు. కార్పొరేట్ యజమానులది. ఎలాగంటే – రైతాంగానికి కనీస మద్దతు ధర ఇవ్వటం వల్ల నగర ప్రాంతాలలో వినియోగదారులకు ధరలు పెరిగాయనుకుందాం. ఈ వినియోగదారుల్లోని అత్యధికులు కార్మికులు, ఉద్యోగులే ఉంటారు. వీరు ధరల భారాన్ని భరించలేక తమ యజమానులను అధిక వేతనాల కోసం డిమాండ్ చేస్తారు. అదీ అసలు కథ! అంటే, రైతుకు మద్దతు ధర ఇవ్వటం వల్ల ఉద్యోగులూ, కార్మికులు అధిక వేతనాల కోసం కార్పొరేట్ల మీద ఒత్తిడి తెస్తారు కాబట్టే, కార్పొరేట్లకు ఇబ్బంది కలుగుతుంది కాబట్టే, ప్రభుత్వం మద్దతు ధరలకు సుముఖంగా లేదు!

కార్మికులనూ, ఉద్యోగులనూ సాధ్యమైనంత తక్కువ వేతనాలతో పని చేయించుకోవడం కార్పొరేట్ల స్వభావం. లాభాలను పెంచుకోవడం కోసం వారికి ఇది అవసరం. దీని కోసం నగర ప్రాంతాల్లో నిత్యవసరాల ధరలు సాధ్యమైనంత తక్కువ ఉండటం కూడా వారికి అవసరం. ఇందుకోసమే కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాలు రైతు ప్రయోజనాలనూ, ఆర్థిక స్థితిగతులనూ పణంగా పెట్టి, వారి ఉత్పత్తులను తక్కువ ధరకు నగరాలకు తరలిస్తున్నాయి. నేడు అమలు జరుగుతున్న సంస్కరణల సారాంశం ఇదే. గ్రామాలను కొట్టి నగరాలకూ పెట్టడమే! నగరాలకు పెట్టడమంటే అంతిమంగా నగర ప్రాంత కార్పొరేట్లకు దోచిపెట్టడమే! ఈ క్రమంలో గత మూడు దశాబ్దాలుగా రైతాంగానికి వ్యవసాయం నష్టదాయకమై, వారి ఆత్మహత్యలు పెరిగిపోయాయి.

అలాగే, గిట్టుబాటు ధరలకు చట్టబద్ధతను ఇచ్చేందుకు ప్రభుత్వాల అయిష్టత వెనుక మరో కారణం కూడా ఉంది. అది నగర ప్రాంతాల్లోని కార్పొరేట్లకు అవసరమైన కార్మికులు, ఉద్యోగుల సరఫరా. అంటే, గ్రామీణ ప్రాంతాల నుంచి, నగరాలకు తగినంత స్థాయిలో వలసలు ఉండాలీ అంటే, వ్యవసాయ రంగం లాభసాటిగా ఉండకూడదు. అలా ఉంటే రైతు గ్రామాన్ని వదిలి బయటకి రాడు. వ్యవసాయ రంగంలో బతకడం కష్టమైతేనే రైతు వలసకూలీగా మారి నగర బాట పడతాడు. కార్పొరేట్లకు కావల్సింది ఇదే. నగరాలలో మానవవనరుల సరఫరా అధికంగా ఉండాలి. ఉంటేనే ఉపాధి కోసం పోటీ పెరుగుతుంది. పెరిగితేనే ఉద్యోగులకు ఇచ్చే వేతనాలను తగ్గించే అవకాశం కార్పొరేట్లకు కలుగుతుంది. దీని తాలూకు మరొక కొనసాగింపే – ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చివేసే ప్రయత్నం. ఈ పథకం వలన గ్రామాల్లో ఉపాధి పెరిగి నగర ప్రాంతాలకు వలసలు తగ్గుతాయి. దీనివల్ల నగర ప్రాంత కార్పొరేట్లకు కార్మికుల సరఫరాను తగ్గిపోతుంది.

శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యక్తిగతంగా ఎంతటి మానవీయ కోణం కలిగిన వారయినా, రైతాంగానికి మేలు కోరుకునే వారయినా, వాస్తవంలో ఆయన వర్గపరిమితులు, రాజకీయ పరిమితులు దానిని అనుమతించవు. ఇక ఇప్పుడు ఈ ప్రభుత్వాల హయాంలో – కనీస మద్దతు ధరకు చట్టబద్ధత అటుంచి, కనీసం అమెరికాతో వాణిజ్య ఒప్పంద చర్చలలో – దిగుమతి టారిఫ్‌ల తగ్గింపు పేరుతో – భారత వ్యవసాయ రంగం పూర్తిగా బలిపీఠం ఎక్కదని ఆశించడం మాత్రమే మనం చేయగలిగింది!

◆ డి. పాపారావు

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా
- ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువ
- 76 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో ప్రజలు నుంచి వస్తున్న ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జోనా హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. నగర ప్రజలకు అందించాల్సి సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలని అన్నారు. ప్రజలకు మంచి నీటి సమస్యలు రాకుండా ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రజావాణిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 76 ఫిర్యాదులు స్వీకరించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ శ్రీనివాస్, హెచ్‌వోలు రమేష్, ఇంచార్జీ సీపీ రవీంద్ర రాడేకర్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌తో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇంజనీరింగ్ - 17, హెల్త్, శానిటేషన్ - 6, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 10, టౌన్‌ప్లానింగ్ - 39, తాగునీటి సరఫరా - 4 ఇలా మొత్తం 76 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.

ఫిర్యాదుల్లో కొన్ని.

హనుమకొండ 30వ డివిజన్ బాలసముద్రంలో సర్వే నెంబరు 1081లో సుమారు 570 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేసి నకిలీ పత్రాలు సృష్టించి ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు విక్రయిస్తున్నారని స్థానిక కార్పొరేటర్ రావుల కోమల కిషన్ విన్నవించారు.

- హనుమకొండ 59వ డివిజన్ ఎక్సైజ్ కాలనీలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్లు, కల్వర్టు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎక్సైజ్ కాలనీ డెవలప్‌మెంట్ సొసైటీ నాయకులు వినతి పత్రం అందించారు.
- గ్రేటర్ వరంగల్ పరిధిలోని 13,18,19,20,21,2 డివిజన్‌లలో పశువులు రోడ్లపై మేత కోసం తిరుగుతున్న క్రమంలో అటుగా వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయని, కోతులు, వీధి కుక్కల బెడద అధికంగా ఉందని వరంగల్ జిల్లా బీజేపీ నాయకుడు హరిశంకర్ వినతి పత్రం అందించారు.
- గ్రేటర్ 35వ డివిజన్ శివనగర్ ప్రాంతంలోని గణపతి నగర్ రోడ్డు నెంబర్ -8లో ప్రస్తుతం మట్టి రోడ్డు ఉందని, నగర పాలక సంస్థ నిధుల నుంచి సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు వినతి పత్రం అందించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ..?



నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ కోమల కిషన్

- జీడబ్ల్యూఎంసీ 'ప్రజావాణి'లో కార్పొరేటర్ రావుల కోమల కిషన్ ఫిర్యాదు
- అధికారుల తీరును నిరసిస్తూ కార్యాలయం ఎదుట ఆందోళన

8

ఇల్లు కట్టేది ఎలా!?

పేదలకు సవాలుగా మారిన 'ఇందిరమ్మ ఇల్లు' పథకం



- పెట్టుబడికి ఇబ్బందులు.. చిన్న ఇల్లు అని విముఖత
- ప్రతిబంధకంగా ఇంటి విస్తీర్ణం 600 ఎస్ఎఫ్‌టీ పరిమితి
- పెరిగిన నిర్మాణ వ్యయం కూడా ఓ కారణం
- తొలి విడతలో ఉమ్మడి జిల్లాకు 4,219 ఇళ్లు మంజూరు
- సగం ఇళ్లు కూడా మొదలు పెట్టని లబ్ధిదారులు
- రెండో విడతలో మరో 43,465 ఇళ్లకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- ఇంటి నిర్మాణానికి ప్రభుత్వమే పెట్టుబడి సాయం అందించాలంటున్న లబ్ధిదారులు

'ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు..' అన్నారు పెద్దలు. పెళ్లి మాటేమోగానీ, ఇల్లు కట్టుకోవడం ఎవరికైనా అత్యంత భారమైన విషయం. పేదలకైతే అది కల మాత్రమే. ఈ పరిస్థితుల్లో పేదల సొంత ఇల్లు కలను సాకారం చేసేందుకు 'ఇందిరమ్మ ఇల్లు' పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆశయం బాగానే ఉన్నప్పటికీ, ఆచరణలోకి వచ్చేసరికి పథకంలోని నిబంధనలు అనేక సమస్యలకు దారితీస్తున్నాయి. చేతిలో చిల్లిగవ్వలేక నిరుపేదలు ఇంటికి ముగ్గు పోసుకునేందుకు ముందుకు రావటం లేదు. పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలు, పెట్టుబడికి ఇబ్బందులు, తరుముకొస్తున్న వర్షాలు వెరసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని భారంగా మార్చివేశాయి. ఇల్లు 600 చదరపు అడుగులు మాత్రమే ఉండాలనే రూలు లబ్ధిదారులకు నచ్చడం లేదు. చిన్న ఇంటిలో పిల్లల పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు ఎలా చేయగలమని వారు ప్రశ్నిస్తున్నారు. ఇలా అనేకానేక కారణాల వల్ల ఉమ్మడి జిల్లాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు జోరందుకోవటం లేదు. తొలి విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో ఇప్పటి వరకు 50శాతం ఇళ్లు కూడా మొదలుకాలేదు.

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. రూ.5లక్షల సాయంతో లబ్ధిదారులకు సొంతింటిని నిర్మించుకునేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నది. నాలుగు విడతల్లో హౌసింగ్ ఈఈ, డీఈ, ఏఈ నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని సందర్శించి, యాప్‌లో ఇంటి పురోగతిని అప్‌లోడ్ చేసిన తరువాతే విడతల వారిగా లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ కానున్నాయి. అలాగే ప్రతి నియోజకవర్గానికి 3,500ఇళ్ల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు మంథని, భద్రాలచం, హుస్నాబాద్, ఇల్లందు నియోజకవర్గాలు ఉండగా, జనగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు సిద్ధిపేట జిల్లా పరిధిలోకి వెళ్లాయి.

ఉమ్మడి జిల్లాకు 47,684 ఇళ్లు మంజూరి అయ్యాయి. తొలి విడతలో ప్రతి మండలం నుంచి ఒక పైలట్ గ్రామాన్ని ఎంపిక చేసి 4,219 ఇందిరమ్మ ఇళ్లను మంజూరి చేశారు. ఇక రెండో విడతలో 43,465 ఇళ్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తొలి విడతలో లబ్ధిదారు ఎంపికతో పాటు ప్రొసిడింగ్స్ పంపిణీ కూడా దాదాపు పూర్తి చేశారు. ఇక రెండో విడతలో లబ్ధిదారుల ఎంపిక చేయటంతో వారికి ప్రొసిడింగ్స్ ఇచ్చేందుకు చకచక ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం నుంచి మంచి రోజులు లేవని చాల మందికి సోమవారమే మంజూరి పత్రాలు అందించి ఇంటి నిర్మాణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు.

పెట్టుబడి ఇబ్బందులు..
చిన్న ఇల్లు అనే ఆలోచన..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి పేదలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలంటే చేతిలో కనీసం లక్షన్నర రుపాయలైనా ఉండాలి. ఆ మొత్తం చేతిలో ఉంటే ఎప్పుడో చిన్నదో పెద్దదో ఇల్లు కట్టుకునే వాళ్లం కదా అని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇందిరమ్మ ఇంటిని బెస్మెంట్ వరకు నిర్మించాలంటే.. పిల్లర్ల కోసం పునాది తవ్విన వారితో పాటు మేస్త్రీ, కూలీల ఖర్చుతో పాటు ఇనుము, సిమెంట్, ఇసుక తదితర వాటికి కనీసం రూ.1.50లక్షల వరకు ఖర్చు వస్తుందని అంచనా వేస్తున్నారు. అప్పోసప్పో చేసి ఇంత పెట్టుబడి పెట్టినప్పటికీ బిల్లులు వస్తాయో రావో అనే టెన్షన్ లబ్ధిదారుల్లో నెలకొంది.

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం కొడిశెలమిట్ట గ్రామంలో 69ఇళ్లు మంజూరు కాగా, 52 ఇళ్ల పనులను ప్రారంభించారు. వీటిలో 43ఇళ్లు బేస్మెంట్ వరకు పూర్తయినప్పటికి పైసా బిల్లులు చెల్లిటం లేదని, యాప్‌లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అధికారులు దాట వేస్తున్నారని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి సంఘటనలతో పాటు అధికారులు ఎప్పటికప్పుడు ఇంటిని పర్యవేక్షించి, (మిగతా 6లో)

ఉమ్మడి జిల్లాలో రెండు విడతల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల వివరాలు

జిల్లా	వరంగల్	హనుమకొండ	జనగామ	మహబూబాబాద్	భూపాలపల్లి	ములుగు	మొత్తం
మొదటి విడత	612	705	726	602	803	771	4,219
రెండో విడత	11,013	9,916	5,308	8,966	4,033	4,229	43,465

టీపీసీసీలో ఓరుగల్లుకు పట్టం



నాయిని రాజేందర్‌రెడ్డి | బస్వరాజు సారయ్య | హనుమండ్ల ఝాన్సీరెడ్డి | లకావత్ ధన్వంతి | నమిండ్ల శ్రీనివాస్

- రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎమ్మెల్యే నాయిని, ఎమ్మెల్సీ సారయ్య, ఝాన్సీరెడ్డి, నమిండ్ల, ధన్వంతి
- ప్రధాన కార్యదర్శులుగా కత్తి, బొద్దిరెడ్డి, ఈవీ శ్రీనివాస్, దుద్దిళ్ల శ్రీనివాస్
- వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఆశించిన నాయినికి నిరాశే..

వరంగల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ (టీపీసీసీ)లో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు అవకాశం దక్కింది. సోమవారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ జంబో టీమ్‌ను ప్రకటించారు. 27 మంది రాష్ట్ర ఉపాధ్యక్షులను ప్రకటించగా, అందులో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యకు అవకాశం దక్కింది. అలాగే పాలకుర్తి ఎమ్మెల్యే యశ్వస్వినిరెడ్డి అత్త పాలకుర్తి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జిగా వ్యవహరిస్తున్న హనుమండ్ల ఝాన్సీరెడ్డితో పాటు మాజీ జడ్పీ చైర్‌పర్సన్ లకావత్ ధన్వంతి, సీనియర్ నాయకుడు నమిండ్ల శ్రీనివాస్‌లకు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏఐసీసీ అధిష్ఠానం నియమించింది. ఇక రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా 69 మందిని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేతలు కత్తి వెంకటస్వామి, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్‌లకు అవకాశం దక్కింది. అలాగే భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనివాస్ (శ్రీనుబాబు)ను కూడా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. కాగా, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిపై ఆశలు పెట్టుకోగా అధిష్ఠానం వైస్ ప్రెసిడెంట్ పదవి ఇచ్చింది. ఇక అనుహ్యంగా మాజీ జడ్పీ చైర్మన్ లకావత్ ధన్వంతికి ఉపాధ్యక్ష పదవి దక్కింది. పాలకుర్తి రాజకీయాల్లో క్రియశీలకంగా ఉన్న ఝాన్సీరెడ్డికి అధిష్ఠానం వైస్ ప్రెసిడెంట్ పదవిని ఇవ్వడం క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపింది. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి ఉపాధ్యక్ష పదవిని దక్కించుకోవడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

'ఆపరేషన్ కగార్'ను వెంటనే ఆపాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

- మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- కేయూలో విద్యార్థి సంఘాల నేతృత్వంలో రౌండ్‌టేబుల్ సదస్సు

కేయూ క్యాంపస్ జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఆదివాసీలపై జరుగుతున్న దాడిని వ్యతిరేకించాలని, మావోయిస్టులతో శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కేయూ గణిత విభాగం సెమినార్ హాల్‌లో కేయూ విద్యార్థి సంఘాల నేతృత్వంలో రౌండ్ టేబుల్ సదస్సు జరిగింది. డెమోక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ అధ్యక్షతన 'శాంతి చర్చలు- విద్యార్థుల బాధ్యత' అనే అంశంపై జరిగిన సదస్సుకు ఎమ్మెల్యే నాయిని ముఖ్యఅతిథిగా హాజరై కీలక ప్రసంగం చేశారు. మావోయిస్టులపై దాడులను వ్యతిరేకించాలని, శాంతి చర్చలకు అనుకూలంగా ఉన్న మావోయిస్టులతో చర్చలకు కేంద్రం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులు పలు దఫాలుగా శాంతి చర్చలకు ముందుకు (మిగతా 8లో)

కోర్టు కేసులో రాజీ కుదరదన్నందుకు హత్య

- వివాహితపై గొడ్డలితో దాడి..
- అక్కడికక్కడే మృతి
- ఆవుదూడ విషయంలో తలెత్తిన గొడవ
- చిలికిచిలికి హత్యకు దారి తీసిన వైనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ పెంగిలి ప్రశాంత్‌రెడ్డి

6

పెళ్లి బరాత్‌లో ఘర్షణ

- వరుడిపై యువకుల దాడి
- మద్యం మత్తులో హల్‌చల్
- పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

6

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 15 తులాల బంగారు ఆభరణాలు అపహరణ
- ఖిలావరంగల్ పడమర కోటలో ఘటన

6

కేజీబీవీలకు మహర్దశ

నూతన హంగుల కోసం రూ.12.44 కోట్ల నిధులు మంజూరు



- తొలివిడతగా రూ.4.92 కోట్లు విడుదల
- మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కార్యాచరణ
- భవనాలకు కొత్తకళ
- తీరనున్న దీర్ఘకాలిక సమస్యలు

హనుమకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ)కు మహర్దశ పట్టనుంది. సమస్యలతో కునారిల్లుతున్న ఈ విద్యాలయాలు కొత్త హంగుల సమకూరనున్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు, భవనాలకు మరమ్మతుల వంటి అత్యవసర పనులను చేపట్టడం ద్వారా వీటి విషయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దూరం కానున్నాయి. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ప్రభుత్వం రూ. 12.44 కోట్లను మంజూరు చేసింది. ఇందులో మొదటి విడతగా రూ. 4.92 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులతో విద్యాలయాల భవనాలు, తరగతి గదులకు రంగులు వేయించి సుందరీకరించనున్నారు. అత్యవసరమైన పనులు చేపట్టనున్నారు. ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు ప్రస్తుతం కొన్ని దెబ్బతిని ఉండగా, మరికొన్ని అరకొర వసతులతో నిర్వహిస్తున్నారు. అనేక విద్యాలయాలకు రంగులు లేకపో వటంతో వెలవెల బోతున్నాయి.

హనుమకొండ జిల్లాలో..

కేజీబీవీల్లో ఆత్మకూరుకు రూ. 3.85 లక్షలు, భీమదేవరపల్లికి రూ. 5.30 లక్షలు, ధర్మసాగర్‌కు రూ. 3.85 లక్షలు, ఎల్కతుర్తికి రూ.24.58 లక్షలు, హసన్‌పర్తికి రూ.3.85 లక్షలు, ఐనవోలుకు రూ.3.85 లక్షలు, కమలాపూర్‌కు రూ.26.99 లక్షలు, శాయంపేటకు రూ. 3.85 లక్షలు, వేలేరుకు రూ. 51.09 లక్షల విడుదలయ్యాయి.

తొలివిడత రూ.4.92 కోట్లు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 66 కస్తూర్బా బాలికల విద్యాలయాలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలోని 9 కేజీబీవీలకు రూ. 2.60 కోట్లు మంజూరు కాగా తొలివిడతగా రూ. 1.27 కోట్లు, జనగామ జిల్లాలోని 12 కేజీబీవీలకు రూ. 2.50 కోట్లు మంజూరుకాగా రూ. 1.20 కోట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 11 కేజీబీవీలకు రూ. 1.28 కోట్లు మంజూరు కాగా రూ. 61 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలోని 15 కేజీబీవీలకు రూ. 2.45 కోట్లు మంజూరు కాగా రూ. 1.18 కోట్లు, వరంగల్ జిల్లాలోని 10 కేజీబీవీలకు రూ.2.35 కోట్లు మంజూరు కాగా రూ.1.13 కోట్లు, ములుగు జిల్లాలో 9 కేజీబీవీలకు రూ.1.26 కోట్లు మంజూరు కాగా రూ.60 లక్షలు విడుదలయ్యాయి. మిగతా నిధులు రెండవ విడతలో విడుదలవుతాయి.

వరంగల్ జిల్లాలో...

కేజీబీల్లో చెన్నారావుపేటకు రూ. 3.85 లక్షలు, దుగ్గొండికి రూ. 10.60 లక్షలు, గీసుకొండకు రూ. 3.85 లక్షలు, ఖానాపూర్‌కు రూ. 3.85 లక్షలు, నల్లబెల్లికి రూ.9.15 లక్షలు, నెక్కొండకు రూ. 30.84 లక్షలు, పర్వతగిరికి రూ. 7.71 లక్షలు, రాయపర్తికి రూ. 31.81 లక్షలు, సంగెంకు రూ. 2.41 లక్షలు, వర్ధన్నపేటకు రూ.9.15 లక్షలు విడులయ్యాయి.

అదనపు హంగులు

ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పాఠశాలలకు అదనపు హంగులు సమకూరనున్నాయి. పనులు సకాలంలో పూర్తి చేసేందుకు జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్, జీసీడీవోలతో పాటు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో ఆయా జిల్లాల విద్యాశాఖాధికారులు సమావేశం నిర్వహించారు. పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మరమ్మతు పనులు

భవనాలకు తరగతి గదులకు రంగులు వేయడం, సౌర విద్యుత్‌తోతో నీళ్లు కాచుకునే యంత్రాల(గ్రీజర్స్) ఏర్పాటు, మురుగు కాల్వల మరమ్మత్తు, క్రీడా ప్రాంగణాలు, మరుగుదొడ్లు, విద్యుత్ మరమ్మత్తులు, శుద్ధజల ప్లాంట్ల ఏర్పాటు బోర్లు వేయించడం, కిచెన్ షెడ్లు, స్నానాల గదులు, పడక హాళ్ల నిర్మాణం వంటి పనులు చేపడతారు. కేజీబీవీలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు (మిగతా 8లో)

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు

ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

సీతారామపురంలో కార్డన్‌సెర్చ్



గ్రామస్థులకు దోమ తెరలు అందజేస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

వెంకటాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు తప్పవని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ హెచ్చరించారు. వెంకటాపురం మండలంలోని బోదాపురం గ్రామపంచాయతీ పరిధిలోని సీతారామపురం గ్రామంలో ఏఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఎస్పీ గ్రామస్థులను సమావేశపరిచి మాట్లాడారు. మావోయిస్టులకు ఎవరూ సహకరించవద్దని, అపరిచిత, అనుమానిత వ్యక్తులు గ్రామ పరిసరాల్లో సంచరించినట్లయితే పోలీసులకు తెలియజేయాలన్నారు. అదేవిధంగా రాబోయే వర్షాకాలంలో వాగులు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున వాగులు దాటొద్దని, చేపలు పట్టేందుకు వెళ్లకూడదని సూచించారు. అనంతరం గ్రామస్థులకు ఏఎస్పీ దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతిరావు, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ బావిలో పడి రైతు మృతి



తిరుపతి రాజ్(ఫైల్)

రేగొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : అదుపుతప్పి ట్రాక్టర్ బావిలో పడడంతో రైతు మృతి చెందిన సంఘటన రేగొండ మండలంలోని రేపాక గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బోయిని తిరుపతిరాజ్‌కి(30) కనిపర్తి గ్రామ శివారులో ఆయిల్‌పామ్ తోట ఉంది. కాగా ఆయిల్‌పాంలో తన సొంత ట్రాక్టర్‌తో రోటవేటర్ కొట్టడానికి ఉదయాన్నే తోటకు వెళ్ళాడు. రోటవేట ర్ కొడుతుండగా ట్రాక్టర్‌ను రివర్స్ తీసుకుంటుండగా అదుపుతప్పి వెనకాలే ఉన్న బావిలో పడ్డాడు. అనంతరం తిరుపతిరా జ్ తండ్రి రాజయ్య ఆయిల్‌పామ్ వద్దకు వచ్చి చూడగా కుమారుడు, ట్రాక్టర్ కనిపించకపోవడంతో మళ్ళీ ఇంటికి వెళ్లి చేశాడు. ఎవరిని అడిగినా తెలియదని చెప్పడంతో బావిలో తొంగిచూడగా ట్రాక్టర్ కనపడడంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసుల సహాయంతో ట్రాక్టర్‌ను, మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తల్లితండ్రులు, భార్య, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ హృదయ విదారక సంఘటనతో గ్రామస్థులు కంటతడిపెట్టారు. దహన సంస్కారా లు పూర్తయ్యేవరకు గ్రామస్తులు వెంట నడిచారు. మృతుడికి భార్య సంధ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. రైతులు ట్రాక్టర్ నడిపే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఎస్సై సూచించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

15 తులాల బంగారు ఆభరణాల అపహరణ



ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

ఖిలావరంగల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్ 38వ డివిజన్ పడమర కోటలో.. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పడమరకోటకు చెందిన ఆర్‌ఎంపీ గుర్రం రామకృష్ణ కుటుంబసభ్యులు ఓ వివాహానికి హాజరయ్యేందుకు ఆదివారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్ళారు. సోమవారం తిరిగి వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లో బీరువా పగులగొట్టి 15తులాల బంగారు అభరణాలను ఎత్తుకెళ్ళారు. దీంతో వెంటనే వారు మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ బొల్లం రమేష్ తమ సిబ్బందితో వచ్చి ఇంటిని పరిశీలించారు. అనంతరం వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్‌తో పాటు క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు, ఆధారాలను సేకరించి కేసు నమోదు చేశారు.

రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలు

నేడు, రేపు ఐదు క్రీడాంశాల్లో విద్యార్థులకు ఎంపిక పోటీలు

పది జిల్లాల నుంచి హాజరు కానున్న బాలబాలికలు

ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా క్రీడాశాఖ అధికారులు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులకు ఉజ్వల భవిష్యతును అందించే దిశగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లోని రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్లో ప్రవేశాలు పొందేందుకు క్రీడాకారుల దరఖాస్తులను అహ్వానించడం జరిగింది. జేఎన్ఎస్‌లోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్లో 2025-26 సంవత్సరానికి గాను ప్రవేశాలకు సాట్ ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 10, 11 తేదీల్లో హనుమకొండ జేఎన్ క్రీడా మైదానంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాకు చెందిన అండర్-10, 12, 14, 16 బాలబాలికలు అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్ లాంటి 5 క్రీడాంశాల్లో శరీరక సామర్థ్యంతో పాటు బ్యాటరీ పద్ధతిన పరీక్షలు నిర్వహించనున్నారు. వివిధ క్రీడాంశాలతో శరీరక సామర్థ్యంతో పాటు స్కిల్స్ ఆధారంగా ఎవరైతే ప్రతిభ కనబర్చి ఎక్కువ మార్కులు సాధిస్తారో వారికి స్పోర్ట్స్ హాస్టల్లో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తారు.

అర్హతలు ఇవే..

హనుమకొండ జేఎన్ఎస్ లోని రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారై ఉండాలి. అండర్-10, 12 బాలబాలికలకు అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుంది. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 30 జూన్ 2013 నుంచి 1 జూలై 2015 మధ్య జన్మించిన వారు అర్హులు. అదే విధంగా అండర్-14, 16 బాలురు విభాగంలో రెజ్లింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా, ఇందులో పాల్గొనే బాలురు 30జూన్ 2009 నుంచి 1జూలై 2011 మధ్య జన్మించిన వారు అర్హులు.

విద్యార్థులకు నిర్వహించే పరీక్షలు

ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 800 మీటర్ల పరుగుపందెం, 6, 10 మీటర్ల షటిల్‌రన్, మెడిసిన్‌బాల్‌త్రో, వర్టికల్‌జంప్, ఫెక్సిబిలిటి టెస్ట్, మెడికల్ టెస్టులను హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహిస్తారు.

వెంట తీసుకు రావాల్సిన సర్టిఫికెట్లు

రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాల ఎంపిక పోటీల్లో పాల్గొనే బాల బాలికలు వారి జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి జారీ చేసిన బోనఫైడ్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, 10 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు వెంట తీసుకొని జూన్ 10న హనుమకొండ జేఎన్ఎస్‌లోని డీఎస్ఏ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు హాజరు కావాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి

అశోక్‌కుమార్, డీవైఎస్‌వో



క్రీడాకారులకు ఉజ్వల భవితకు స్పోర్ట్స్ అకాడమీలు, హాస్టళ్లు ఎంతగానో ఉపయోగపడుతాయి. హాస్టళ్లలో ఎంపికైన క్రీడాకారులకు నిష్ణాతులైన కోచ్‌ల పర్యావేక్షణలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన తర్ఫీదు అందించడంతో నాణ్యమైన భోజనం, వసతులను సమకూర్చడం జరుగుతుంది. అత్యుత్తమ ప్రతిభతో స్పోర్ట్స్ హాస్టల్లో అర్హత సాధించిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించే విధంగా ఎదగడంతో పాటు దేశానికి, రాష్ట్రానికి పతకాలు సాధించే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలోని 33 జిల్లాకు చెందిన 10, 12, 14, 16 వయస్సు కలిగిన బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

భూమిని కబ్జా చేస్తున్నారంటూ..

బాధితుడి ఆత్మహత్యాయత్నం

నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కరీమాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తన భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. కరీమబాద్ ఎస్సీ కాలనీకి చెందిన పోలెపాక కుమారస్వామి ఆటో నడుపుతూ జీవనం గడుపుతున్నాడు. అయితే ఉర్సు బైపాస్ రోడ్డులోని తాళ్ల పద్మావతి కళాశాల వద్ద ఉన్న తన భూమిని కరీమాబాద్ ప్రాంతానికి చెందిన బండి కమారస్వామి, తాళ్ల మల్లేశం, పులి రంజిత్ రెడ్డి అనే వ్యక్తులు కబ్జా చేశారంటూ సోమవారం మధ్యాహ్నం కళాశాల సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. కాలిన గాయాలతో ఉన్న కుమారస్వామిని కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎంకు తరలించారు. కాగా అంతకుముందు ఓ పేపర్‌లో సూసైడ్ నోట్ రాసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడి కుమారుడు రాంకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండి కుమారస్వామి, తాళ్ల మల్లేశం, పులి రంజిత్ రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

బాధితుడికి న్యాయం చేయాలి

పోలెపాక కుమారస్వామికి న్యాయం చేసి, కబ్జాదారులను కఠినంగా శిక్షించాలని వరంగల్ జిల్లా ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి అధ్యక్షుడు కడారి కుమార్ డిమాండ్ చేశారు. కుమారస్వామి 80శాతం గాయాలతో ఎంజీఎంలో చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని, అతడికి ఎమైనా జరిగితే పూర్తి బాధ్యత కబ్జాదారులదేనని హెచ్చరించారు.

కోర్టు కేసులో రాజీ కుదరదన్నందుకు హత్య

వివాహితపై గొడ్డలితో దాడి..

అక్కడికక్కడే మృతి

ఆవు దూడ విషయంలో తలెత్తిన గొడవ

చిలికిచిలికి హత్యకు దారి తీసిన వైనం

వివరాలు వెల్లడించిన ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



ముల్కనూర్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

భీమదేవరపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆవుదూడ విషయంలో వచ్చిన తగాదాతో చిలికి చిలికి ఓ వివాహిత హత్యకు దారి తీసింది. కోర్టు కేసులో రాజీ కుదరదన్నందుకు గొడ్డలితో నరికి హత్య చేశాడు ఓ యువకుడు. కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన కోల సుమలత కుటుంబం గుళ్ల రాజు కుటుంబాలు ఎదురెదురుగా నివాసం ఉంటున్నారు. 2002లో ఆవు దూడ విషయంలో ఈ రెండు కుటుంబాల మధ్య తగాద నెలకొంది. ఈ విషయంలో తరచూ ఇరు కుటుంబాలకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. అదే సంవత్సరంలో ఇదే విషయంపై కోల సుమలత బావ సంపత్‌పై గుళ్ల రాజు దాడి చేశాడు. సంపత్ చేయి విరిగింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. 2004లో సుమలత కుమారుడు వెంకటేష్‌పై గుళ్ల రాజు గొడ్డలితో దాడి చేశాడు. వెంకటేష్ ప్రాణపాయ స్థితిలో వెంకటేష్ కొట్టుమిట్టాడి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ విషయంలోనూ గుళ్ల రాజుపై రెండోసారి కేసు నమోదైంది. ఎప్పటికైనా గుళ్ల రాజుతో తమకు ప్రమాదం ఉందని సుమలత కుటుంబ సభ్యులు ఇల్లు మార్చి కొద్ది దూరంలో కిరాయికి ఉంటున్నారు. కాగా సంపత్‌పై దాడి విషయంలో కోర్టులో కేసు నడుస్తుంది. ఈ నెల 11న సుమలత సాక్షిగా కోర్టులో సాక్ష్యం చెప్పనుంది. ఈ విషయంలో రాజీకి పడాలని గుళ్ల రాజు సుమలతను వేధిస్తున్నాడు. ఈ నెల 5న సుమలత ఒకతే ఇంట్లో ఉన్న విషయాన్ని గమనించిన గుళ్ల రాజు గొడ్డలితో సుమలత ఇంటికి వెళ్లాడు. రాజీపై వాగ్వాదం జరిగింది. ఎంతకి సుమలత వినకపోవడంతో వెంట తెచ్చుకున్న గొడ్డలితో రాజు సుమలతపై దాడి చేసి, బైక్‌పై పారిపోయాడు. తీవ్ర రక్తస్రావమైన సుమలత అక్కడికక్కడే మృతి చెందింది.

హత్యకు ఉపయోగించిన గొడ్డలిని, సుమలత వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను తనతో తీసుకెళ్లి వేరే ప్రాంతంలోని కాల్వలో పడేశాడు. ఈ నెల 5న రాత్రి సుమలత కూతురు తేజస్విని, భర్త పోచయ్య ఇంటికి రాగా సుమలత రక్తం మడుగులో పడి విగతజీవిగా ఉంది. వెంటనే ముల్కనూర్ పోలీసులకు తేజస్విని ఫిర్యాదు చేసింది. ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్ఐ సాయి బాబు, ప్రవీణ్‌కుమార్, దివ్య ఈ కేసును విచారణ చేశారు. సోమవారం ముల్కనూర్ సమ్మక్క గుట్ట వద్ద గుళ్ల రాజును అదుపులోకి తీసుకున్నారు. హత్య తానే చేసినట్లు రాజు ఒప్పుకున్నాడు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని, సుమలత సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరగా పరిష్కరించిన పోలీసులను ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.

వృద్ధురాలి దారుణ హత్య

పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు



స్వరూప(ఫైల్)

గీసుగొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఖిలావరంగల్ మండలం స్తంభంపల్లిలో పోచన స్వరూప(70) అనే వృద్ధురాలు దారుణ హత్యకు గురైన సంఘటన సంచలనంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్వరూపకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కుమారుడు రమేష్ హనుమకొండలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తెలకు వివాహం అయింది. కుమారుడు రమేష్ కుటుంబంతో తల్లి వద్దనే ఉంటూ తాను పనిచేస్తున్న కార్యాలయానికి వెళ్లి వస్తూండేవాడు. కాగా, ఇటీవల అతడికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కొద్ది నెలలుగా హనుమకొండలోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో స్వరూప ఈ నెల 4న ములుగు జిల్లా కేంద్రంలో ఉంటున్న తన సోదరి ఇంటికి వెళ్లి 5న తిరిగి స్తంభంపల్లికి చేరుకుంది. అప్పటి నుంచి ఇంట్లో ఒంటరిగానే ఉంటుంది. స్వరూప ఇరుగు పొరుగు వారితో కలివిడిగా ఉండేది. అయితే ఈ నెల 8న రాత్రి 9 గంటల సమయంలో స్వరూప ఇంటిముందు లైట్లు ఆర్పి ఉండడంతో పక్కన కిరాయికి ఉంటున్న మరిగిద్ద సుజాత స్వరూప ఇంటికి వచ్చి చూడగా కిచెన్‌రూం డోర్ తెరిచి ఉంది. ఇంట్లో లైట్లు కూడా బంద్‌చేసి ఉండడంతో అనుమానం వచ్చిన సుజాత లోపలికి వెళ్లి చూడగా చిల్డ్రన్ బెడ్ రూంలో స్వరూప రక్తపు మడుగులో మృతిచెంది ఉంది. ఆందోళన చెందిన ఆమె స్వరూప కుమారుడు రమేష్‌కు ఫోన్ చేసి విషయాన్ని తెలిపి, పోలీసులకు సమాచారం ఇచ్చింది. కుమారుడు రమేష్ ఇంటికి వచ్చి చూడగా తల్లి మెడలోని రెండున్నర తులాల పుస్తెలతాడు, తులం చెవుల కమ్మలు, బీరువాలోని రూ.10 వేలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు.

స్వరూప తలపై గుర్తుతెలియని వ్యక్తులు ఇనుప రాడ్‌తో కొట్టి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు. కాగా, సంఘటన స్థలాన్ని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, ఏసీపీ వెంకటేష్ పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి విచారణ చేపట్టారు. స్వరూపను హత్య చేసింది బంగారు అభరణాల కోసమా, మరేమైన ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య



పద్మ (ఫైల్)

చిన్నగూడూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ మహిళ ఆకేరు వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని ఉగ్గంపల్లి, చిన్నగూడూరు గ్రామాల మధ్య ఉన్న ఆకేరు వాగు వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటకు చెందిన రచ్చ పద్మ (45) కుటుంబంతో సహా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆమెకు కూతురు, కుమారుడు ఉన్నారు. వారికి వివాహమైంది. గత సంవత్సర కాలంగా మతిస్థిమితం లేకుండా ఉండడంతో చిన్నగూడూరులోని తమ తల్లిగారైన మాటేడి చంద్రమౌళి-లచ్చమ్మ ఇంట్లో భర్తతో కలిసి నివాసం ఉంటున్నారు. సోమవారం ఆమె ఎక్కడికి వెళ్లిందనే కోణంలో భర్త ధర్మేష్ వెదుకుతున్న క్రమంలో ఆకేరు వాగులో దూకింది. గమనించిన స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే మృతి చెందింది. స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. భర్త ధర్మేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇల్లు కట్టేది ఎలా!?

(5వ పేజీ తరువాయి)

నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే బిల్లులు చేస్తామని కరాఖండిగా చెప్తుతున్నారు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులు సందిగ్ధంలో పడుతున్నారు.

మరోవైపు ప్రభుత్వం నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవాల్సి ఉండటం కూడా ప్రతిబంధకంగా మారుతోంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇంటికి ప్రభుత్వం అందించే సాయంతో పాటు లబ్ధిదారుడు కూడా కొంత మొత్తాన్ని కలుపుకుని, తన అవసరాలకు తగ్గట్టుగా ఇంటిని నిర్మించుకున్నారు. ప్రస్తుతం 600 ఎస్ఎఫ్‌టీ పరిధిలోనే ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకుంటేనే రూ.5లక్షల సాయం అందుతుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో చాలామంది లబ్ధిదారులు ఆలోచనలో పడుతున్నారు. కొద్దిగా ఆర్థికంగా ఉన్న లబ్ధిదారులైతే మళ్లీ ఇంటిని నిర్మించుకునే అవకాశాలు ఉండవని, కట్టుకునేదేదో కొంచెం విశాలంగా నిర్మించుకుంటే బాగుంటుందనే ఆలోచనలో ఉన్నారు. పిల్లలకు పెళ్లిళ్లు చేసినా, ఏదైనా ఇతర శుభకార్యం చేసిన ఇంటికి వచ్చే బంధు, మిత్రులకు చిన్న ఇంటితో ఇబ్బందిగా ఉంటుందని భావిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే సాయంతో పాటు కొంత మొత్తాన్ని కలుపుకుని పెద్దగా ఇంటిని నిర్మించుకోవాలని భావిస్తున్నప్పటికీ ప్రభుత్వ నిబంధనలు ప్రతిబధకంగా మారుతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు.

నిబంధనలతో నిర్మాణ భారం..

ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు మంజూరి పత్రం తీసుకున్న 45రోజుల్లోపు ఇంటికి కావాల్సిన మెటీరియల్ అందుబాటులో ఉంచుకోవాలనే నిబంధన లబ్ధిదారులను కలవర పెడుతోంది. ఇంటికి కావాల్సిన ఇసుక, సిమెంట్, స్టీల్, తలుపులు, కిటికీలు, ఇటుక తదితర సామాగ్రిని సమకూర్చుకోవాల్సి ఉంది. అయితే పెరిగిన నిర్మాణ వ్యయం లబ్ధిదారులపై భారంగా మారుతోంది. ముందస్తుగా ప్రభుత్వం ఎలాంటి పెట్టుబడి సాయం అందించటం లేదు. దీంతో పెరిగిన సిమెంట్ బస్తా రూ.350 నుంచి రూ.450 వరకు ఆయా బ్రాండ్లను బట్టి ధరలు ఉన్నాయి. ఒక ఇటుక రూ.8 నుంచి రూ.12 వరకు నాణ్యతను బట్టి ధరలు ఉన్నాయి. స్టీల్‌తో పాటు ఇతర సామాగ్రిని ఒకేసారి సమకూర్చుకోవటం పేదలకు ఆర్థికంగా భారమవుతుందనే చర్చ జరుగుతోంది. 90రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాల్సి ఉండటంతో పెట్టుబడి వ్యయం పెరిగి ఇందిరమ్మ ఇళ్లు ముందుకు సాగుతాయా అనే ప్రశ్న తలెత్తుతోంది. వీటితో పాటు వర్షాకాలం ప్రారంభం కావటంతో ఇంటి నిర్మాణాలను ప్రారంభించేందుకు కూడా లబ్ధిదారులు ఆసక్తి చూపటం లేదు.

జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ మండలం తానెదార్‌పల్లి గ్రామంలో 109 ఇళ్లు మంజూరి అయ్యాయి. 66గృహాలకు ముగ్గు పోసి పనులు చేపట్టగా, 43మంది ముగ్గు పోసేందుకు ఆసక్తి చూపటం లేదు. నోటీసులు ఇచ్చినప్పటికీ రేపుమాపు అంటు దాటవేస్తుండటంతో అధికారులకు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితులే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో నెలకొంటున్నాయి.

ఇందిరమ్మ పథకం సజావుగా ముందుకు సాగాలంటే ప్రభుత్వం కొన్ని నిబంధనలను ఎత్తివేయాలని కోరుతున్నారు. ప్రధానంగా ఇంటి నిర్మాణం ప్రారంభించినప్పుడే ప్రభుత్వం లబ్ధిదారులకు పెట్టుబడి సాయం కొంత అందించాలని, అలాగే ఇంటి నిర్మాణానికి ఎలాంటి నిబంధనలు లేకుండా లబ్ధిదారులు కొంత మొత్తాన్ని కలుపుకుని తమ అవసరాలకు అనుగుణంగా ఇంటిని నిర్మించుకునేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించాలని జనం విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్డీఎల్‌సీఈ సైన్స్ కోర్సుల జేడీగా శ్రీనివాస్



జేడీ శ్రీనివాస్‌కు నియాయక పత్రాన్ని ఇస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కేయూ దూరవిద్య కేంద్రం సైన్స్ కోర్సుల జాయింట్ డైరెక్టర్‌గా మైక్రోబయోలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముంజం శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేయగా వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీనివాస్‌కు అందచేశారు. ముంజం శ్రీనివాస్ ఏడాది కాలం పదవిలో కొనసాగనున్నారు. గతంలో శ్రీనివాస్ మైక్రోబయోలజీ విభాగాధిపతిగా, బీవోఎస్ స్టడీస్ ఛైర్మన్‌గా, ఎస్సీఎస్టీ సెల్ డైరెక్టర్‌గా, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల న్యాక్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. ఇప్పటి వర కు ఎస్డీఎల్‌సీఈ సైన్స్ కోర్సుల జేడీగా పని చేసిన డాక్టర్ బి. వెంకటగోపినాథ్ పదవి కాలం పూర్తికావ డంతో శ్రీనివాస్‌ను నియమించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, ఎస్డీఎల్‌సీఈ డైరె క్టర్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, అకూట్ అధ్య క్షుడుప్రొఫెసర్ బైరు వెంకట్రా మిరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

రైతులతో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ ఒప్పందం

రాంనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్పీడీసీఎల్ పరిధిలో సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయబోతున్న రైతులతో సోమవారం కంపెనీ యాజమాన్యం పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ) ఒప్పందం చేసుకుంది. కుసుమ్- ఏ పథకం కింద తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ. లిమిటెడ్ (రెడ్కో) ఆధ్వర్యంలో రైతులు, రైతు సంఘాలు సోలార్ ప్లాంట్ స్థాపించడానికి అర్హులైన 461 మందికి లెటర్ ఆఫ్ అవార్డు ఇచ్చింది. ఇంధన శాఖ ఆదేశాలతో సోమవారం 461 మందిలో కొంత మంది రైతులతో పీపీఏ ఒప్పందం కుదుర్చుకోగా మంగళవారం మరో కొంత మంది రైతులతో ఎన్పీడీసీఎల్ ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు సీఈ ఐపీసీ ర్యాక్ కె. వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్లు అశోక్ కుమార్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, జీఎంలు, రెడ్కో మేనేజర్లు రాజేందర్ పాల్గొన్నారు.

రైలులో నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



కేసముద్రం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మండలం ఇంటికన్నె రైల్వే స్టేషన్ సమీపంలో డౌన్‌లైనులో 416/20-22 కిలోమీటరు వ ద్ద సోమవారం తెల్లవారుజామున వేగంగా వెళుతున్న రైలులో నుంచి 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉన్న గుర్తుతెలియని వ్యక్తి ట్రా క్‌పై పడి మృతి చెందినట్లు వరంగల్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.రవీందర్‌రెడ్డి తెలిపారు. మృతుడు క్రీమ్ కలర్ షార్ట్, నేవీ బ్లూ రంగు టీషర్టు, బ్రౌన్ కలర్ డ్రాయర్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి వద్ద దానాపూర్ నుంచి పెరంబూర్ వరకు రైల్వే వెయిటింగ్ లిస్ట్ టికెట్ ఉందని, ఇతర ఆధారాలేమీ లేవని తెలిపారు. మృతదేహాన్ని ఎం జీఎం మార్చురీలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు వరంగల్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో 9849749220, 8712658585 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

కులం పేరుతో దూషణ

అవమానం తట్టుకోలేక బాలుడి ఆత్మహత్య



శ్రీకాంత్ మృతదేహం

నల్లబెల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కులం పేరుతో దూషించడంతో అవమానం తట్టుకోలేక పురుగుల మందు తాగి ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని కొండాపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల, కుటుంబ సభ్యుల, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొండాపురం గ్రామానికి చెందిన జెల్ల లక్ష్మి-రమేష్ దంపతుల కుమారుడు జెల్ల శ్రీకాంత్(14). శ్రీకాంత్ అడవిలో మేకలను మోపుకుంటూ ఉండేవాడు. అయితే ఆదివారం ఇదే గ్రామానికి చెందిన కొల కొమురమ్మ ఒక మేకను కోయడానికి జెల్ల శ్రీకాంత్, పత్రీ అశోక్‌లను పిలించింది. వెళ్లి మేకను కోసిన జెల్ల శ్రీకాంత్‌కు మేక రక్తం అంటింది. శ్రీకాంత్ శరీరంపై అంటిన మేక రక్తాన్ని పక్కనే ఉన్న నీటి తొట్టిలోని నీళ్లతో కడుగుతుండగా.. కొల కొమురమ్మ కులం పేరుతో దూషించింది. అంతటితో ఆగక, పచ్చి బరిగెతో శ్రీకాంత్ వీపుపై కొట్టింది. దీంతో అవమానంతో శ్రీకాంత్ మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం శ్రీకాంత్ మృతి చెందాడు. మృతుడి తల్లి జెల్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కొల కొమురమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

ఇక రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకులు

- 'అమ్మహస్తం' తరహాలో పంపిణీకి ఆలోచన
- సన్న బియ్యంతో పాటు సరుకుల ప్యాకేజీ
- అమల్లోకి వస్తే నిరుపేదలకు ప్రయోజనం

కసరత్తు చేస్తున్న ప్రభుత్వం


రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు (ఫైల్)

హనుమకొండ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇకపై తెల్ల రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు కూడా అందనున్నాయి. రేషన్ షాపుల్లో సన్న బియ్యంతో పాటు సరుకులు అందించాలనే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సన్న బియ్యం పంపిణీ ద్వారా ప్రభుత్వానికి లబ్ధి చేకూరిన నేపథ్యంలో సరుకులను కూడా పంపిణీ చేస్తే ప్రజల నుంచి మరింత ఆదరణ లభిస్తుందనే ఉద్దేశంతో రేషన్ షాపుల ద్వారా సరుకులను అందించేందుకు సిద్ధమవుతోంది. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను అందించే కసరత్తును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది.

రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ మేరకు ఉన్నతాధికారులతో సమీక్ష కూడా నిర్వహించారు. సమీక్ష అనంతరం జిల్లా స్థాయి అధికారులకు కూడా ఈ అంశం చేరడంతో జిల్లాల వారీగా త్వరలో దీనిపై సమీక్షలు జరిపేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాల వారీగా రేషన్ కార్డు లబ్ధిదారులు ఎందరున్నారు, ప్రస్తుతం ఉన్న తెల్లకార్డుల సంఖ్య ఎంత, కొత్త రేషన్ కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులు, ఎన్ని కార్డులు మంజూరు కావచ్చనే విషయాలను ప్రాథమికంగా అంచనాల రూపంలో అందచేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించడంతో ఈ మేరకు జిల్లా అధికారులు కూడా నివేదికలు సిద్ధం చేయనున్నట్లు తెలిసింది. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ పథకం కొత్త విషయమేమీ కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 'అమ్మహస్తం' పేరుతో ఈ పథకాన్ని దేశంలోనే తొలిసారిగా అమల్లోకి తెచ్చింది. అప్పట్లో బియ్యంతో పాటు చక్కెర, వంట నూనె, ఉప్పు, పప్పులు, చింతపండు తదితర వాటిని రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు అందించేది. మొత్తం 9 నిత్యావసర సరుకులతో 'అమ్మహస్తం' ప్యాకేజీగా అప్పట్లో లబ్ధిదారులు తీసుకున్నారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ బొమ్మతో కూడిన ప్యాకెట్లను ప్రజలకు అందించడం ద్వారా నాటి ప్రభుత్వానికి ప్రజల నుంచి రాజకీయ లబ్ధి చేకూరింది. తెలంగాణ ఏర్పడిన తదుపరి ఈ పథకం నిలిచిపోయింది. బీఆర్ఎస్ సర్కార్ ప్రభుత్వం చక్కెర కూడా లేకుండా కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేసింది.

సన్న బియ్యంతో పాటు సరుకుల ప్యాకేజీ

కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా ప్రకటించినట్లుగానే తెల్ల రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం చేపట్టింది. ఉగాది కానుకగా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ ప్రారంభించింది. ఇక జూన్ నుంచి ఆగస్టు వరకు మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి రేషన్ షాపుల నుంచి ప్రజలకు అందచేస్తుంది. సన్న బియ్యం పంపిణీ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించడంతో గతంలో నిలిచిన నిత్యావసర సరుకులను కూడా పంపిణీ చేసే ఆలోచన చేసింది. ఈ మేరకు ఇప్పటికే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షలు జరుపడం, పంపిణీ దిశగా నిర్ణయాలు తీసుకున్నట్లు పౌర సరఫరాల శాఖ అధికారులకు సూత్రప్రాయంగా తెలియ చేయడంతో ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు సంకేతాలు వెలువడ్డాయి.

సన్న బియ్యంతో పాటు నిత్యావసరాల సరుకులను కూడా అందించడం ద్వారా నిరుపేద కుటుంబాలకు సమగ్ర నెల వారి గ్రాసాన్ని అందించినట్లు అవుతుందనే భావనతో ప్రభుత్వం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. బియ్యం, నిత్యావసరాల సరుకుల పంపిణీ, సబ్సిడీ గ్యాస్ ద్వారా మొత్తంగా ప్రజలకు వంట సామాగ్రి అందచేసినట్లు అవుతుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దీని ద్వారా రాజకీయంగా లబ్ధి చేకూరి ప్రభుత్వానికి మరింత ప్రజాధరణ లభిస్తుందనే అంచనాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అయితే అమ్మహస్తం తరహాలోనే తొమ్మిది సరుకులను ప్రభుత్వం అందిస్తుందా? లేక మార్పులు ఉంటాయా, చక్కెరతో పాటు ముఖ్యమైన నిత్యావసరాలు ప్యాకేజీగా అందుతాయా అనే అంశాలు తెలియాల్సి ఉంది.

నిరుపేదలకు ప్రయోజనం

రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాల సరుకుల పంపిణీ అమల్లోకి వస్తే నిరుపేద వర్గాలకు ప్రయోజనకరం కానుంది. సన్న బియ్యం మార్కెట్లో రూ.40కి మించి ధర పలుకుతున్నాయి. ప్రభుత్వ పంపిణీ ద్వారా నిరుపేదలకు సన్న బియ్యం లభిస్తున్నాయి. ఇదే క్రమంలో నిత్యావసరాల సరుకులు కూడా అందితే పేదోడి బతుకు బండి కాస్త అయినా కుదుపులు లేకుండా సాగుతుందనే అంచనాలు ఉన్నాయి.

పెళ్లి బరాత్‌లో ఘర్షణ

- వరుడిపై దాడి చేసిన యువకులు
- మద్యం మత్తులో ఉండి హల్‌చల్
- పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

వర్ధన్నపేట రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పెళ్లి బరాత్‌లో మద్యం మత్తులో కొందరు యువకులు హల్‌చల్ చేసి చివరకి పెళ్లి కుమారుడుపైనే దాడి చేసిన సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం బండవుతాపురం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... బండవుతాపురం గ్రామానికి చెందిన యువతి, యువకుడు ప్రేమించుకొని పెద్దలను ఒప్పించి వివాహం కుదుర్చుకున్నారు. గ్రామ శివారులో ఉన్న ఫంక్షన్‌హాలులో ఆదివారం పెళ్లి జరిగింది. రాత్రి పెళ్లి ఊరేగింపు ప్రారంభం కాగా, డీజే పాటలతో కొందరు యువకులు మద్యం మత్తులో హల్‌చల్ చేయడం మొదలుపెట్టారు. దీంతో పెళ్లి కుమారుడి మేనమామ కలుగజేసుకొని ఆలస్యం అవుతోందని, తొందరగా ఇంటికి వెళ్లాలని యువకులను వారించాడు. దీంతో వారు వాగ్వాదం చేస్తూ అతడిని నెట్టివేసేందుకు ప్రయత్నించారు. దీంతో పెళ్లి కుమారుడు తల్లి వచ్చి ఇదేం పద్ధతి ఇలా తాగి గొడవ చేయవద్దని సముదాయించింది. అయితే సదరు యువకులు ఆమెను సైతం నెట్టివేయడంతో ఆమె కింద పడిపోయింది. ఇదంతా గమనిస్తున్న పెళ్లి కుమారుడు వాహనం నుంచి దిగి వచ్చి మద్యం మత్తులో ఉన్న యువకులతో వాగ్వాదానికి దిగాడు. మాట మాట పెరగడంతో సదరు యువకులు పెళ్లి కుమారుడిపైనా దాడికి దిగారు. దీంతో పెళ్లి కుమారుడికి తీవ్ర గాయాలైనట్టు తెలిసింది. బంధువులు వెంటనే వరంగల్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం వరకు పెళ్లి కుమారుడు ఇంకా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నట్లు సమాచారం. దాడి ఘటనపై పెళ్లి కుమారుడి బంధువులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు గాలింపులు జరిపి పలువురు యువకులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. అయితే పెళ్లికుమారుడిపై దాడికి ప్రేమ వివాహం కూడా కారణమా అనే కోణంలో సైతం పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిసింది.

పీజీ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్

వరంగల్ కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞన పీఠంలో రెగ్యులర్ ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశం పొందడానికి నోటిఫికేషన్ విడుదలైంది.

ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, అదనపు రుసుంతో ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పీఠాధిప తి డాక్టర్ గడ్డం వెంకన్న తెలిపారు. వివరాలకు 9989139136/ 99894 1729 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పర్యాటక ప్రదేశాలకు, పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు


ప్రత్యేక బస్సులకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్ఎం డి. విజయభాను

హనుమకొండ టౌన్, జూన్9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రీజినల్ పరిధిలోని 9 డిపోల నుంచి వివిధ పర్యాటక ప్రదేశాలు, పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. సోమవారం హనుమకొండలోని ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో ప్రత్యేక బస్సులకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ హనుమకొండ నుంచి పంచరామాలు, అరుణాచలం, భద్రాచలం, వేములవాడ, నాగార్జున సాగర్, బోగత, రామప్ప, లక్నవరం, మల్లూరు, ఇతర పర్యాటక ప్రదేశాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక టూర్ ప్యాకేజీ వివరాల కోసం వరంగల్ -1 డిపో సెల్ నంబర్ :9959226047, వరంగల్ -2 డిపో సెల్ నంబర్ : 9959226048, హనుమకొండ డిపో సెల్ నంబర్ 8977781103, పరకాల డిపో సెల్ నంబర్ : 9959226051, నర్సంపేట డిపో సెల్ నంబర్ : 9959226052 , భూపాల్‌పల్లి డిపోసెల్‌నంబర్ : 9959226707, తొర్రూరు డిపో సెల్ నంబర్ : 9959226053, మహబూబాబాద్ డిపోసెల్ నంబర్ : 9959226054,జనగామ డిపో సెల్‌సెంబర్ : 9959226050 లకు సంప్రదించాలని కోరారు. హనుమకొండ నుంచి డిలక్స్‌కు బోగత వాటర్ పాల్స్ ఒకరికి పెద్దలకు రూ. 515, వరంగల్ - 1 డిపో నుంచి సూపర్ లగ్జరీ భద్రాచలం, మల్లూరు, లక్నవరం, రామప్ప వరకు రోజున్నర ప్రయాణానికి రూ. 1000, వరంగల్ -2 డిపో నుంచి సూపర్‌లగ్జరీ పంచరామాలుకు రెండు రోజుల ప్రయాణానికి రూ. 2300, జనగాం డిపోనుంచి డిలక్స్ పాలకుర్తి, కురవి, కిన్నెరసాని, భద్రాచలం పర్ణశాల రెండు రోజుల ప్రయాణానికి రూ. 1000, పరకాల నుంచి డిలాక్స్ బస్సు అరుణాచలంకు మూడు రోజుల ప్రయాణానికి రూ. 2800, భూపాలపల్లి నుంచి సూపర్‌లగ్జరీ బస్సు మల్లూరు, భద్రాచలం పర్ణశాల ఒక రోజు ప్రయాణానికి రూ. 1000, నర్సంపేట నుంచి సూపర్‌లగ్జరీ బస్సు పంచరామాలకు రెండు రోజుల ప్రయాణానికి రూ. 2300, తొర్రూరు నుంచి సూపర్ లగ్జరీ బస్సు కురవి, కిన్నెరసాని భద్రాచలం, మారేడుమిల్లి రెండు రోజుల ప్రయాణానికి రూ.1200, మహబూబాబాద్ నుంచి డిలాక్స్ బస్సు పంచరామాలకు రెండు రోజుల ప్రయాణానికి రూ.1500 ఇది పెద్దలకు చార్జీల ప్యాకేజీ ఉంటుందని ఆర్ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు భానుకిరణ్, రవీందర్, ఏవో సైదులు, పీవో అర్పిత, వరంగల్ - 1 డిపో డీఎం వి.జ్యోత్స్న వరంగల్ -2 డిపో ధరంసింగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

జిల్లా కాంగ్రెస్‌ను ప్రక్షాళన చేస్తాం

- కష్టపడిన వారిని పార్టీ గౌరవిస్తుంది
- వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
- నామినేటెడ్ పదవులతో న్యాయం జరుగుతుంది
- జిల్లా కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : జిల్లా కాంగ్రెస్‌ను త్వరలో ప్రక్షాళన చేస్తామని ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శ్రేణులకు స్పష్టం చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన పార్టీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం శ్రమించిన ప్రతీ ఒక్కరికి గౌరవం దక్కుతుందన్నారు. పార్టీ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొందని చివరకు రాష్ట్రంలో అధికారం దక్కిందన్నారు. ఓపికతో ఉంటేనే ఫలితాలు ఉంటాయన్నారు. పార్టీ శ్రేయస్సే లక్ష్యంగా కష్టపడి పని చేసిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. ఇందుకు తానే ఉదాహరణగా రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సామాన్య కార్యకర్త నుంచి ఎమ్మెల్యే వరకు ఎదగడంలో ఎన్నో ప్రయాసాలకు గురి కావాల్సి వచ్చిందన్నారు. పార్టీ శ్రేణులు సంయమనంతో పని చేయాలని సూచించారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఈ విషయంలో రాజీ ఉండదని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు నష్టం జరిగినా సహిస్తానని, పార్టీకి నష్టం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. త్వరలో నామినేటెడ్ పదవుల భర్తీ జరగనుందన్నారు. పని చేసిన వారికి తప్పక పదవులు దక్కుతాయని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు ఇతర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విస్తృత ప్రచారం చేయాలని శ్రేణులను ఆదేశించారు. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, టీపీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కూచన రవళి, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

పత్తి రైతుల ఆశల సాగు..


చేనులో అచ్చు కొడుతున్న రైతు



పత్తి గింజలు నాటుతున్న కూలీలు, (ఇన్‌సెట్‌లో) మొలకెత్తిన పత్తి

ఆదివారం రాత్రి, సోమవారం జల్లులు కురియడంతో రైతాంగం బిజీగా మారింది. వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని జల్లులు కురియడం, చల్లబడటంతో వందలాది ఎకరాల్లో రైతులు పత్తి గింజలు వేస్తున్నారు. గత నెల చివరి వారంలో అడపదడపా కురిసిన వర్షాల కు కొందరు రైతులు పత్తి గింజలు విత్తే ప్రక్రియ చేపట్టారు. వర్షాలు సకాలంలో కురియకపోవడంతో పత్తి విత్తనాలు మొలకెత్తడం అరకొరగానే సాగింది. సీజన్‌లో 98శాతానికి పైగా పత్తి విత్తనాలు వేసే ప్రక్రియ పూర్తయింది. వేలాది ఎకరాల్లో విత్తిన పత్తి గింజలు కురుస్తున్న వర్షాలతో బాగా మొలకెత్తి ఈ ఏడాది పత్తిలో బాగా దిగుబడులు వచ్చి ధర మంచిగా ఉండాలని రైతాంగం ఆశిస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో సోమవారం కనిపించిన సాగు దృశ్యాలివి.

-ఆంధ్రజ్యోతి, కాటారం

పాఠ్యాంశాల బోధనపై పర్యవేక్షణ

- ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించనున్న విద్యాశాఖాధికారులు
- ఇక నుంచి పాఠశాలల్లో వివిధ స్థాయిల అధికారుల తనిఖీలు
- సంతకాలు చేసి పనులు చేసుకునే ఉపాధ్యాయులకు చెక్



వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో విద్యాబోధన ఎలా సాగుతుందనే విషయాన్ని పూర్తి స్థాయిలో తెలుసుకునేందుకు విద్యాశాఖ సమాయత్తం అవుతోంది. పాఠశాలల పనితీరు ఎలా ఉంది... పంతుళ్లు పాఠాలెలా చెబుతున్నారు... విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలెలా ఉన్నాయి... తదితర అంశాలను ఎప్పటికప్పుడ తెలుసుకునేందుకు విద్యాశాఖలోని వివిధ స్థాయిల్లోని అధికారులు తనిఖీలు చేసేందుకు విద్యాశాఖ ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ ఈవి. నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ స్థాయి నుంచి స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ వరకు ప్రతీ రోజు ఎవరో ఒకరు పాఠశాలలను తనిఖీలు చేసేలా కార్యాచరణ రూపొందించారు. తద్వార పాఠశాలల్లో నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటుకు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తూ విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా విద్యాశాఖ రోజువారి తనిఖీలకు శ్రీకారం చుట్టింది. డైరెక్టర్, హెచ్‌వోడీలు, అడిషనల్ డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లతో పాటు ఇతర రాష్ట్ర స్థాయి అధికారులు వారంలో కనీసం ఒక రోజు రెండు స్కూళ్లను సందర్శించి పూర్తి స్థాయిలో విషయాలు తెలుసుకోవాలి. అంటే నెలలో 8 నుంచి 10 స్కూళ్లను విజిట్ చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ఆర్జేడీలు, డీఈవోలు వారానికి రెండు రోజులు కనీసం 3 లేదా 4 స్కూళ్లను, నెలలో 12 నుంచి 16 స్కూళ్లను సందర్శించాలి. ఎంఈవోలు, సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్లు వారానికి 3 రోజుల్లో ఐదారు స్కూళ్లు, నెలలో 20 నుంచి 24 స్కూళ్లను సందర్శించి ఉన్నతాధికారులకు నివేదించాలి. వీరందరితో పాటు కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు వారానికి 2 రోజులు కనీసం నాలుగైదు స్కూళ్లను సందర్శించాలి. నెలలో 16 నుంచి 20 స్కూళ్లను సందర్శించి సంబంధిత పాఠశాలల్లో వారు గమనించిన పాఠశాల నిర్వహణ తీరు, పాఠ్యాంశాల బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపించాలి.

ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్) తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. తనిఖీలు తూతూ మంత్రంగా ఉండొద్దని, తనిఖీలు చేసే అధికారులు పాఠశాలల్లో కనీసం 3 గంటల పాటు ఉండాలన్నారు. టీచర్ క్లాస్ చెబుతుండగా మొత్తం విని ఫీడ్ బ్యాక్ ఇవ్వాలి.. స్టాఫ్ మీటింగ్ కండక్ట్ చేసి అకడమిక్ గైడెన్స్ రిజిస్టర్‌లో సమాచారాన్ని పొందుపరచాలి.. దాన్ని ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.. అలాగే విజిట్ చేసిన పూర్తి సమాచారాన్ని తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో పొందుపరచాలి.. ఇక ప్రతీ నెల 28న ఎంఈవోలు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లతో డీఈవోలు జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించి స్కూళ్ల సందర్శనలో గమనించిన అంశాలపై సమీక్ష చేయాలి.. అని పేర్కొన్నారు.

ఇకనుంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం

కేజీబీవీ, మోడల్‌స్కూళ్లు, టీఆర్ఈఐఎస్ సిబ్బందికి శిక్షణ



మొగుళ్లపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఇటీవలకాలంలో ఫుడ్ పాయిజన్ ఘటనలు కలకలం రేపిన విషయం విదితమే. నాణ్యతలేని సరుకులు, వంటకాలు, అపరిశుభ్రత వాతావరణంలో ఆహారం తయారు చేయడం, తదితర కారణాలతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో బడిపిల్లలు ఆహారం తీసుకునేందుకు జంకుతున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ పలు చర్యలకు ఉపక్రమించింది. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలతోపాటు మోడల్‌స్కూళ్లు, టీఆర్ఈఐఎస్ బాలికల హాస్టళ్లలో పనిచేస్తున్న వంట మనుషులకు శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని కేజీబీవీలో మంగళవారం పారిశుధ్య కార్మికులకు, బుధవారం వంట మనుషులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

మెనూ ప్రకారం తయారీ

భూపాలపల్లి జిల్లాలో 11 కేజీబీవీలు, ఐదు మోడల్‌స్కూల్ హాస్టళ్లు, ఒక టీఆర్ఈఐఎస్ బాలికల హాస్టల్‌లో విద్యనభ్యసించే పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన బాలికలకు నాణ్యతతో కూడిన ఆహారం అందించడం, విద్యాలయాలను పరిశుభ్రంగా ఉంచడంపై విద్యాశాఖ దృష్టి సారించింది. ఈనెల 12నుంచి విద్యాసంవత్సరం ప్రారంభం కానుండడంతో హాస్టళ్లకు వచ్చే బాలికలకు రుచికరమైన మంచి భోజనం అందించేలా అవసరమైన చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగాఆహారం తయారీలో మంచిపేరు పొందేందుకు జిల్లా నుంచి ఇద్దరు వంట మనుషులు, ఒక టీచర్, అదేవిధంగా పరిశుభ్రత కోసం ఇద్దరు పారిశుధ్య కార్మికులు, ఒక ఏఎన్ఎం హైదరాబాద్‌లో శిక్షణ పొందారు. వీరు జిల్లాస్థాయిలో రెండు రోజులపాటు కేజీబీవీ, మోడల్‌స్కూళ్లు, టీఆర్ఈఐఎస్‌లోపనిచేస్తున్న వంటమనుషులు, పారిశుధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వనున్నారు.

నిట్‌లో ఓపెన్ హౌజ్

- పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు
- సందేహాలను నివృత్తి చేసిన డైరెక్టర్
- కోర్సులను జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలని సూచన


నిట్‌లో ఓపెన్ హౌజ్‌లో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి

హనుమకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో సోమవారం ఓపెన్ హౌజ్ విజయవంతంగా జరిగింది. సుమారు 200 మందికిపైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. వరంగల్ నిట్‌లో రాబోయే విద్యా సంవత్సరంలో ప్రవేశాలను పురస్కరించుకొని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేసేందుకు ఈ ఓపెన్ హౌజ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నిట్‌లో ప్రవేశ ప్రక్రియ, విద్యా కోర్సులు, నిట్‌లో చదువుకునే విద్యార్థుల జీవన శైలి వంటి అంశాలపై నిట్ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి మాట్లాడుతూ వరంగల్ నిట్ చరిత్ర, విద్యా ప్రమాణాలు, పరిశోధనా కార్యక్రమాలు, ఆధునిక వసతులు, విద్యార్థి దృష్టి కోణం, గురించి సవివరంగా తెలియచేశారు. ప్రవేశాలు కోరే అభ్యర్థులు కోర్సులను జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. నిట్ అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ ఏ శరత్ బాబు జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ గురించి విశదీకరించారు. ఈ ఓపెన్ హౌజ్‌లో ప్రవేశాల చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎన్‌వి ఉమామహేశ్ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు వ్యక్తం చేసిన పలు సందేహాలను నివృత్తి చేశారు. నిట్‌లో చేపట్టే కార్యక్రమాలు, నిట్‌లోని వివిధ విభాగాలు, నిట్‌లో చేరేందుకు అర్హతలపై అవగాహన కల్పించారు. ప్రవేశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఎస్. రవి చంద్ర ఈ ఓపెన్ హౌజ్‌ను ఓ ఆత్మీయ వేదికగా అభివర్ణించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగానే కాక అనేక మంది లైవ్‌స్ట్రీమింగ్ ద్వారా కూడా పాల్గొన్నారు. సుమారు 2 గంటల పాటు ప్రశ్నలు, సమాధానాల సేషన్ నిర్వహించారు.

నేడు పింగిళి కళాశాలలో జాబ్‌మేళా

వడ్డేపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళి గౌడ్, ఎంట్రీ ప్రీనర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఈడీపీ) సెల్ కన్వీనర్ డాక్టర్ జీ రాజు తెలిపారు. నాలుగు ప్రముఖ కంపెనీలు జాబ్ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొంటాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పాసైన విద్యార్థులు అర్హులని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నంబర్ : 7780556841లో సంప్రదించాలని డాక్టర్ రాజు కోరారు.

మెట్టుగుట్ట ఆర్చి కాలనీ నూతన కమిటీ ఎన్నిక

మడికొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్ట ఆర్చి కాలనీవాసులు సోమవారం కాలనీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుతోట ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా రామంచ కిషన్, కార్యదర్శిగా బైరు విజయ్‌కుమార్, కోశాధికారిగా బైరి సతీష్‌గౌడ్, సలహాదారులు, సభ్యులుగా ఆంథోని, రమేష్, సంపత్, తోట యాదగిరి (మెకానిక్), అశోక్, సంపత్, బాలయ్య, చంద్రమూర్తి ఎన్నికైనట్లు కాలనీవాసులు తెలిపారు.



హనుమకొండ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య

కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

హనుమకొండ కలెక్టరేట్/ వరంగల్ కలెక్టరేట్ జూన్ 9(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కోటి మంది మహిళా సంఘాల మహిళలను కోటీశ్వరులను చేస్తామని, ఇదే తమ లక్ష్యమని, ఇందుకోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. సోమవారం సాయంత్రం మంత్రి సీతక్క సీఎస్ కె.రామకృష్ణారావుతో కలిసి బడిబాట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలో మహిళా సంఘాలకు పెట్రోల్ పంపు ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని, ఒక పెట్రోల్ పంప్ ఏర్పాటు వల్ల 10 కుటుంబాలు బాగుపడతాయన్నారు. నవంబర్ నాటికి జిల్లాలో చేపట్టిననూతన ఇందిరా మహిళా శక్తి భవనాలు పూర్తి చేయాలని, ఈ మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా గత నవంబర్‌లో శంకుస్థాపన చేసుకున్నామని, చాలా జిల్లాల్లో వీటి పురోగతి ఆశించి స్థాయిలో లేదన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లను సమన్వయం చేసుకుంటూ నిర్దేశించుకున్న గడువులోపు పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. జూన్ 12వ తేదీన పండుగ వాతావరణంలో పాఠశాలలు పునఃప్రారంభం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య, అధికారులు పాల్గొన్నారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అధికారులు పాల్గొన్నారు.

సమాజ రుగ్మతలను నిర్మూలించేందుకు పరిశోధనలు దోహదం

కేయూ పొలిటికల్ సైన్స్ బీవోఎస్ ఛైర్మన్ కృష్ణయ్య

కేయూ క్యాంపస్ జూన్ 9, (ఆంధ్రజ్యోతి) : సమాజ రుగ్మతలను నిర్మూలించేందుకు పరిశోధనలు దోహదపడుతాయని కేయూ పొలిటికల్ సైన్స్ బీవోఎస్ ఛైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య అన్నారు. సోమవారం కేయూ రాజనీతిశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ నేతృత్వంలో పరిశోధకులకు రిసెర్చ్ మెథడాలజీపై అవగాహన తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య కీలక ప్రసంగం చేశారు. భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య నిర్మాణానికి ప్రాతిపదికగా నిలుస్తోందన్నారు. సామాజిక రూపాంతరానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు కీలకమని చెప్పారు. ప్రభుత్వ విధాన నిర్మాణం. అమలు, ప్రక్రియ, సామాజిక ఉద్యమాల ప్రభావం వహిస్తాయని అన్నారు. పొలిటికల్ సైన్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వేదపల్లి నాగరాజు తదితర పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ...?

వరంగల్ కార్పొరేషన్, జూన్ 9 (ఆంధజ్యోతి): హనుమకొండలోని 30వ డివిజన్ పరిధిలో ఇటీవల అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పట్టించుకోవడం లేదని 30వ డివిజన్ కార్పొరేటర్ రావుల కోమల కిషన్ వాపోయారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యాలయంలో అక్రమ కట్టడాలకు అదనపు కమిషనర్ జోనాను కలిసిన తర్వాత బల్దియా కార్యాలయం ఎదుట స్థానిక ప్రజలతో నిరసన వ్యక్తం చేశారు. అదనపు కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదు కాపీలతో కొద్ది సేపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోమల-కిషన్ మీడియాతో మాట్లాడారు. డివిజన్‌లోని కుడా గ్రౌండ్ ఎదురుగా శ్రీచక్ర ఆసుపత్రిని అనుమతులు లేకుండానే నిర్మాణాలు జరిపారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు జీడబ్ల్యూఎంసీలో ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఏ మాత్రం పార్కింగ్ స్థలం లేకుండా రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు జరపడం వల్ల వైద్యం కోసం వచ్చేవారి వాహనాలు రోడ్డు మీద పార్కింగ్ చేయడం వల్ల అందరికి ఇబ్బంది ఏర్పడుతుందని అన్నారు.

ఇక బరిస్టా జ్యూస్ రెస్టారెంట్ ముందు రోడ్డుపైన పార్కింగ్ చేయడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇంకా దేవిక ఆసుపత్రి నిర్మాణాలు రోడ్డును ఆక్రమించి నిర్మించారని, రోడ్డుపై రేకులతో కూడిన షెట్టర్లు వేసి వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని మండి పడ్డారు. ఇప్పటికైనా 30వ డివిజన్‌లో అక్రమ కట్టడాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని లేదంటే హైదరాబాద్ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరికి ఫిర్యాదు చేస్తామని కోమలకిషన్ హెచ్చరించారు. కొద్ది సేపటి తర్వాత బల్దియా అధికారులు నచ్చజెప్పడంతో నిరసన విరమించారు.

ఎవరికైనా డబ్బులిస్తే ఇల్లు రద్దు

- అర్హులందరికీ 'ఇందిరమ్మ' ఇళ్లు
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ సుధారాణి

వడ్డేపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరికైనా డబ్బులు ఇస్తే వారి ఇల్లు రద్దు చేసి డబ్బులు తీసుకున్న వారిని జైలుకు పంపిస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. అర్హులందరికీ 'ఇందిరమ్మ' ఇళ్లు కేటాయిస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 13 డివిజన్లకు చెందిన సుమారు 750 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పంపిణీ చేశారు.తొలుత బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో 4 లక్షల 50 వేల మందికి ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో రూ. 175కోట్లతో 3,500 ఇళ్లు నిర్మించబోతున్నట్లు వెల్లడించారు. ఒక్కొక్క ఇంటికి రూ. 5లక్షల చొప్పున నాలుగు విడతల్లో నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 20 వేల దరఖాస్తులు వస్తే 8 వేల మందిని అర్హులుగా గుర్తించామని స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇల్లు రానివారికి రెండో విడతలో అవకాశం వస్తుందన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ఇందిరమ్మ పథకం నిరంతర ప్రక్రియ అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్‌గౌడ్, కార్పొరేటర్లు సిరంగి సునీల్‌కుమార్, జక్కుల రజిత వెంకటేశ్వర్లు, జన్ను షీబారాణి, కాంగ్రెస్ నాయకులు కొంకా హరిబాబు, గడ్డంశివరాం, వీసం సురేందర్‌రెడ్డి, గుర్రం అమర్‌నాథ్, సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కే పూర్ణచందర్, దూలం సదానందంగౌడ్, బిల్లా రవీందర్, దేవరకొండ అనిల్, విజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు, చిత్రంలో మేయర్, కమిషనర్

పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్9(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని డీఈవో డి.వాసంతి సూచించారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో హైజెనిక్ హెల్త్ మీల్ ప్రిపరేషన్ పై పోషన్ అభియాన్ ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. వంటకు వాడే సామాగ్రిని పరిశుభ్రమైన ప్రదేశాల్లో భద్రపచుకోవాలని, నాణ్యమైన పోషకాలు గల కూరగాయలు ఇతరత్ర వస్తువులతో మధ్యాహ్న భోజనాన్ని తయారు చేయాలన్నారు. డీఈవో ఆఫీస్ సూపరింటెండెంట్ జీఎస్. ప్రసాద్‌రావు, హెడ్మాస్టర్లు రామారావు, మధు, కవిత, సంపూర్ణ, ఎంఈవోలు నెహ్రూ, మనోజ్, శ్రీధర్, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.



గోకుల్ నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నాయిని, మేయర్ సుధా రాణి, కమిషనర్ అశ్విని

గోకుల్‌నగర్ జంక్షన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ప్రజల భద్రత, నగరాభివృద్ధికి కృషి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డేపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని గోకుల్‌నగర్ జంక్షన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చెప్పారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ పరిధిలోని గోకుల్ జంక్షన్, అశోక కాలనీ ప్రాంతంలో పర్యటించి మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులను మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల భద్రత, నగరాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గోకుల్ జంక్షన్, అశోక కాలనీ నుంచి రాజాజీ నగర్ వరకు డబుల్ డ్రైనేజీలను నిర్మిస్తున్నట్లు స్పష్టం చేశారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా సైడ్ డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. గోకుల్ జంక్షన్ వద్ద విద్యుత్ దీపాలు, ఫుట్‌పాత్‌లు, సిగ్నల్ వ్యవస్థ, సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపారాణి, కాంగ్రెస్ రాష్ట్ర నేత ఈవీ శ్రీనివాస్, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, బంక సతీష్, బంక చంద్రశేఖర్ యాదవ్, బల్దియా ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బస్సుల కోసం ప్రయాణికుల ఇక్కట్లు

- పలు రూట్లలో గంటల తరబడి వేచి ఉన్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



బస్టాండ్‌లో కరీంనగర్ రూట్ ప్రాంగణం వద్ద బస్సు కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

హనుమకొండ టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సరిపైన బస్సులు లేక వివిధ రూట్లలో వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం సమయంలో కరీంనగర్ , హైదరాబాద్, ఖమ్మం, ఏటూర్ నాగారం ఇతర రూట్లల్లో బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ప్రాంగణంలో బస్సు రావడంతోనే ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ వెళ్లి బస్సులో సీట్ల కోసం పలుమార్లు ప్రయాణికులు గొడవ పడినట్లు తెలిపారు. ఆర్టీసీ అధికారులకు చెప్పినా ప్రయాణికులకు సరిపడా బస్సులు ఏర్పాటు చేయడం లేదని ప్రయాణికులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. వరంగల్ రీజినల్ పరిధిలోని 9 డిపోల పరిధిలో చాలీ చాలని బస్సులతో సీట్ల కంటే ఎక్కువ మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన రూట్లల్లో బస్సు సర్వీస్‌లను నడపాలని అధికారులను కోరుతున్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగస్వాములవ్వాలి

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



గోడ పత్రికను ఆవిష్కరించిన కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : బాల కార్మిక వ్యవస్థలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. బాలల జీవితాలు అంధకారం కాకుండా ఉండేందుకు అందరు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే 1098కు సమాచారం అందించాలని సూచించారు. బాల కార్మిక నిర్మూలన స్పెషల్ డ్రైవ్ నిర్వహణ విషయంలో సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష జరిగింది. జిల్లా సంక్షేమ అధికారి జయంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. జూన్ 9 నుంచి 15 వరకు జిల్లాలో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు చెప్పారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. వ్యాపారులు ఇతరులు ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలకు గురవుతారని హెచ్చరించారు. జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాలు, వ్యాపార సంస్థలు తదితర వాటిని గుర్తించి తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాల కార్మిక నిర్మూలనకు సంబంధించిన పోస్టర్‌ను ఈ సందర్భంగా కలెక్టర్ ఆవిష్కరించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి బాలసముద్రంలోని లేబర్ అడ్డా వరకు అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆ విష్కరిస్తున్న ఎంఈవో మనోజ్‌కుమార్

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య

మడికొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులు, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో గుణాత్మక విద్య అందుతుందని కాజీపేట ఎంఈవో బండారు మనోజ్‌కుమార్ అన్నారు. సోమవారం కడిపికొండ రాజీవ్ గృహకల్ప కాలనీవాసులతో సమావేశంలో మాట్లాడారు. అలాగే బడిబాట కరపత్రాలను ఆవిష్కరించారు. తల్లిదండ్రులు బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. సమావేశంలో హెచ్ఎం మంజుల, జమీలబేగం, టీచర్లు చుంచుకాల లింగారావు, శ్రీనివాస్, రమేష్, నవీన్, పీటర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, కాలనీవాసులు కుమారస్వామి, లత, కైలాసం తదితరులు పాల్గొన్నారు. అలాగే, కాజీపేట మండలం రాంపూర్ మండల ప్రాథమిక పాఠశాలలో బడిబాట కరపత్రాలను తహసీల్దార్ బావుసింగ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాంచంద్రారెడ్డి, టీచర్లు లీలారాణి, లక్ష్మి, బాలోజు బ్రహ్మాచారి, అరుణ, శంషుద్దీన్, స్వర్ణలత, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్‌పర్సన్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలకు మహర్దశ

5వ పేజీ తరువాయి

విడుదల చేయడంతో చాలా వరకు సమస్యలు పరిష్కారం కానున్నాయి. ఈ నిధులతో పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తే విద్యాలయాలు మరింత బలోపేతం అవుతాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

నాణ్యమైన విద్య

షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులు, మైనారిటీ వర్గాలు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన బాలికలకు విద్యా సౌకర్యాలను అందించే లక్ష్యంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రాథమిక స్థాయిలో వసతి సౌకర్యాలతో కూడిన రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయడం ద్వారా సమాజంలోని అణగారిన వర్గాల బాలికలకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా చూడడం కేజీబీవీ లక్ష్యం. అయితే ఉమ్మడి జిల్లాలోని పలు కేజీబీవీల్లో కనీస వసతులు లేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. మరుగుదొడ్లు తక్కువ సంఖ్యలో ఉండడం, ఉన్నవి దెబ్బతినడం, చాలా వాటికి తలుపులు లేకపోవడంతో విద్యార్థినిలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థినులకు సరిపడా తరగతి గదులు లేని కేజీబీవీలు కూడా ఉన్నాయి. మరమ్మత్తులకు నోచుకోక శుద్ధ జలయంత్రాలు మూలపడడంతో విద్యార్థినులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు.ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కేజీబీవీలకు ఈ నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో వీలైనంత మౌలిక సదుపాయలను కల్పించాలని అధికారులను ఆదేశించింది.

సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 9 (ఆం ధ్రజ్యోతి) : ప్రజావాణి సమస్యలపై అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించేలా చూడాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యలపై 137 వినతులు వచ్చాయి. ఇందులో ఎక్కువగా గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌కు 16 ఫిర్యాదులు రాగా, హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయానికి 12, హౌసింగ్ పీడీకి 12, హనుమకొండ ఆర్డీవో కార్యాలయానికి 11 ఫిర్యాదులు వచ్చాయి. మిగతావి వివిధ డిపార్ట్‌మెంట్‌లకు వచ్చాయి. ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ బాధితుల వినతులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులను పిలిచి ఫిర్యాదుపై ఎంక్వైరీ చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, పరకాల, హనుమకొండ ఆర్డీఓలు డాక్టర్ నారాయణ, రాథోడ్ రమేష్‌తో పాటు వివిధ డిపార్ట్‌మెంట్‌లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



బాధితుల నుంచి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

- గౌడ కులానికి చెందిన తనను గ్రామంలోని కొందరు గౌడ పెద్దమనుషులు అన్యాయంగా కుల బహిష్కరణ చేసి తాటిచెట్లు ఎక్కకుండా చేస్తున్నారని హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామానికి చెందిన టి.రామకృష్ణ ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఎల్లమ్మగుడి అభివృద్ధికి చందాలు వసూలు చేసి సొంతానికి కొందరు వాడుకున్నారని నిలదీసినందుకు తనపై కక్షతో కుల బహిష్కరణ చేసి ఇబ్బందులు పెడుతున్నారన్నారు.
- హనుమకొండలో విచ్చలవిడిగా వెలిసిన అనుమతిలేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుని సీజ్ చేయాలని భారత ఐక్య ఫెడరేషన్(యూఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి రాజేష్ నాయక్ కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మడికొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ కిషన్ సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సోమవారం అయోధ్యాపురం శివారులోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులతో ఇన్‌స్పెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణ కోసం వివిధ రాష్ట్రాల కార్మికుల వివరాలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. మత్తు పదార్థాల అలవాటును వెంటనే మానుకోవాలని సూచించారు.సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు అవగాహన కల్పించారు. ఎస్సై రాజ్‌కుమార్, పోలీస్‌సిబ్బంది, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

లేగదూడ అక్రమ రవాణాదారులపై కేసు

మడికొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): లేగదూడ అక్రమ రవాణాదారులను అదుపులోకి తీసుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేశారు. ముగ్గురు వ్యక్తులు ఆటోలో లేగదూడను తరలిస్తూ కనిపించారు. వారిని ఆపి విచారణ చేశారు. కడిపికొండకు చెందిన బస్కె నవీన్, దర్గా కాజీపేటకు చెందిన ఎండీ యూసఫ్, ఎండీ అబీద్ హుస్సేన్ నుంచి లేగదూడ, ఆటోను స్వాధీనం చేసుకొని పీఎస్‌కు తరలించారు. లేగదూడను కాజీపేటలోని గోశాలకు తరలించామన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

'ఆపరేషన్ కగార్'ను వెంటనే ఆపాలి

5వ పేజీ తరువాయి

వచ్చినప్పటికీ కేంద్రం సానుకూలత వ్యక్తం చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌లో ఆదివాసీలు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. శాంతితో సామరస్యంగా వ్యవహరిస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు.పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రమేశ్ చందర్ మాట్లాడుతూ.. మావోయిస్టులను కర్కశంగా చంపుతూ శవాలను కుటుంబ సభ్యులకు ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. మావోయిస్టులపై పోలీసులు ఏకపక్షంగా కాల్పులు జరుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమరవీరుల కుటుంబాలపై బీజేపీ ప్రభుత్వ విధానాలను నిరసించాలని అన్నారు. విముక్త చిరుతల కక్షి (వీసీకే) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘించే చర్యలను ఖండించాలని అన్నారు. భారత్ బచావో రాష్ట్ర నేత వెంగల్ రెడ్డి, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ రాష్ట్ర నేత రాచర్ల బాలరాజులు మాట్లాడుతూ..ఆదివాసీలు, ప్రజల హక్కులు ఆపరేషన్ కగార్‌తో ప్రమాదంతో పడ్డాయన్నారు. కేంద్రం ప్రజల జీవించే హక్కులను కాలరాస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. విరసం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కార్యదర్శి కుమారస్వామి, పీస్ కమిటీ రాష్ట్ర నేత సాధిక్ అలీ,అభ్యుదయ రచయితల సంఘం నేత శంకర్‌నారాయణ మార్క్స్, సైంటిఫిక్ స్టడీ ఫోరం (ఎస్ఎస్ఎఫ్)రాష్ట్ర కన్వీనర్ దార్వక, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా వరంగల్ కార్యదర్శి మర్రి మహేశ్, టీఎస్‌డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ క్రాంతికుమార్, బీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివ, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జన్ను రాజు, తెలంగాణ స్టూడెంట్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ఏఐడీఎస్ఓ కేయూ అధ్యక్షుడు మధు. ప్రోగ్రెసివ్ స్టూడెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సనత్ జై సూర్య, డెమొక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ పాల్గొన్నారు.

కాలకృత్యం





పొద్దున్నే పొట్ట ఖాళీ అయితే అదొక సంతృప్తి. కానీ కొన్నిసార్లు ఆ పని సజావుగా జరగక మలబద్ధకం వేధించవచ్చు. ఇలా అరుదుగా జరిగితే ఫరవాలేదు. వారాల తరబడి కొనసాగితే, పరిస్థితిని తీవ్రంగానే పరిగణించాలంటున్నారు వైద్యులు. మలబద్ధకం, మూల కారణాలు, పరిష్కారాలు, పరిణామాల గురించి ఇలా వివరిస్తున్నారు.

మలబద్ధకం మతలబు

ప్రతి రోజూ ఉదయం నిద్ర లేచిన వెంటనే కాలకృత్యాలు తీర్చుకోవడం ఆరోగ్యకరం. నిజమే! కానీ అందరికీ ఈ సూత్రం వర్తించదు. రెండు, మూడు రోజులకోసారి విరేచనమయ్యే వాళ్లు కూడా ఉంటారు. వాళ్లకు చిన్నప్పటి నుంచి అలవడిన అలవాటు అది. కాబట్టి మలబద్ధకం ఉందో, లేదో ఎవరికి వారు తెలుసుకోవడం కోసం కొన్ని లక్షణాలను గమనించాలి. ముక్కవలసిన అవసరం లేకుండా, నిమిషాల వ్యవధిలోనే సుఖ విరేచనం సంతృప్తిగా జరిగిపోతే మలబద్ధకం లేనట్టే! ఇందుకు భిన్నంగా ప్రతిసారీ ముక్కవలసి వస్తున్నా, మలం పెంటికల్లా గట్టి ఉండలు కట్టినా, మలవిసర్జన తదనంతరం పొట్ట ఖాళీ కానట్టు అనిపిస్తున్నా మలబద్ధకంగానే భావించాలి. అయితే సరిపడా పీచు తినకపోవడం, నీళ్లు తాగకపోవడం వల్ల అప్పుడప్పుడూ తాత్కాలిక మలబద్ధకం కొంత ఇబ్బంది పెట్టవచ్చు. దీన్ని తీవ్రంగా పరిగణించవలసిన అవసరం లేదు. కానీ కొన్ని రెండు వారాలకు మించి మలబద్ధకం కొనసాగితే వెంటనే వైద్యులను కలవడం మంచిది.


లాక్సేటివ్స్ వాడుకుంటే...

మలబద్ధకాన్ని నివారించుకోవడం కోసం కాయంచూర్ణ లాంటి ఆయుర్వేద మందుల మీద ఆధారపడేవాళ్లూ ఉంటారు. వీటిలో కూడా సహజసిద్ధ పీచు మాత్రమే ఉంటుంది. ఇవి హానికరమైనవి కాకపోయినా, వీటిని వాడుకోవలసిన అవసరం వస్తుంటే, ఆ అవసరం ఎందుకొస్తోంది? అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. మలబద్ధకాన్ని మందులతో సరిదిద్దుకోవడానికి బదులుగా మూల కారణాన్ని కనిపెట్టి, దాన్ని సరిదిద్దుకోవడం మీదే దృష్టి పెట్టాలి. కానీ కారణాన్ని తెలుసుకోకుండా గుడ్డిగా మందులు వాడుకుంటే మూల కారణం మరుగున పడి, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది.

కారణాలు అనేకం

మలబద్ధకానికి చాలా కారణాలున్నాయి. మన ఆహార, జీవనశైలులు కూడా మన మలవిసర్జనను ప్రభావితం చేస్తాయి. ఈ ఇబ్బందికి ఇంకొన్ని వైద్యపరమైన కారణాలు కూడా ఉంటాయి. అవేంటంటే....

- హైపో థైరాయిడిజం



45 దాటిన వాళ్లకు 'కొలనోస్కోపీ'

పెద్దపేగు క్యాన్సర్ ప్రధాన లక్షణం మలబద్ధకం. కాబట్టి 45 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ కొలనోస్కోపీ పరీక్ష చేయించుకోవడం అవసరం. పెద్దపేగు క్యాన్సర్ చిన్న చిన్న పాలిప్స్ రూపంలో మొదలవుతుంది. కొలనోస్కోపీతో పెద్దపేగులను పరీక్షించి, ఈ పాలిప్స్‌ను తొలగించుకోగలిగితే క్యాన్సర్‌కు దారి తీయకుండా ఉంటుంది. మునుపు పెద్దపేగు క్యాన్సర్ ఎక్కువ మందిలో కనిపిస్తూ ఉండేది. కానీ కొలనోస్కోపీ అందుబాటులోకి రావడంతో, ఈ పరీక్షతో ముందస్తుగానే పాలిప్స్‌ను గుర్తించి వాటిని తొలగించుకోవడంతో, ఈ క్యాన్సర్ తీవ్రత బాగా తగ్గిపోయింది. అన్ని రకాల క్యాన్సర్లలో మొదటి స్థానంలో ఉన్న పెద్ద పేగు క్యాన్సరు నేడు ఎనిమిదో స్థానానికి పరిమితం అయిపోయింది. కాబట్టి 45 దాటిన ప్రతి ఒక్కరూ ఒకసారి కొలనోస్కోపీ చేయించుకుని, పాలిప్స్ లాంటివి లేకపోతే ఆ తర్వాత ఐదేళ్లకోసారి పరీక్ష చేయించుకుంటే సరిపోతుంది. ఒకవేళ మొదటి పరీక్షలోనే పాలిప్స్ లాంటివి కనిపిస్తే, వాటి సంఖ్య ఆధారంగా, వైద్యుల సూచన మేరకు ప్రతి ఏడాదీ లేదా మూడేళ్లకోసారి కొలనోస్కోపీ చేయించుకుంటూ ఉండాలి. పైగా కొలనోస్కోపీ ఎంతో సరళమైన, సురక్షితమైన పరీక్ష. పది నిమిషాల్లో పూర్తయిపోయే ఈ పరీక్షతో ఎలాంటి నొప్పి, అసౌకర్యం కలగదు.

- పారా థైరాయిడ్ గ్రంథులు అవసరానికి మించి పని చేయడం
- శరీరంలో క్యాల్షియం మోతాదులు పెరగడం
- మూత్రపిండాల సమస్యలు
- పెద్ద పేగుల కదలికలు మందగించడం
- గుండెపోటుకు గురవడం
- పార్కిన్సన్స్ వ్యాధి బారిన పడడం
- మంచానికే పరిమితమవడం
- కటి కండరాల మధ్య సహకారం లోపించడం
- గుండె జబ్బుల మందులు, నొప్పి నివారణ మందులు వాడుకోవడం

మలబద్ధకం అంటే?

ప్రతి రోజూ మలవిసర్జన అలవాటు ఉన్న వాళ్లకు రోజుల తరబడి సుఖ విరోచనం జరగకపోయినా, రోజుకు పదిసార్లు వెళ్లినా విరోచనం అవకపోతున్నా, వెళ్లిన ప్రతిసారీ ముక్కవలసి వస్తున్నా, మలం పెంటికల్లా గట్టి పడినా మలబద్ధకంగానే భావించాలి. మూడు రోజులకు మలవిసర్జన చేసే అలవాటు ఉన్నవాళ్లు, ఆ సమయంలో విసర్జన కోసం కష్టపడవలసి వస్తున్నా, దాన్ని కూడా మలబద్ధకంగానే భావించాలి. అయితే ఆహారంలో పీచును పెంచి, నీళ్లు ఎక్కువగా తాగడం లాంటివి పాటిస్తే మలబద్ధకం తొలగిపోతుంది. ఈ జాగ్రత్తలు పాటించినా రెండు వారాలకు పైగా మలబద్ధకం వేధిస్తే వైద్యులను తప్పనిసరిగా సంప్రతించాలి. మరీ ముఖ్యంగా 45 ఏళ్లు దాటిన వాళ్లు వారి మలవిసర్జన క్రమం తప్పితే వెంటనే అప్రమత్తం కావాలి. అలాగే మలంలో రక్తం పడడం, అకారణంగా బరువు తగ్గడం, పొట్టలో నొప్పి లాంటివి పెద్దపేగు క్యాన్సర్ లక్షణాలు కాబట్టి, 45 ఏళ్లు దాటిన వాళ్లు మలబద్ధకంతో పాటు ఈ లక్షణాలు కూడా కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి.

నిర్లక్ష్యం చేస్తే...

మలబద్ధకంతో ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలుంటాయి. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించేవాళ్లు ఎంతో అరుదు. ఈ ఇబ్బంది గురించి తమలో తాము ఆలోచించుకుంటూ కుంగిపోతూ ఉంటారే తప్ప సమస్యను తీవ్రంగా పరిగణించరు. నిజానికి మలబద్ధకం జీవన నాణ్యతను కూడా దెబ్బ తీస్తుంది. సుఖ విరోచనం జరగని సందర్భాల్లో, తెలియని అసౌకర్యంతో చికాకు, మానసిక కుంగుబాటులకు గురవుతూ ఉంటారు. రోజంతా దాని గురించే ఆలోచించడం, నిద్రకు దూరమవడం, పని సామర్థ్యం తగ్గడం, ఉత్పాదకత దెబ్బతినడం లాంటి సమస్యలు కూడా తోడవుతాయి. కాబట్టి మలబద్ధకాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే....

- మొలలు వేధిస్తాయి
- మలద్వారం దగ్గర చీలికలు ఏర్పడతాయి
- పేగుల్లో కండరాలు బలహీనపడి, రంధ్రాలు ఏర్పడి ప్రాణాంతక పరిస్థితి తలెత్తవచ్చు
- మలబద్ధకంతో పేగుల కదలికలు మందగించి, ఆ పరిస్థితి భవిష్యత్తులో క్యాన్సర్‌కు దారితీయవచ్చు

పరిష్కారాలున్నాయి...

పీచు లేని ఆహారం తిన్నప్పుడు మలబద్ధకం తలెత్తవచ్చు. అయితే వెంటనే ఆహారంలో మార్పులు చేసుకుని విరోచన సమస్యను సరిదిద్దుకోవాలి. కానీ ఈ జాగ్రత్తలు పాటించినా రెండు వారాలకు మించి మలబద్ధకం వేధిస్తూ ఉంటే, వైద్యపరమైన కారణాలను విశ్లేషించుకోవాలి. వైద్యులను కలిసి హైపోథైరాయిడ్, మూత్రపిండాల సమస్యలు, క్యాల్షియం మోతాదులు తగ్గడం లాంటి మలబద్ధకం మూల కారణాలను పరీక్షించుకోవాలి. పరీక్షల ఫలితాలను బట్టి తగిన చికిత్సలతో ఆయా సమస్యలను సరిదిద్దుకుని, మలబద్ధకాన్ని తొలగించుకోవాలి.

నివారణ ఇలా...

- ఆహారంలో పీచు ఉండేలా చూసుకోవాలి
- రోజుకు 2నుంచి 3లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగాలి
- బీర, సొర, బెండ, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి
- ప్రతి రోజూ తప్పనిసరిగా పండ్లు తినాలి
- క్రమం తప్పక వ్యాయామం చేయాలి
- ఆహారంలో మైదా తగ్గించాలి
- పరిమితంగా కాఫీ తీసుకోవాలి
- రెడ్ మీట్ పరిమితం చేయాలి

డాక్టర్ నవీన్ పోలవరపు
సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
లివర్ స్పెషలిస్ట్,
అడ్వాన్స్‌డ్ థెరప్యూటిక్ ఎండోస్కోపిస్ట్ అండ్ ఎండోసోనాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్.



అప్రమత్తం

గాలి కాలుష్యంతో గర్భిణులకు చేటు

వెడల్పు పరంగా, మానవ రోమం కంటే 30 రెట్లు సూక్ష్మంగా ఉండే గాలి కలుషితాలకూ, నెలలు నిండకుండా పుట్టే పిల్లలకూ సంబంధం ఉందని పరిశోధకులు ఎంతో కాలంగా హెచ్చరిస్తున్నారు. అయితే తాజాగా అందుకు కారణాలను కనిపెట్టడం జరిగింది. ప్రత్యేకించి ట్రాఫిక్, పరిశ్రమలు, శిలాజ ఇంధనాలను మండించడం, దావానలాల పొగలు, గర్భిణుల రక్తంలోని కణాలను దెబ్బ తీస్తాయనీ, తద్వారా నెలలు నిండకుండా ప్రసవమైపోయే ప్రమాదం ఉంటుందనీ పరిశోధకులు అంటున్నారు. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రచురితమైన ఈ అధ్యయనంలో, గర్భిణి శరీరం మీద కలుషితాలు ఏ విధమైన ప్రభావం చూపిస్తాయనే దానికి సంబంధించి స్పష్టమైన వివరణ ఉంది. ప్రపంచవ్యాప్తంగా 37 వారల కంటే ముందే పుట్టే నెలలు నిండని 10% పసికందుల పుట్టుక వెనక 2.5 మైక్రోమీటర్ల అణువులు ఉంటున్నట్టు పరిశోధకులు పేర్కొంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఐదేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లల మరణాల్లో 17% నెలలు నిండకుండా పుట్టిన పిల్లలే ఉంటున్నట్టు కూడా వారు పేర్కొంటున్నారు. ఒకవేళ నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు ప్రాణాలను కాపాడుకోగలిగినా, ఇలాంటి ముందస్తు జననాల కారణంగా పిల్లల్లో సెరెబ్రల్ పాల్సీ, శ్వాసకోశ సమస్యలు లాంటి ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటాయని పరిశోధకులు అంటున్నారు.



పురోగతి

శరీరంలో కరిగిపోయే 'పేస్ మేకర్'

బియ్యపు గింజ పరిమాణంలో రూపొందించిన పేస్ మేకర్, శస్త్రచికిత్స తదనంతర గుండెకు రక్షణనివ్వబోతోంది. నార్త్‌వెస్టర్న్ యూనివర్శిటీకి చెందిన శాస్త్రవేత్తలు సూక్ష్మంగా ఉండే, శరీరంలో పూర్తిగా కరిగిపోయే వీలుండే పేస్‌మేకర్‌ను రూపొందించారు. ఎలాంటి తీగలు, బ్యాటరీలు లేదా సర్జరీ అవసరం లేని ఈ పేస్ మేకర్, సహజసిద్ధంగానే శరీరంలో కలిసిపోతుంది. 1.8 మిల్లీమీటర్ల వెడల్పు, 3.5 మిల్లీమీటర్ల పొడవు ఉండే ఈ పరికరాన్ని నేరుగా గుండెలోకి ఇంజెక్ట్ చేయవచ్చు. ఆ తర్వాత గాల్వానిక్ సెల్ మెకానిజం ద్వారా శరీర ద్రవాలనే ఇంధనంగా మలుచుకుని ఈ పరికరం పని చేయడం మొదలుపెడుతుంది. తీగల్లో ప్రవహించే విద్యుత్తుకు బదులుగా, చర్మం మీద అంటించుకున్న ప్యాచ్ ద్వారా ఈ పేస్ మేకర్ పని చేస్తుంది.

ఈ సూక్ష్మ పరికరం, గుండె అస్తవ్యస్థ లయలను పసిగట్టి, అతినీలలోహిత వెలుగుల ఆధారంగా గుండెను పని చేయిస్తూ ఉంటుంది. ఇలా గుండె దగ్గరకు ప్రవేశపెట్టిన ఈ పేస్ మేకర్ ఐదు నుంచి పది వారాల వ్యవధిలో తన విధిని పూర్తి చేసుకుని, సురక్షితంగా శరీరంలో కలిసిపోతుంది. పుట్టుకతోనే గుండె జబ్బులను వెంటబెట్టుకొచ్చిన పసికందులు, తాత్కాలిక పేసింగ్ అవసరమైన గుండె సర్జరీ రోగులకు ఈ సూక్ష్మ పేస్ మేకర్ ఒక ఆశా దీపం కాబోతోంది.



అధ్యయనం

ఊబకాయం చికిత్సతో క్యాన్సర్లు దూరం

ఊబకాయం చికిత్సతో పలు రకాల క్యాన్సర్ల ప్రమాదం దాదాపు సగం తగ్గుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఆ వివరాలు...

ఊబకాయం చికిత్సతో ఊబకాయ సంబంధిత క్యాన్సర్ల ప్రమాదం దాదాపు 50 శాతం తగ్గుతుందని ఇజ్రాయెల్ పరిశోధకులు కనుగొన్నారు. ఈ పరిశోధనలో భాగంగా సుమారు 6 వేల మందిని పరిశీలించారు. ఊబకాయం చిక్సితకు వాడే ఇంజక్షన్లు, బేరియాట్రిక్ శస్త్రచికిత్స వలన, 13 రకాల ఊబకాయ సంబంధిత క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని కనుగొన్నారు.

ది లాన్సెట్ క్లినికల్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం వివరాలను స్పెయిన్‌లో జరిగిన యూరోపిన్ కాంగ్రెస్ ఆన్ ఒబిసిటీ సమావేశంలో పరిశోధకులు వెల్లడించారు. సాధారణంగా బరువు తగ్గడం వలన ఆ క్యాన్సర్ల ప్రమాదం కొంతమేర తగ్గుతుంది. అయితే చికిత్సకు వాడే ఇంజెక్షన్ల వలన ఆ ప్రమాదం మరింత తగ్గుతుందని పరిశోధకులు తాజా అధ్యయనంలో గుర్తించారు. ఊబకాయానికి మందులు, ఇంజెక్షన్‌లు వాడే వారికంటే బేరియాట్రిక్ సర్జరీ చేయించుకునే వారు రెండింతల బరువు తగ్గుతారు. బేరియాట్రిక్ సర్జరీ వలన 30 నుంచి 42 శాతం వరకు ఈ క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని పరిశోధకులు గుర్తించారు. అలాగే బరువును తగ్గించే మందులు, ఇంజక్షన్లు ఈ క్యాన్సర్ల ప్రమాదాన్ని దాదాపు 50 శాతం తగ్గించగలవని కనుగొన్నారు. అయితే ఈ మందులు ఊబకాయం సంబంధం లేని క్యాన్సర్ల ప్రమాదాన్ని పెంచబోవని నిర్ధారించుకోవడం కోసం మరిన్ని పరిశోధనలు అవసరమని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.



మీకు తెలుసా?

ఈ భంగిమతో గాఢ నిద్ర

కొంత మంది ఒక కాలిని లేదా రెండు కాళ్లను దుప్పటి బయట పెట్టి నిద్రపోతుంటారు. ఇలా చేయడం వలన ఏం జరుగుతుందో తెలుసుకుందాం..



నిద్రించే సమయంలో మనకు తెలియకుండానే, ఒక కాలిని దుప్పట్లో నుంచి బయట పెట్టి పడుకుంటూ ఉంటాం. అయితే ఇలా ఒక కాలును దుప్పటి బయట పెట్టి నిద్రపోయే అలవాటు వెనక ఒక ఆరోగ్యకరమైన కారణం ఉందని జోర్నల్ ఆఫ్ ఫిజియలాజికల్ యాంత్రొపాలజీలో ప్రచురించిన 2023 నాటి అధ్యయనంలో పేర్కొన్నారు. ఇంతకూ ఇలాంటి అలవాటు వల్ల మన శరీరంలో ఏం జరుగుతుంది? శరీర వేడిని వేగంగా వదిలించుకోడానికి వీలుగా మన అరికాళ్లలో ప్రత్యేకమైన రక్తనాళాలుంటాయి. కాబట్టి రాత్రి వేళ కాళ్లను దుప్పటి వెలుపల ఉంచడం వల్ల, పాదాలకు చల్లటి గాలి సోకి, శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది.. దాంతో గాఢనిద్రకు అవసరమయ్యే మెలటోనిన్ హార్మోన్ స్రావం పెరుగుతుంది. ఇలా శరీరం చల్లబడే ప్రభావం, నిద్రలోకి జారుకునే సమయాన్ని వేగవంతం చేస్తుందనీ, గాఢనిద్రలోకి జారుకునేలా చేసి, నిద్ర నాణ్యతను పెంచుతుందనీ పరిశోధకులు అంటున్నారు.

పరిశోధన

5 నిమిషాల్లో క్యాన్సర్ ఇంజెక్షన్!

క్యాన్సర్ చికిత్సకు వాడే నివోలుమాబ్ ఔషధాన్ని 5 నిమిషాల్లో ఇంజెక్షన్ రూపంలో ఇచ్చే ఆవిష్కరణను ఇంగ్లాండ్ పరిశోధకులు కనుగొన్నారు.

నివోలుమాబ్ ఔషధాన్ని ఐవీ డ్రిప్ ద్వారా ఇవ్వడానికి గంట సమయం పడుతుంది. అయితే దానిని ఇంజక్షన్ రూపంలో 5 నిమిషాల్లో ఇవ్వొచ్చని ఇంగ్లాండ్ నేషనల్ హెల్త్ సర్వీస్ పరిశోధకులు కనుగొన్నారు. దీనివల్ల సమయం ఆదా అవడంతో పాటు ప్రతికూల ప్రభావాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, చర్మం, మూత్రాశయం వంటి 15 రకాల క్యాన్సర్ల నివారణకు ఈ ఇంజెక్షన్ ఉపయోగపడుతుంది. క్యాన్సర్ కణాలను గుర్తించి, వాటిని ధ్వంసం చేసే విధంగా రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించేలా నివోలుమాబ్ పని చేస్తుంది. ఇలా ఇంజెక్షన్ రూపంలో ఔషధాన్ని అందించడం ద్వారా, రోగికి సౌకర్యవంతమైన, సమర్థమైన చికిత్సను అందించే వీలు కలుగుతోంది. నివోలుమాబ్ ఇంజెక్షన్ షాట్ వినియోగానికి యూకే ఔషధ నియంత్రణ సంస్థ నుంచి అనుమతులు కూడా అందాయి.



అవగాహన



ఇటీవల ముంబయిలో 29 ఏళ్ల యువతి గుండెపోటుకు గురైంది. తక్షణం స్పందించిన వైద్యులు స్టెంట్‌తో ఆమె ప్రాణాలను కాపాడగలిగారు. కానీ సాధారణంగా పిల్లలను కనే వయసు యువతులకు ఈస్ట్రోజన్ హార్మోన్ వల్ల గుండెకు రక్షణ దక్కుతూ ఉంటుంది. కానీ ఈ యువతి విషయంలో ఆ రక్షణ లోపించడానికి వైద్యులు ఆసక్తికరమైన కారణాలను వివరించారు.

యువతుల్లో గుండెపోట్లు ఎందుకు?

ఈస్ట్రోజన్ హార్మోన్ రక్తనాళాలను విప్పార్చి, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. కాబట్టే ఈ హార్మోన్ స్రావాలు సక్రమంగా స్రవించే యువతుల్లో గుండె సమస్యలు తక్కువ. కానీ నేడు యువతుల్లో పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ సమస్య సర్వసాధారణమైపోతోంది. ఈ హార్మోన్ అసమతౌల్యం వల్ల నెలసరి క్రమం తప్పడంతో పాటు ఒవేరియన్ సిస్టులు కూడా ఏర్పడతాయి. ఈ సమస్యను సరిదిద్దడం కోసం ఈస్ట్రోజన్ ప్రొజెస్టిన్ హార్మోన్లు కలిగి ఉండే గర్భనిరోధక మాత్రలను వైద్యులు సూచిస్తూ ఉంటారు. ఈ మాత్రలు ఇష్కిమిక్ స్ట్రోక్, గుండె పోటుకు దారితీస్తూ ఉంటాయి.

ఆ మాత్రల వల్లే...

ఏడాది పాటు ఈ మాత్రలను వాడుకునే ప్రతి 4,760 మంది మహిళలకు ఒక అదనపు స్ట్రోక్ ముప్పు ఉంటుందనీ, ప్రతి పది వేల మంది మహిళలకూ ఒక అదనపు గుండె పోటు ముప్పు ఉంటుందనీ అధ్యయనాలు అంచనా వేస్తున్నాయి. ఈస్ట్రోజన్‌ను కలిగి ఉండే వెజైనల్ రింగ్స్, చర్మపు ప్యాచ్‌లతో ఈ ముప్పు మరింత ఎక్కువ. ఈ పరిస్థితి గురించి వివరిస్తూ.. "గర్భనిరోధక మాత్రలతో సంబంధం ఉన్న గుండెపోట్ల కంటే స్ట్రోక్స్ అత్యంత సాధారణమైపోయాయి. పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్‌తో బాధపడే 22 నుంచి 28 ఏళ్ల యువతులు స్ట్రోక్ గురవడాన్ని నేను చూశాను. అయితే అండాల విడుదలను నిలువరించడం ద్వారా అండాశయాల్లో సిస్టులు ఏర్పడే అవకాశాలను తగ్గించడం కోసం మహిళలు గర్భనిరోధక మాత్రలను వాడుకోవలసిన అవసరం ఉంటుంది" అంటూ గైనకాలజిస్ట్, డాక్టర్ కిరణ్ కోల్హో వివరిస్తున్నారు. "ఊబకాయం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ సమస్యలు కూడా పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్‌తో ముడిపడి ఉంటాయి. ఫలితంగా రక్తంలో కొవ్వు మోతాదులు ఎక్కువగా ఉండి, గుండె జబ్బు ముప్పును పెంచే పిస్లిపిడీమియా సమస్య కూడా వీళ్లలో ఎక్కువగా ఉంటుంది. మరీ ముఖ్యంగా నగరాల్లోని మహిళల్లో అత్యధిక ఒత్తిడి మోతాదులు, బాల ఊబకాయ సమస్యలు కూడా అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ కారకాలు, పట్టణ భారతదేశంలోని ప్రతి ఐదుగురు కౌమార బాలికల్లో ఒకరికి, పిసిఒ అవకాశాలను మరింత పెంచుతున్నాయి" అని కూడా అంటున్నారామె.

> ఊబకాయం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ సమస్యలు కూడా పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్‌తో ముడిపడి ఉంటాయి. ఫలితంగా రక్తంలో కొవ్వు మోతాదులు ఎక్కువగా ఉండి, గుండె జబ్బు ముప్పును పెంచే పిస్లిపిడీమియా సమస్య కూడా వీళ్లలో ఎక్కువగా ఉంటుంది. మరీ ముఖ్యంగా నగరాల్లోని మహిళల్లో అత్యధిక ఒత్తిడి మోతాదులు, బాల ఊబకాయ సమస్యలు కూడా అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ కారకాలు, పట్టణ భారతదేశంలోని ప్రతి ఐదుగురు కౌమార బాలికల్లో ఒకరికి, పిసిఒ అవకాశాలను మరింత పెంచుతున్నాయి

కుటుంబ చరిత్ర తెలుసుకుని...

నానావతి హాస్పిటల్ హృద్రోగ వైద్యులు డాక్టర్ రాజీవ్ భగవత్... "యువతుల్లో గుండెపోట్లు, స్ట్రోక్స్ ముప్పు తగ్గాలంటే, గర్భనిరోధక మాత్రలను సూచించే సందర్భంలో వైద్యులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఈ మాత్రలు రక్తపు గడ్డలను పెంచే అవకాశాలున్నాయి కాబట్టి, వాటిని సూచించే ముందు మహిళ కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర గురించి క్షుణ్ణంగా తెలుసుకుని, ఆ తర్వాతే ఆ మాత్రలను సూచించాలి" అని అంటున్నారు.


త్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్

నితిన్ కథానాయకుడిగా శ్రీరామ్ వేణు తెరకెక్కిస్తున్న చిత్రం 'తమ్ముడు'. 'కాంతార' ఫేమ్ సప్తమి గౌడ, వర్ష బొల్లమ్మ, లయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను బుధవారం విడుదల చేస్తున్నట్లు



ప్రకటించారు మేకర్స్. ఈ మేరకు ఓ ఆసక్తికరమైన వీడియోను సోషల్‌మీడియా ద్వారా పంచుకున్నారు. ఇది ప్రస్తుతం అందర్నీ ఆకర్షిస్తోంది. జూలై 4న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి ఎడిటర్:ప్రవీణ్ పూడి, సినిమాటోగ్రఫీ:కేవీ గుహన్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

ద్విభాషా చిత్రంలో సునీల్



రాజ్‌తరుణ్ హీరోగా తమిళ దర్శకుడు, 'గోలి సోడా' ఫేమ్ విజయ్ మిల్టన్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. తమిళ, తెలుగు భాషల్లో రూపొందనున్న ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో సునీల్ నటించనున్నారని మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ మిల్టన్ మాట్లాడుతూ "సినిమాలో సునీల్ చేయనున్న పాత్ర చాలా విభిన్నంగా ఉండబోతోంది. ప్రేక్షకుల హృదయాల్ని హత్తుకునే పాత్ర ఇది" అని తెలిపారు. చిత్ర టైటిల్‌ను ఈ నెల 15న ప్రకటించనున్నారు.

అమ్మవారి కథ



నూతన నటీనటులను పరిచయం చేస్తూ హెచ్‌బీజే క్రియేషన్స్, మదర్ అండ్ ఫాదర్ పిక్చర్స్ నిర్మిస్తున్న సినిమా 'చండీ దుర్గమా'. షైను ఖాన్ ఎండీ దర్శకత్వంలో జయశ్రీ వెల్డి నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. హాస్య నటుడు అలీ ముఖ్య అతిథిగా విచ్చేసి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. నటుడు చిట్టి కెమెరా స్విచ్ఛాన్ చేయగా, ముహూర్తపు సన్నివేశానికి రఘు కారుమంచి దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ 'అమ్మవారి కథతో వస్తున్న ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎంకే, సినిమాటోగ్రఫీ: వై.ఎస్.కృష్ణ



మరింత శక్తిమంతమైన పాత్రలో బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'అఖండ 2' టీజర్ వచ్చేసింది. ఆయన పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణ పాత్ర మొదటి భాగంలో కంటే మరింత శక్తిమంతంగా కనిపిస్తోంది. 'నా శివుడి అనుమతి లేనిదే యముడైనా కన్నెత్తి చూడడు. నువ్వు చూస్తావా..' అంటూ ఆయన చెప్పిన పవర్‌ఫుల్ డైలాగులు, అద్భుతమైన విజువల్స్, అదిరిపోయే పోరాట సన్నివేశాలు, థమన్ అందించిన నేపథ్య సంగీతం సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. బోయపాటి శ్రీను దర్శకుడు. బాలకృష్ణ కూతురు తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. ఎడిటర్: తిమ్మరాజు, డీఓపీ: సి.రామ్‌ప్రసాద్, సంతోష్ డీ.డెటాకే. కాగా, బాలకృష్ణ, బోయపాటి కాంబోలో ఇదివరకు వచ్చిన 'సింహా', 'లెజెండ్', 'అఖండ' సినిమాలు బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్న విషయం తెలిసిందే.

చిత్రజ్యోతి

SINCE 1965

తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ జ్ఞాపిక



తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతిభ కలిగిన కళాకారులను, ఉత్తమాభిరుచితో నిర్మించిన చిత్రాలను ప్రోత్సహించడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌ను ప్రకటించిన సంగతి విదితమే. ఈ నెల 14న ఎంతో వైభవంగా జరిగే కార్యక్రమంలో విజేతలకు అవార్డులను అందజేస్తారు. ఈ సందర్భంగా విజేతలకు అందించే అవార్డుల జ్ఞాపికను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. ఫిల్మ్ రీల్‌ను చేతికి చుట్టుకున్నట్లుగా.. పైకెత్తిన చేతిలో కంజెర నమూనాతో గద్దర్ అవార్డ్‌ను తీర్చిదిద్దారు. కంజెరపై తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని ముద్రించి చుట్టూ టీజీఎఫ్‌ఏ అక్షరాలను ఉంచారు.

'టెస్టు' వేదికలు మారాయ్!

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు స్వదేశంలో వెస్టిండీస్, దక్షిణాఫ్రికాలతో అక్టోబరు నుంచి టెస్టు, పరిమిత ఓవర్ల సిరీస్‌లను ఆడనుంది. దీనిలో భాగంగా ఇదివరకు ప్రకటించిన వేదికల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. అక్టోబరు 2 నుంచి వెస్టిండీస్‌తో తొలి టెస్టు అహ్మదాబాద్‌లోనే జరుగనుండగా.. చివరిదైన రెండో టెస్టు వేదికను మాత్రం కోల్‌కతా నుంచి న్యూఢిల్లీకి మార్చారు. అలాగే నవంబరు 14 నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే తొలి టెస్టును ఢిల్లీ నుంచి కోల్‌కతాకు తరలించారు. ఇక సెప్టెంబరు 14 నుంచి జరిగే భారత్-ఆస్ట్రేలియా మహిళల వన్డే సిరీస్‌లోని మూడో మ్యాచ్‌ను చెన్నై నుంచి ఢిల్లీకి తరలించారు.

రాణించిన తనుష్

ఇంగ్లండ్ 'ఎ'తో మ్యాచ్ డ్రా


తనుష్ (90 నాటౌట్)

నార్తాంప్టన్: తనుష్ కోటియన్ (90 నాటౌట్), అన్షుల్ కంబోజ్ (51 నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించడంతో ఇంగ్లండ్ 'ఎ'తో జరిగిన రెండో అనధికార టెస్టు డ్రాగా ముగిసింది. సోమవారం చివరి రోజు భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌ను 92 ఓవర్లలో 417/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. నితీశ్ (42), శార్దూల్ (34) సహకరించారు. జార్జి హిల్‌కు మూడు.. వోక్స్, జాక్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఇక చివరి సెషన్‌లో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో 11 ఓవర్లలో 32/3 స్కోరు సాధించింది. అన్షుల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఫలితం తేలే అవకాశం లేకపోయేసరికి ముందుగానే ఇరు జట్లు డ్రాకు అంగీకరించాయి. భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 348, ఇంగ్లండ్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 327 పరుగులు చేశాయి.

నయా నడాల్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)




టెన్నిస్ దిగ్గజాలు అనగానే ప్రస్తుత తరానికి గుర్తొచ్చే పేర్లు రోజర్ ఫెడరర్, రఫెల్ నడాల్, నొవాక్ జొకోవిచ్. ఈ ముగ్గురు కలిసే దాదాపు అరవైకిపైగా గ్రాండ్‌స్లామ్స్‌ను కొల్లగొట్టారు. ఏ మేజర్ టోర్నీ ని చూసినా ఈ ముగ్గురిలో ఇద్దరు కచ్చితంగా ఫైనల్లో ప్రత్యర్థులుగా ఉండేవారు. అంతలా.. వీళ్లు రెండు దశాబ్దాల పాటు ప్రపంచ టెన్నిస్‌ను శాసించారు. ఈ త్రయంలో ఇప్పటికే ఫెడరర్, నడాల్ ఆటకు వీడ్కోలు పలికారు. జొకో ఇంకా ఆటలో కొనసాగుతున్నా, మునుపటి స్థాయిలో ఆకట్టుకోలేకపోతున్నాడు. రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ కోసం రెండేళ్లుగా దండయాత్ర చేస్తున్నా, సఫలం కాలేకపోతున్నాడు. చివరిసారిగా 2023లో యూఎస్ ఓపెన్ నెగ్గాడు. మరి.. ఆ బిగ్ త్రీ తర్వాత ఎవరు అంటే.. వినిపిస్తున్న ఒకే ఒక్క పేరు కార్లోస్ అల్కారజ్. అసాధారణ ఆటతీరుతో, అలుపెరగనిపోరాట పటిమతో రయ్‌మంటూ దూసుకొచ్చాడీ స్పెయిన్ సంచలనం. తాజాగా వరుసగా రెండో ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ సాధించి మట్టికోర్టులో రఫెల్ నడాల్‌కు వారసుడిగా కితాబు అందుకుంటున్నాడు. 2021 నుంచే గ్రాండ్‌స్లామ్ ఆడడం మొదలుపెట్టిన ఈ 22 ఏళ్ల కుర్రాడు.. అప్పుడే ఐదు మేజర్ టైటిళ్లు నెగ్గి నవతరం ఆటగాళ్లలో మేటిగా నిరూపించుకున్నాడు.

సంచలనాలతో మొదలై..

తన దేశానికే చెందిన 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల వీరుడు నడాల్ అంటే కార్లోస్‌కు ఎంతో అభిమానం. అతడిలా కెరీర్‌లో అత్యున్నత శిఖరాలను అందుకోవాలని నాలుగేళ్ల వయసులోనే రాకెట్ పట్టిన అల్కారజ్.. ఇప్పుడు నడాల్ రికార్డులనే బద్దలు కొడుతున్నాడు. ఎర్రమట్టి కోర్టు రారాజుగా ఉన్న నడాల్‌పై 2022 మాడ్రిడ్ ఓపెన్ క్వార్టర్స్‌లో నెగ్గి.. క్లేకోర్టులో నడాల్‌ను ఓడించిన టీనేజర్‌గా (19 ఏళ్లు) రికార్డు సృష్టించాడు. ఇదే టోర్నీ సెమీస్‌లో నాటి వరల్డ్ నెం.1 జొకోవిచ్‌ను, ఫైనల్లో నెం.3 జ్వెరెవ్‌ను ఓడించి ఏకంగా మాడ్రిడ్ కిరీటాన్ని అందుకున్నాడు. అదే ఏడాది యూఎస్ ఓపెన్‌లో విజేతగా నిలిచి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌తో పాటు వరల్డ్ నెం.1 ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. 19 ఏళ్లకే ఏటీపీ ర్యాంకింగ్స్‌లో నెంబర్‌వన్‌గా నిలిచిన ఆటగాడిగా చరిత్రకెక్కాడు. ఇలా, అల్కారజ్ టీనేజర్‌గా ఉన్నప్పుడే ప్రపంచ టెన్నిస్‌లో ప్రకంపనలు సృష్టించాడు. అంతేకాదు.. వింబుల్డన్‌లో 2018 నుంచి చాంపియన్‌గా ఉన్న జొకోవిచ్‌ను 2023 ఫైనల్లో చిత్తు చేశాడు. వరుసగా ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గి జోరుమీదున్న జొకోవిచ్‌కు ఆ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఓటమి రుచి చూపించాడు. ఆ మరుసటి ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో జ్వెరెవ్‌ను చిత్తు చేసి మొదటిసారి ఎర్రమట్టి కోర్టులో పాగా వేశాడు. ఆ వెంటనే వింబుల్డన్‌లో వరుసగా రెండో ఏడాదీ విజేతగా నిలిచి జొకోవిచ్‌కు కొరకరాని కొయ్యలా మారాడు. ఆ తర్వాత కొన్నిరోజులు గాయం బారిన పడ్డా వెంటనే కోలుకున్న అల్కారజ్.. ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్‌తో మళ్లీ గాడిన పడ్డాడు. తన లోని అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శిస్తూ.. ఫైనల్లో జానిక్ సినర్‌తో సుదీర్ఘంగా దాదాపు ఐదున్నర గంటల పాటు పోరాడి పైచేయి సాధించాడు. వరుసగా రెండో ఏడాది ఫ్రెంచ్ కిరీటాన్ని ముద్దాడి క్లేకోర్టు కింగ్ నడాల్‌ను మరిపించాడు.

అచ్చం అతనిలా...

గతవారం ఫ్రెంచ్ ఓపెన్‌తో అల్కారజ్ కెరీర్‌లో ఐదో గ్రాండ్‌స్లామ్‌ను అందుకున్నాడు. ప్రస్తుతం అతడి వయసు 22 ఏళ్ల 33 రోజులు. సరిగ్గా.. ఇదే వయసులో నడాల్ 2008 వింబుల్డన్ ఫైనల్లో ఫెడరర్‌ను ఓడించి కెరీర్‌లో ఐదో గ్రాండ్‌స్లామ్‌ను సాధించాడు. ఇది యాదృచ్ఛికమే అయినా.. ఆరాధ్య ఆటగాడి రికార్డును సమం చేయడం తన అదృష్టంగా భావిస్తానని అల్కారజ్ ఆనందం వ్యక్తం చేశాడు.



'హాల్ ఆఫ్ ఫేమ్'లో ధోనీ

మహీకి అరుదైన గౌరవం



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీకి అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'హాల్ ఆఫ్ ఫేమ్'లో మహీకి చోటు లభించింది. ఈమేరకు ఐసీసీ సోమవారం ప్రకటించింది. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా మన్ననలు అందుకున్న ధోనీ ఆధ్వర్యంలో భారత్ రెండు ఐసీసీ వరల్డ్ కప్‌లు (2007 టీ20, 2011 వన్డే) అందుకుంది. అలాగే అతడి సారథ్యంలో 2013 చాంపియన్స్ ట్రోఫీ కూడా టీమిండియా సాధించింది. ధోనీ నాయకత్వంలోనే భారత జట్టు 2009లో టెస్టుల్లో నెంబర్ వన్ స్థానాన్ని చేజిక్కించుకుంది. 'ప్రపంచ వ్యాప్తంగా అన్ని తరాల క్రికెటర్ల సేవలను గుర్తించే ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. ఎందరో గొప్ప క్రికెటర్ల మధ్య నా పేరు ఉండబోతోందన్న భావనే అద్భుతంగా ఉంది. ఈ సందర్భాన్ని ఎప్పటికీ మరువలేను' అని ధోనీ పేర్కొన్నట్టు ఐసీసీ తెలిపింది. 'అన్ని ఫార్మాట్లలో కలిపి 538 మ్యాచ్‌లు, 17,266 అంతర్జాతీయ పరుగులు, కీపర్‌గా 829 మందిని అవుట్ చేయడం ధోనీ అసాధారణ ప్రతిభకు, ఫిట్‌నెస్‌కు నిదర్శనం' అని ఐసీసీ కొనియాడింది. ధోనీతో పాటు మాథ్యూ హేడెన్ (ఆస్ట్రేలియా), హషీమ్ ఆమ్లా, గ్రేమ్ స్మిత్ (దక్షిణాఫ్రికా), డానియెల్ వెటోరి (న్యూజిలాండ్), సనా మిర్ (పాకిస్థాన్), సారా టేలర్ (ఇంగ్లండ్)లకు కూడా హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. ఇక..హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్న 11వ భారత క్రికెటర్ ధోనీ. ఇంతకుముందు గవాస్కర్, సచిన్, సెహ్వాగ్, డయానా ఎడుల్జీ, అనిల్ కుంబ్లే, బిషన్ సింగ్ బేడీ, కపిల్ దేవ్, రాహుల్ ద్రవిడ్, వినూ మన్కడ్, నీతూ డేవిడ్ ఈ జాబితాలో ఉన్నారు.

బోయిసన్.. 296 ర్యాంక్‌లు జంప్!

65కు చేరిక



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీస్ చేరి సంచలనం సృష్టించిన యువ క్రీడాకారిణి లూయిస్ బోయిసన్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 296 స్థానాలు ఎగబాకింది. రొలాండ్ గారోస్ నాలుగో రౌండ్‌లో మూడో సీడ్ పెగులాకు షాకిచ్చిన 22 ఏళ్ల ఫ్రాన్స్ క్రీడాకారిణి బోయిసన్ ఈ టోర్నీకి ముందు 361వ ర్యాంక్‌లో ఉంది. కానీ ఫ్రెంచ్ ఓపెన్ ప్రదర్శన దరిమిలా ఆమె ఏకంగా 65వ స్థానానికి చేరింది. టాప్ ర్యాంక్‌ల్లో మార్పులు లేవు. సబలెంకా, గాఫ్, పెగులా తొలి మూడు స్థానాలలోనే నిలిచారు. పురుషుల సింగిల్స్‌లో ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఓడినా..సినర్ టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్ విజేత అల్కారజ్ 2వ, జ్వెరెవ్ 3వ స్థానంలోనే కొనసాగుతున్నారు.

అప్పుడే గుడ్‌బై చెబుతాడనుకుంది!

రోహిత్ వన్డే భవితవ్యంపై బీసీసీఐ




న్యూఢిల్లీ: రోహిత్ శర్మ..తెల్లబంతుల ఫార్మాట్‌లో అన్ని తరాలకు నిస్సందేహంగా గొప్ప క్రికెటర్. 38 ఏళ్ల రోహిత్ టీ20లలో అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్. అలాగే వన్డేలలో 11వేలకు పైగా పరుగులు సాధించిన ఆటగాడు. నిరుడు జూన్‌లో టీమిండియా వరల్డ్ కప్ నెగ్గాక పొట్టి ఫార్మాట్‌కు హిట్‌మ్యాన్ రిటైర్మెంట్ ప్రకటించాడు. తాజాగా టెస్టులకూ వీడ్కోలు పలికాడు. ప్రస్తుతం కేవలం 50 ఓవర్ల ఫార్మాట్‌కే పరిమితమైన రోహిత్ 2027 వన్డే ప్రపంచ కప్ ఆడాలన్న పట్టుదలతో ఉన్నాడు. కానీ గత మార్చిలో ముగిసిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ తర్వాత హిట్‌మ్యాన్ వన్డేలకు గుడ్‌బై చెబుతాడని బీసీసీఐ భావించిందట! 'నిజం చెప్పాలంటే.. చాంపియన్స్ ట్రోఫీ అందుకున్నాక రోహిత్ వన్డేలకూ రిటైర్మెంట్ ప్రకటిస్తాడని అంచనా వేశాం. అయితే రోహిత్ వన్డే భవితవ్యంపై అతడికి, సెలెక్టర్లకు నడుమ ఎలాంటి చర్చా జరగలేదు' అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. భారత జట్టు తదుపరి వన్డే సిరీస్‌ను ఆగస్టులో బంగ్లాదేశ్‌తో ఆడాల్సి ఉంది. అయితే ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో పరిస్థితుల రీత్యా చూస్తే ఆ సిరీస్ జరిగేది అనుమానమే. అది రద్దయితే అక్టోబరులో మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టు ఆస్ట్రేలియా వెళ్లాల్సి ఉంది. కాగా..సౌతాఫ్రికా ఆతిథ్యమిచ్చే తదుపరి వన్డే వరల్డ్ కప్‌నకు రెండేళ్లకు పైగా వ్యవధి ఉంది. ఆ మెగా టోర్నీ సమయానికి రోహిత్ 40వ ఏట ప్రవేశిస్తాడు. అయితే రాబోయే వన్డే వరల్డ్ కప్ వరకూ అతడు ఇదే స్థాయిలో దూకుడుగా ఆడగలడా..అన్నది ప్రశ్న. ఈ క్రమంలో రోహిత్ కెప్టెన్సీ నిలబెట్టుకుంటాడా అనేది కూడా చూడాలి. సారథ్య బాధ్యతలు లేకపోవడం రోహిత్‌కు ప్రతికూలమే కాగలదు. ఇప్పటికే భిన్న ఫార్మాట్లకు భిన్న సారథుల దిశగా భారత క్రికెట్ అడుగులు వేస్తోంది. టీ20లకు సూర్యకుమార్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇక టెస్ట్ జట్టు గిల్ సారథ్యం వహిస్తున్నాడు. ఈక్రమంలో వన్డేలకూ కొత్త నాయకుడిని ఎంపిక చేసే అవకాశాలు ఎంతో దూరంలో లేకపోలేదు.

ఆసీస్ జట్టును ఆపేశారు

లార్డ్స్‌లో చేదు అనుభవం

లండన్: ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో ఈనెల 11 నుంచి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ జరుగనుంది. ఈ నేపథ్యంలో ప్రాక్టీస్ కోసం శనివారం ఈ స్టేడియానికి వచ్చిన ఆస్ట్రేలియా ఆటగాళ్లకు చేదు అనుభవం ఎదురైంది. అక్కడి సిబ్బంది వారిని లోనికి అనుమతించలేదు. ప్రస్తుతానికి ఈ స్టేడియం మీకు అందుబాటులో లేదని చెప్పి వారిని పంపించేసినట్టు బ్రిటిష్ మీడియా పేర్కొంది. అయితే అదే రోజు భారత టెస్టు జట్టుకు అనుమతి ఇవ్వడంతో వారు లార్డ్స్‌లో ప్రాక్టీస్ చేశారని అక్కడి మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. కానీ డబ్ల్యూటీసీ ఫైనల్ బుధవారం నుంచే ఉండగా.. ఇంగ్లండ్‌తో భారత్ సిరీస్‌కు మరో పది రోజుల సమయం ఉంది. అలాంటప్పుడు ఆసీస్‌కు కాకుండా గిల్ సేనకు ప్రాధాన్యత ఇవ్వడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అదీగాకుండా లార్డ్స్‌లో ఇంగ్లండ్-భారత్ మూడో టెస్టు జూలై 10న జరుగుతుందని గుర్తు చేశారు.

కెప్టెన్సీ అంటే ఇష్టం: శ్రేయాస్



న్యూఢిల్లీ: పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ తమ జట్టును ఐపీఎల్‌లో ఫైనల్‌కు చేర్చడంతో పాటు బ్యాటర్‌గానూ విశేషంగా రాణించాడు. దీంతో అతడిని భవిష్యత్ భారత వన్డే కెప్టెన్‌గానూ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అటు అయ్యర్ సైతం జట్టును ముందుండి నడిపించడాన్ని ఆస్వాదిస్తానని అంటున్నాడు. 'కెప్టెన్సీ అనేది మనలో పరిణతిని, బాధ్యతను తెలియజేస్తుంది. నేను 22 ఏళ్ల నుంచే వివిధ జట్లకు సారథ్యం వహిస్తున్నా. అందుకే సారథ్య బాధ్యతలు అందుకునేందుకు సరిపడా అనుభవం నాకుందనే భావిస్తా' అని 30 ఏళ్ల శ్రేయాస్ చెప్పుకొచ్చాడు.

మిడ్‌వెస్ట్ నుంచి రేర్ ఎర్త్ మాగ్నెట్స్

డిసెంబరుకల్లా ఉత్పత్తి ప్రారంభం

చైనా కుయుక్తులకు చెక్!

ఆటోమొబైల్స్, విండ్ టర్బైన్స్, సెమీకండక్టర్లలో విరివిగా ఉపయోగించే అరుదైన లోహాల మాగ్నెట్స్ ఉత్పత్తికి హైదరాబాద్‌కు చెందిన మిడ్‌వెస్ట్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ (ఎంఏఎం) సిద్ధమవుతోంది. హైదరాబాద్ సమీపంలో ఏటా 500 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ ప్లాంటులో డిసెంబరు నాటికల్లా ఉత్పత్తి ప్రారంభం కానుందని బిజినెస్ స్టాండర్డ్ కథనం వెల్లడించింది. అంతేకాకుండా వచ్చే మూడేళ్లలో రూ.1,000 కోట్లతో ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 5,000 టన్నులకు విస్తరించాలని కంపెనీ యోచిస్తోందని తెలిపింది. ఈ మాగ్నెట్ల ఉత్పత్తికి కీలక ముడి పదార్థమైన మొనాజైట్‌ను శ్రీలంకలోని ఎంఏఎం సొంత గనుల నుంచి దిగుమతి చేసుకుంటుంది. బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ ఉత్పత్తిలో పేరొందిన మిడ్‌వెస్ట్ లిమిటెడ్‌కు ఎంఏఎం అనుబంధ సంస్థ.

తీవ్ర కొరత: ఈ రేర్ ఎర్త్ మాగ్నెట్ల ఉత్పత్తిలో ప్రస్తుతం చైనాదే హవా. ప్రపంచ ఉత్పత్తిలో చైనా వాటా 80 శాతానికిపైగా ఉంది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి చైనా వీటి ఎగుమతులను నిషేధించింది. మన దేశానికి చేసే ఎగుమతులపైనా అనేక ఆంక్షలు విధించి వీటి సరఫరాను కట్టడి చేస్తోంది. ఈ దెబ్బకు అమెరికా, యూరప్‌లోని కొన్ని ఆటోమొబైల్ కంపెనీలు ఉత్పత్తి నిలిపి వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో మిడ్‌వెస్ట్ దేశీయంగా వీటి ఉత్పత్తికి సిద్ధమవుతోంది.

దేశీయ టెక్నాలజీ: ఈ మాగ్నెట్ల ఉత్పత్తికి అవసరమైన కీలక ఖనిజాల ప్రాసెసింగ్ ప్రక్రియ చాలా కష్టంతో కూడుకున్నది. ఇందుకు అవసరమైన టెక్నాలజీని కూడా మిడ్‌వెస్ట్.. హైదరాబాద్‌లోని నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎన్ఎంటీడీసీ) నుంచే సమకూర్చుకుంది. ఈ మాగ్నెట్ల సరఫరా కోసం కంపెనీ ఇప్పటికే దేశంలోని వివిధ ఆటోమొబైల్ కంపెనీలు, విండ్ టర్బైన్ కంపెనీలు, ఎంఆర్ఐ కంపెనీలతో చర్చలు జరుపుతోంది.

హైదరాబాద్‌లో హైలాండ్ నూతన కార్యాలయం

కంటెంట్ ఇన్నోవేషన్ క్లౌడ్ సేవలందించే హైలాండ్ కంపెనీ హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించింది. తమ ప్రపంచ విస్తరణ ప్రణాళికలో ఇది ఒక మైలురాయి అని కంపెనీ పేర్కొంది. హైదరాబాద్‌లో అమెరికన్ కాన్సుల్ జనరల్ జెనిఫర్ లార్సన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రాంతీయంగా అందుబాటులో ఉన్న అసాధారణ ప్రతిభావంతుల సేవలు ఉపయోగించుకునేందుకు ఇది చక్కని అవకాశమని కంపెనీ సీటీఓ టిమ్ మెక్లింటైర్ అన్నారు.

క్వాంటమ్ ఎనర్జీ తయారీ కేంద్రం విస్తరణ

హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న విద్యుత్ వాహనాల తయారీ సంస్థ క్వాంటమ్ ఎనర్జీ.. ఫ్యూచర్ సిటీ సమీపంలోని మహేశ్వరంలో ఉన్న తమ ఫ్యాక్టరీని విస్తరించింది. 2.4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తి సామర్థ్యం ఏటా రెండు లక్షల వాహనాలకు పెరుగుతుందని, దీనివల్ల స్థానికులకు ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరుగుతాయని కంపెనీ ఎండీ చక్రవర్తి చుక్కపల్లి అన్నారు. ప్రస్తుతం కంపెనీ ప్లాస్మా, మిలన్, బిజినెస్ మోడళ్లను విక్రయిస్తోంది.

స్టార్‌లింక్ కాస్ట్‌లీనే?

హార్డ్‌వేర్‌కు రూ.33,000 ● నెలవారీ చార్జీ రూ.3,000 ● 2 నెలల్లో సేవలు షురూ!



న్యూఢిల్లీ: దేశ బ్రాడ్‌బ్యాండ్ మార్కెట్లో మరో విప్లవాత్మక మార్పునకు రంగం సిద్ధమవుతోంది. ప్రపంచ అపర కుబేరుడు ఎలాన్ మస్క్ నాయకత్వంలోని స్టార్‌లింక్ సంస్థ త్వరలోనే మన దేశంలోనూ తన ఉపగ్రహ ఆధారిత (శాట్‌లైట్ బేస్డ్) బ్రాడ్‌బ్యాండ్ సేవలు ప్రారంభించనుంది. టెలికాం శాఖ (డాట్) నుంచి ఇప్పటికే ఇందుకు ప్రాథమిక అనుమతి (ఎల్ఓఐ) పొందింది. స్పెక్ట్రమ్ కేటాయింపులు లభించిన వెంటనే ఈ సేవలు ప్రారంభించనుంది. దరఖాస్తు చేసిన 15 నుంచి 20 రోజుల్లోనే స్టార్‌లింక్‌కు స్పెక్ట్రమ్ కేటాయింపులు చేయనున్నట్టు అధికారిక వర్గాలు వెల్లడించాయి. స్పెక్ట్రమ్ కేటాయింపులు లభించిన వెంటనే ఇతర అనుమతులు, మౌలిక సదుపాయాల ఏర్పాటు పూర్తి చేసుకుని రెండు నెలల్లో తన బ్రాడ్‌బ్యాండ్ సేవలు ప్రారంభించాలని స్టార్‌లింక్ యోచిస్తోంది. ప్రారంభంలో స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవల బ్యాండ్‌విడ్త్ సామర్థ్యం 600 నుంచి 700 గిగాబైట్స్ పర్ సెకండ్ (జీబీపీఎస్)గా ఉంటుందని అంచనా. దీంతో మన దేశ బ్రాడ్‌బ్యాండ్ మార్కెట్లో మరిన్ని విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయని భావిస్తున్నారు.

బంగ్లాదేశ్‌లోనూ ఇవే టారిఫ్‌లు

భారత్‌లో తాను ప్రారంభించే ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవల టారిఫ్‌లను స్టార్‌లింక్ ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. అయితే అందుతున్న సమాచారాన్ని బట్టి ఈ హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవల కోసం ఖాతాదారులు నెలకు కనీసం రూ.3,000 టారిఫ్‌గా చెల్లించాల్సి ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా. దీనికి తోడు హార్డ్‌వేర్ కోసం వన్‌టైమ్ చార్జీల కింద మరో రూ.33,000 (జీఎస్‌టీ అదనం) చెల్లించాల్సి ఉంటుంది. అంటే స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ తీసుకునే ఖాతాదారులు తొలి ఏడాదే కనీసం రూ.69,000 వరకు చెల్లించాలి. బంగ్లాదేశ్‌లోనూ స్టార్‌లింక్ తన బ్రాడ్‌బ్యాండ్ సేవల కోసం ఇవే చార్జీలు వసూలు చేస్తోంది.

టెల్కోల ఆందోళన

గత ఏడాది డిసెంబరు నాటికి మన దేశంలో వైర్‌లెస్, వైర్‌లైన్ పద్ధతిలో 94.49 కోట్ల మంది బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుకుంటున్నారు. ఇందులో మొబైల్ ఆధారిత వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ ఖాతాదారుల సంఖ్య 90.4 కోట్ల వరకు ఉంది. ఇప్పుడు స్టార్‌లింక్ ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవలు ఇందుకు తోడుకానున్నాయి. తన సేవలు ప్రారంభించిన తొలి ఏడాదే కనీసం కోటి మంది ఖాతాదారులను సంపాదించాలని స్టార్‌లింక్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. దీంతో ఈ మార్కెట్‌పై ఎక్కడ తమ గుత్తాధిపత్యానికి గండి పడుతుందోనని టెలికాం కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. తమలాగే ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవల కంపెనీలకూ వేలం ద్వారానే స్పెక్ట్రమ్ కేటాయించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. ప్రభుత్వం అందుకు తిరస్కరించడంతో కనీసం స్పెక్ట్రమ్ ధరైనా తమకు కేటాయించిన స్థాయిలో ఉండాలని కోరాయి. ట్రాయ్ దీనిపై సానుకూలంగా స్పందించడంతో కొద్దిగా ఊపిరి పీల్చుకున్నాయి. రేటింగ్ ఏజెన్సీలు మాత్రం స్టార్‌లింక్ వంటి సంస్థల బ్రాడ్‌బ్యాండ్ సేవలతో టెలికాం కంపెనీల సేవలకు పెద్ద పోటీ ఏమీ ఉండదని చెబుతున్నాయి. ఈ కంపెనీలు గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో టెలికాం కంపెనీలతో పోటీపడినా టారిఫ్‌లపరంగా పట్టణ ప్రాంతాల్లో పోటీపడడం కష్టమని తేల్చేస్తున్నాయి.


ప్రత్యేకత ఏమిటంటే..

ప్రస్తుతం మన దేశంలోని టెలికాం కంపెనీలు కేబుల్ లేదా మొబైల్ వైర్‌లెస్ ద్వారా తమ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందిస్తున్నాయి. సుదూర ప్రాంతాల్లోని గ్రామాలు, మారుమూల ప్రాంతాల్లోని ఖాతాదారులకు ఈ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించాలంటే, ఆ ప్రాంతాలకు కేబుల్ వేయడం, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు పెద్దమొత్తంలో ఖర్చు చేయాలి. ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవల ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. ఈ విధానంలో భూ దిగువ కక్ష్య (ఎల్ఈఓ) పరిభ్రమించే ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్‌ను నేరుగా ఖాతాదారుల హార్డ్‌వేర్‌కు పంపించడం ద్వారా బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందిస్తారు. ప్రపంచంలో దాదాపు వందకుపైగా దేశాల్లో ప్రస్తుతం ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి.

వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ

ఇక రెండు కంపెనీలుగా..

న్యూయార్క్: వచ్చే ఏడాది కల్లా రెండు కంపెనీలుగా విడిపోనున్నట్లు అంతర్జాతీయ మీడియా దిగ్గజం వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ (డబ్ల్యూబీడీ) సోమవారం ప్రకటించింది. తన స్టూడియోలు, స్ట్రీమింగ్ వ్యాపారాన్ని క్రమంగా ఆదరణ కోల్పోతున్న కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ నుంచి విడదీయనున్నట్లు డబ్ల్యూబీడీ తెలిపింది. 2026 ప్రథమార్థం చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావచ్చని వెల్లడించింది. విభజనలో భాగంగా స్ట్రీమింగ్ అండ్ స్టూడియోస్ కంపెనీలో వార్నర్ బ్రదర్స్ టెలివిజన్, వార్నర్ బ్రదర్స్ మోషన్ పిక్చర్ గ్రూప్, డీసీ స్టూడియోస్, హెచ్‌బీఓ, హెచ్‌బీఓ మ్యాక్స్‌తో పాటు ఫిల్మ్, టీవీ లైబ్రరీలు భాగం కానున్నాయి. కాగా, సీఎన్ఎన్, టీఎన్‌టీ స్పోర్ట్స్, డిస్కవరీ, బ్లీచర్ రిపోర్ట్‌ను గ్లోబల్ కేబుల్ నెట్‌వర్క్స్ కంపెనీ కలిగి ఉండనుంది.



దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ).. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.8,076.84 కోట్ల డివిడెండ్‌ను కేంద్ర ప్రభుత్వానికి చెల్లించింది. సోమవారం నాడు ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి అజయ్ సేథ్ సమక్షంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఈ డివిడెండ్ చెక్‌ను ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి అందజేశారు.

నాలుగో రోజూ లాభాలొచ్చాయ్..

సెన్సెక్స్ 256 పాయింట్లు అప్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో పాటు గతవారం ఆర్‌బీఐ రెపో రేటును 0.50 శాతం తగ్గించిన నేపథ్యంలో మదుపరులు వడ్డీ రేట్ల ప్రభావిత రంగాలైన బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, వాహనం, క్యాపిటల్ గూడ్స్ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు పెంచడం ఇందుకు దోహదపడింది. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 480 పాయింట్ల వరకు ఎగబాకినప్పటికీ, చివరికి 256.22 పాయింట్ల లాభంతో 82,445.21 వద్ద ముగిసింది. నిఫ్టీ 100.15 పాయింట్ల వృద్ధితో 25,103.20 వద్ద స్థిరపడింది. నిఫ్టీకి ఈ ఏడాదిలో ఇదే గరిష్ఠ ముగింపు స్థాయి.

లలిత జువెలరీ రూ.1,700 కోట్ల ఐపీఓ: తెలుగు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో షోరూమ్‌లను నిర్వహిస్తున్న స్వర్ణ, వజ్రాభరణాల విక్రయ సంస్థ లలిత జువెలరీ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా మొత్తం రూ.1,700 కోట్లు సమీకరించాలనుకుంటున్నట్టు డీఆర్‌హెచ్‌పీలో వెల్లడించింది. అందులో రూ.1,200 కోట్లు తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్ కిరణ్ కుమార్ జైన్ రూ.500 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు.

బిజినెస్

ఎంఎస్ఎంఈలపై మరింత ఫోకస్

● షిప్‌రాకెట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): త్వరలో పబ్లిక్ ఇష్యూకి వస్తోన్న ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ షిప్‌రాకెట్.. ఎంఎస్ఎంఈలకు తన సేవలను మరింత విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయంగా, దేశీయంగా తమ వ్యాపారాలను విస్తరించాలనుకునే ఎంఎస్ఎంఈలకు ప్రత్యేకమైన సేవలందించనున్నట్లు సంస్థ సీఈఓ (డొమెస్టిక్ షిప్పింగ్) సీఈఓ అతుల్ మెహతా చెప్పారు. షిప్‌రాకెట్ పోర్టల్‌పై ఇప్పటికే 3 లక్షల మంది విక్రేతలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దాదాపు 18 వేల మంది విక్రేతలు షిప్‌రాకెట్ ద్వారా 2 కోట్లకు పైగా ఉత్పత్తులను విక్రయించారని తెలిపారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల నుంచి ఎంఎస్ఎంఈలు చేసిన షిప్‌మెంట్స్ 35 లక్షలకు పైగా ఉన్నాయన్నారు.

కాగా కంపెనీ హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా 32 వేర్‌హౌసెస్‌ను నిర్వహిస్తోందని మెహతా చెప్పారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఢిల్లీలో డార్క్ స్టోర్స్ పేరుతో క్విక్ కామర్స్ సేవలను ప్రారంభించామని, దశలవారీగా దీన్ని ఇతర నగరాలకు విస్తరించనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే హైదరాబాద్‌లో డ్రోన్ ద్వారా ఉత్పత్తుల డెలివరీని చేపట్టాలని చూస్తున్నట్లు మెహతా తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	550
వరంగల్	542	గోదావరి	535
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	109
వరంగల్	105	గుంటూరు	112
కరీంనగర్	105	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	100
కర్నూలు	105	నెల్లూరు	105
విశాఖపట్నం	96	అనంతపురం	105
గోదావరి	109		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,690 ▼	89,550 ▼	1,18,000 ▲
విజయవాడ	99,000 ▼	93,000 ▼	1,08,000 ▲
విశాఖపట్నం	99,130 ▼	89,950 ▲	1,18,000 ▲
రాజమండ్రి	97,690 ▼	89,550 ▼	1,08,400 ▲
ప్రొద్దుటూరు	96,300 ▼	88,600 ▼	1,03,000 ▲
ముంబై	95,864 ▼	87,811 ▼	1,05,560 ▲

రైతన్నలూ.. భారీ దిగుబడులకు సిద్ధం'కంది'!

- కందిపంటలో కొత్త రకం వంగడం ఆవిష్కరణ
- ఐసీపీవి 25444 పేరుతో అభివృద్ధి చేసిన ఇక్రిశాట్
- హెక్టారుకు మూడు టన్నుల దిగుబడి
- ఇక్రిశాట్ డైరెక్టర్ హిమాన్షు పాఠక్

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కంది పంటలో భారీగా దిగుబడులు రాల్చే కొత్త రకం వంగడం వచ్చేసింది! ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న ప్రాంతాలు, తక్కువ తడితో నీటి ఎద్దడి ప్రాంతాలకూ అనుకూలంగా ఉండే 'ఐసీపీవీ- 25444' రకాన్ని ఇక్రిశాట్ అభివృద్ధి చేసింది. ఈ రకాన్ని కర్ణాటక, ఒడిసా, తెలంగాణ రాష్ట్రాల్లో విజయవంతంగా పరీక్షించినట్లు సంస్థ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్, డిప్యూటీ డీజీ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్ తెలిపారు. హెక్టారుకు 2 టన్నుల దిగుబడి ఇచ్చిన ఈ రకం రబీ, ఖరీఫ్ సీజన్లు అన్న తేడా లేకుండా సాగు చేసుకోవచ్చన్నారు. ఈ కొత్త జాతిని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు 2024లో స్పీడ్ బ్రీడింగ్ పద్ధతిలో అభివృద్ధి చేశారని తెలిపారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో, ఇది కందిసాగులో అద్భుత ఆవిష్కరణ అని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో కందిపప్పు వినియోగం 5 మిలియన్ టన్నులుగా ఉండగా, దేశీయంగా 3.5 మిలియన్ టన్నుల కందిపప్పు మాత్రమే ఉత్పత్తి జరుగుతుందని లీడ్ సైంటిస్ట్ డాక్టర్ ప్రకాశ్ గంగాశెట్టి తెలిపారు, దేశంలో నీటిని ఎక్కువగా వినియోగించే వరి పంటకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, వరి స్థానంలో ఈ కొత్తగా అభివృద్ధి చేసిన కందిపంటను ప్రోత్సహిస్తే నీటి అవసరాన్ని గణనీయంగా తగ్గించవచ్చునని తెలిపారు.

ఇద్దరు సీఎంలు కూర్చొని మాట్లాడుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి
- నీటి పంపకాలపై గొడవ పడాల్సిన అవసరం లేదు
- సముద్రంలో కలిసే నీటిని వినియోగించుకోవాలి

హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నీటి పంపకాల విషయంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు గొడవలు పడకుండా కూర్చొని మాట్లాడితే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నా రు. సోమవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరు రాష్ట్రాలు గొడవపడితే కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, రాజీ మార్గంగా ముందుకువెళ్తే సముద్రంలో కలిసే నీటిని అన్ని ప్రాంతాల ప్రజలకు వినియోగంలోకి తీసుకురావచ్చని బైరెడ్డి అన్నారు. తద్వారా రాయలసీమ, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు తక్కువ ఖర్చుతో సాగు నీరందించేలా ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చన్నారు.

బీసీ జాబితాలో మా కులాలను చేర్చండి

- బీసీ కమిషన్‌ను కోరిన ఏపీ కులసంఘాలు

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఏర్పడ్డాక ఈ రాష్ట్ర బీసీ కులాల జాబితా నుంచి తొలగించిన తమ కులాలను తిరిగి చేర్చాలని కోరుతూ ఏపీకి చెందిన కుల సంఘాల ప్రతినిధులు పలువురు బీసీ కమిషన్‌కు వినతులు సమర్పించారు. బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ఆధ్వర్యంలో సోమవారం ఆ కమిషన్ కార్యాలయంలో బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కళింగ, తూర్పుకాపు కులసంఘాలవారు కమిషన్ ముందు హాజరై తమ కులాలను తెలంగాణ బీసీ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో తెలంగాణ బీసీఏ కేటగిరీ కులాల పరిరక్షణ సమితి, తెలంగాణప్రదేశ్ గంగపుత్ర సంఘం ప్రతినిధులు బీసీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ మేధావులు తొలగించిన 26 కులాలను తిరిగి చేర్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

సింగరేణిలో మారుపేర్ల బాధితులను ఆదుకోవాలి

- మానవతా దృక్పథంతో వారసత్వ ఉద్యోగాలివ్వాలి
- రాజన్న కోడెలను సంరక్షించాలి: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్/ఇందల్వాయి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మారు(అలియాస్) పేర్లతో కార్మికులుగా పని చేసి, వారి వారసులకు డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో సింగరేణి జాగృతి నాయకులు, వారసత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారితో ఆమె సమావేశమయ్యారు. సంస్థలో 30ఏళ్లకుపైగా సేవ చేసిన కార్మికుల వారసులకు ఉద్యోగాలివ్వకుండా వేధింపులకు గురిచేయడం అన్యాయమని కవిత అన్నారు. వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన కోడెలు గోశాలల్లో చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కవిత మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కోడెల మరణాలను ఆపడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి రామాలయాన్ని కవిత దర్శించుకున్నారు.

ఆధునిక అంబేడ్కర్.. సీఎం రేవంత్: ప్రీతమ్

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి.. ఆధునిక అంబేడ్కర్‌లా దళితుల పక్షాన నిలిచారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర క్యాబినెట్‌లోకి అడ్లూరి లక్ష్మణ్, వివేక్‌ను తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. దళితులను డిప్యూటీ సీఎంగా, స్పీకర్‌గా, మంత్రులుగా నియమించి.. గౌరవ స్థానం కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. దాదాపు 30 ఏళ్ల సుదీర్ఘ కల.. ఎస్సీ వర్గీకరణను ఒక్క సంతకంతో చేసిన ఘనత సీఎం రేవంత్‌కే దక్కుతుందని చెప్పారు.

నేటి నుంచి గాంధీభవన్‌లో అందుబాటులో ప్రజా ప్రతినిధులు

వివిధ సమస్యలపై ప్రజలు, కార్యకర్తల నుంచి వినతిపత్రాలు స్వీకరించేందుకు ఇకపై ప్రతిరోజూ గాంధీభవన్‌లో ఇద్దరు ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉండనున్నారు. మంగళవారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. తొలి రోజున వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు గాంధీభవన్‌లో అందుబాటులో ఉండనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వారు వినతిపత్రాలు స్వీకరిస్తారు. అయితే ప్రతి ఆదివారం ఈ కార్యక్రమానికి విరామం ఇవ్వనున్నారు.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీసుధకు ఘనంగా వీడ్కోలు

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టుకు బదిలీపై వెళ్తున్న జస్టిస్ పీ శ్రీసుధకు హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. జస్టిస్ శ్రీసుధ బదిలీ సందర్భంగా మొదటి కోర్టు హాల్‌లో ఫుల్ కోర్టు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ ప్రసంగించారు. ఐదు వేలకుపైగా కేసులను పరిష్కరించడంతోపాటు జిల్లా జడ్జిగా, హైకోర్టు జడ్జిగా ఆమె న్యాయవ్యవస్థకు చేసిన సేవలను ప్రస్తావించారు. జస్టిస్ శ్రీసుధ మాట్లాడుతూ జీవితంలో ఎదురైన ప్రతి కష్టాన్ని సవాల్‌గా స్వీకరించినట్లు పేర్కొన్నారు. తమ బదిలీలపై బార్ అసోసియేషన్ సభ్యులు నిరసన వ్యక్తం చేసి నైతికంగా మద్దతుగా నిలిచారంటూ కృతజ్ఞతలు తెలియజేశారు.

బకాయి రూ.11,501 కోట్లు!

- ఈ ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన పాత అప్పు అసలిది
- ఆర్బీఐ తాజా నివేదికలో వెల్లడి

పాత అప్పులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మొత్తం రూ.11,501 కోట్ల అసలు (ప్రిన్సిపల్) సొమ్మును చెల్లించాల్సి ఉంది. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) తాజా నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. డిసెంబరు వరకు రూ.9,001 కోట్లు, వచ్చే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో మరో రూ.2,500 కోట్లు.. అంటే మార్చి 31తో ముగిసే ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా రూ.11,501 కోట్ల అసలు సొమ్మును చెల్లించాల్సి ఉందని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పాత అప్పుల అసలు కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.15,848.20 కోట్లు చెల్లించాల్సి ఉందని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇది కాకుండా వడ్డీ కింద మరో రూ.19,369.02 కోట్లు చెల్లించాల్సి ఉందని వెల్లడించింది. అంటే... అసలు, వడ్డీల కింద ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.35,217.22 కోట్లు చెల్లించాలి.

తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర ఒప్పుకోలే..

అందుకే కాళేశ్వరం చేపట్టాం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులతోనే ప్రాణహిత-చేవెళ్లను రీ ఇంజనీరింగ్ చేశామన్నారు. ప్రాణహిత -చేవెళ్లను రెండు ప్రాజెక్టులుగా విడగొట్టామని, తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి, ఉమ్మడి ఆదిలాబాద్‌లో నీరందించడానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహితగా, మరొకటి కాళేశ్వరం ఎత్తిపోతల పథకంగా చేపట్టామని తెలిపారు. ప్రాణహిత-చేవెళ్లలో ఏడు లింక్‌లు ఉండగా.. అందులో ఒక్క లింక్ తప్ప మిగిలిన లింకులన్నీ యథాథతంగా చేపట్టామన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ చెప్పడంతోనే మేడిగడ్డకు బ్యారేజీ స్థలాన్ని మార్చామని చెప్పారు. 152 అడుగుల ఎత్తుతో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టడానికి మహారాష్ట్ర అంగీకరించలేదని హరీశ్‌రావు తెలిపారు. ముంపునకు గురయ్యే ప్రాంతానికి పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామంటూ అప్పటి మహారాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హసన్ ముష్రీఫ్‌ను 2014 ఆగస్టు 23న కలిశానని తెలిపారు. 152 అడుగుల ఎత్తుతో బ్యారేజీని అంగీకరించబోమని మహారాష్ట్ర నాటి సీఎం పృథ్వీరాజ్ చవాన్ ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి లేఖ కూడా రాశారన్నారు. 2007 నుంచి 2014 దాకా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉన్నా.. అనుమతులు ఇవ్వలేదని గుర్తుచేశారు. ఆ తర్వాత మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. దేవేంద్ర ఫడణవీస్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చర్చలు జరిపారని చెప్పారు. 'నేనే ప్రాణహిత-చేవెళ్ల ముంపునకు వ్యతిరేకంగా ఉద్యమించా. అలాంటి నేనే అనుమతులు ఎలా ఇస్తా?' అని ఫడణవీస్ పేర్కొన్నారని తెలిపారు. ఇక తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత ఉండగా.. అందులో 63 టీఎంసీలు ఎగువ రాష్ట్రాల వాటా అని సీడబ్ల్యూసీ 2015 మార్చి 4న లేఖ రాసిందన్నారు. మహారాష్ట్ర అభ్యంతరాలు, నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ లేఖతో రీ ఇంజనీరింగ్ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

క్యాబినెట్ ఆమోదంతోనే కాళేశ్వరం

కాళేశ్వరం ప్రాజెక్టుకు మంత్రివర్గం ఆమోదం ఉందా అని కమిషన్ ప్రశ్నించగా.. ఉందని, ప్రతి కాంపొనెంట్‌కు మంత్రివర్గ తీర్మానం కూడా ఉందని హరీశ్‌రావు జవాబు ఇచ్చారు. బ్యారేజీల స్థలాల మార్పు నిర్ణయం హైపవర్ కమిటీ తీసుకుందా? వ్యాప్కోస్ లేఖ తర్వాత హై పవర్ కమిటీతో సమావేశం జరిగిందా? అని కమిషన్ ప్రశ్నించగా.. హైపవర్ కమిటీ పూర్తిగా సాంకేతిక కమిటీ అని, బ్యారేజీల స్థలాల మార్పుపై ఆ కమిటీ చేసిన సిఫారసులను ప్రభుత్వం ఆమోదించిందని చెప్పారు. తాము ప్రజాప్రతినిధులమని, సాంకేతిక అంశాలపై తమకు సంపూర్ణ అవగాహన ఉండదని బదులిచ్చారు. ప్రాజెక్టులు ప్రతిపాదించిన తర్వాత కూడా నిర్మాణ స్థలాలను మార్చారని, నాగార్జునసాగర్‌ను తొలుత ఏలేశ్వరం వద్ద కట్టాలని ప్రతిపాదించారని, ఆ తర్వాత నందికొండకు మార్చారని, అదే విధంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టును తొలుత కుస్తాపురం వద్ద ప్రతిపాదించగా.. ఆ తర్వాత పోచంపాడుకు మార్చారని, రిజర్వాయర్లు ప్రతిపాదించిన తర్వాత మార్చిన దాఖలాలు పలు ప్రాజెక్టుల్లో ఉన్నాయని హరీశ్ గుర్తుచేశారు. కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్‌ను ఏ ఉద్దేశంతో ఏర్పాటు చేశారని కమిషన్ ప్రశ్నించగా.. రాష్ట్ర ఏర్పాటు అనంతరం భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి సరిపడా నిధుల్లేవని, నిధుల సమీకరణ కోసం కాళేశ్వరం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు.



కమిషన్ ఎదుట హాజరైన అనంతరం మాట్లాడుతున్న హరీశ్‌రావు

దీనికి కేంద్ర ప్రభుత్వ రుణ సంస్థలతో పాటు జాతీయ బ్యాంకుల నుంచే రుణాలు తీసుకున్నామని చెప్పారు. కాళే శ్వరం ప్రాజెక్టుకు తీసుకున్న రుణాలను కార్పొరేషన్ నుంచే చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారా? అని ప్రశ్నించగా.. హైదరాబాద్ జంట నగరాల తాగునీటి అవసరాలు, ప్రాజెక్టు వెంట గ్రామాలకు తాగునీటిని ఇవ్వడం, పారిశ్రామిక అవసరాలకు ఇచ్చే నీటికి నిధులు వసూలు చేసి, వాటితో రుణాలను తిరిగి చెల్లించాలని అనుకున్నట్లు హరీశ్ తెలిపారు. రెండేళ్లపాటు కరోనా కారణంగా సాధ్యం కాలేదన్నారు. బ్యారేజీల నిర్మాణ స్థలాల అప్పగింతలో జాప్యం జరిగిందా? అని ప్రశ్నించగా.. పెద్దగా జరగలేదన్నారు. నిపుణుల కమిటీ సిఫారసులు అమలు చేశారా? అని అడగ్గా.. మేడిగడ్డ నుంచి నేరుగా ఎల్లంపల్లికి నీటిని తరలించాలని కమిటీ సూచించిందని హరీశ్ తెలిపారు. అయితే మార్గమధ్యంలో ఎన్‌టీపీసీతో పాటు సింగరేణి గనులు ఉండడంతో సాధ్యం కాదనే అమలు చేయలేదన్నారు. ఏ మేరకు నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు కట్టారని ప్రశ్నించగా.. కాళేశ్వరంలో 141 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు నిర్మించామని తెలిపారు. బ్యారేజీల నీటి నిల్వకు ఆదేశాలు ఎవరిచ్చారని కమిషన్ ప్రశ్నించగా.. ఆ నిర్ణయం సాంకేతిక అధికారులదేనని హరీశ్ బదులిచ్చారు. బ్యారేజీల్లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయాలని ప్రభుత్వం ఆదేశించలేదని, ఆ నిర్ణయం అధికారులే తీసుకున్నారని గుర్తుచేశారు.

భారీగా తరలివచ్చిన శ్రేణులు

హరీశ్‌కు మద్దతుగా అభిమానులు/కార్యకర్తలు తరలివచ్చారు. వీరంతా ర్యాలీగా కమిషన్ కార్యాలయం ఉన్న బీఆర్‌కే భవన్‌కు తరలిరాగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. కమిషన్‌కు, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా హరీశ్‌కు మద్దతుగా నినాదాలు ఇవ్వడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

నీళ్లు లేని చోట కాంగ్రెస్ బ్యారేజీని ప్రతిపాదించింది

నీళ్లు లేని తుమ్మిడిహెట్టి వద్ద కాంగ్రెస్ పార్టీ బ్యారేజీని ప్రతిపాదించిందని హరీశ్‌ఆరోపించారు. విచారణ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం నెలరోజులకే తుమ్మిడిహెట్టి బ్యారేజీ పనుల కోసం మహారాష్ట్రతో సంప్రదింపులు జరిపామన్నారు. సీడబ్ల్యూసీ మూడు లేఖలు రాసిందని, వ్యాప్కోస్ అల్లాటప్పా సంస్థ కాదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ నీళ్ల లేని చోట బ్యారేజీని ప్రతిపాదించగా.. తాము అధికారంలోకి వచ్చాక నీళ్లున్న చోటుకు బ్యారేజీని మార్చామన్నారు. గంధమళ్ల దగ్గరికి సీఎం రేవంత్ వెళ్లారని, ఆ రిజర్వాయర్‌కు మల్లన్నసాగర్ నుంచే నీళ్లు వస్తాయని హరీశ్ గుర్తుచేశారు. హైదరాబాద్ జంట నగరాలకు తాగునీటిని అందించడానికి ప్రతిపాదించిన పథకానికి నీళ్ల కూడా మల్లన్నసాగర్ నుంచే వస్తాయన్నారు.

ఆంగ్లం రాదని.. ఆంగ్లంలోనే జవాబులు!

కాళేశ్వరం కమిషన్ విచారణ ప్రారంభం కాగానే.. 'నేను తెలుగు మీడియం విద్యార్థిని' అని తెలుగులోనే ప్రశ్నలకు జవాబు చెబుతానని హరీశ్ అన్నారు. అయితే కమిషన్ అడిగిన ప్రశ్నలకు 95 శాతానికి పైగా ఆంగ్లంలోనే జవాబులు చెప్పారు. అంతేగాక సమగ్రంగా వివరణ ఇచ్చారు. సోమవారం ఉదయం 11:39 గంటలకు కమిషన్ విచారణ ప్రారంభమవగా.. 114వ క్రాస్ విట్‌నెస్ (సాక్షి)గా హరీశ్ హాజరయ్యారు. తాను తెలుగు మీడియం విద్యార్థినని హరీశ్ కమిషన్‌కు నివేదించగా.. తనకు తెలుగు రాకపోయినా తెలుగులో జవాబులు చెప్పడానికి అవకాశం ఇస్తున్నామని జస్టిస్ ఘోష్ స్పష్టం చేశారు. దాంతో కమిషన్ ఆంగ్లంలో దాదాపు 21 ప్రశ్నలు వేయగా.. అన్నింటికీ హరీశ్ ఇంగ్లి్‌ష్‌లోనే జవాబులు ఇచ్చారు. తాను జీవితకాలంలో ఏ రోజూ కమిషన్‌ల విచారణకు హాజరవలేదని, తొలిసారి హాజరవుతున్నానని హరీశ్ విలేకర్లతో చెప్పారు.

నిన్నేం అడిగారు.. నేనేం చెప్పాలి?

- హరీశ్‌తో కేసీఆర్ సమాలోచనలు

హైదరాబాద్/సంగారెడ్డి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరైన అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు నేరుగా ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లారు. సోమవారం సాయంత్రం ఫాంహౌస్‌కి వెళ్లిన హరీశ్.. అక్కడ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. రాత్రి 8 గంటల వరకూ (దాదాపు 4 గంటల పాటు) పలు అంశాలపై చర్చలు జరిపారు. ఈ భేటీలో కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా 'విచారణలో ఏం అడిగారు? ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జరిగిన పరిణామాలపై ఏం చెప్పావు?' అని కేసీఆర్ హరీశ్‌ను అడిగినట్లు సమాచారం. ఈ నెల 5న కమిషన్ ఎదుట హాజరైన ఈటల రాజేందర్‌ను అడిగిన ప్రశ్నలు.. తాజాగా హరీశ్‌ను అడిగిన ప్రశ్నలను బేరీజు వేసుకున్నట్లు తెలిసింది. కమిషన్ తనను దాదాపు 21 ప్రశ్నలు వేసిందని, అన్నింటికీ సమాధానం ఇచ్చానని హరీశ్ చెప్పారు. మౌఖిక జవాబులే కాకుండా.. తగిన ఆధారాలను కూడా అందజేసినట్లు ఆయన కేసీఆర్‌తో చెప్పారు. ఈటల, హరీశ్‌ను అడిగిన ప్రశ్నలను ఆరా తీసిన కేసీఆర్.. బుధవారం తనను ఏమేం అడుగుతారన్న దానిపై ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. కమిషన్ అడిగే ప్రశ్నలు ఎలా ఉంటున్నాయి? జవాబు ఎలా చెప్పాలన్నదానిపై హరీశ్‌తో సమాలోచనలు చేసినట్లు సమాచారం. ప్రశ్నల్లో తికమకలు, ప్రశ్నల స్థాయి గురించి కేసీఆర్ లోతుగా అడిగినట్లు తెలిసింది. ఆ ప్రశ్నల ఆధారంగానే అన్ని విధాలుగా కేసీఆర్ సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. కాళేశ్వరం విచారణ కమిషన్ తనకు నోటీసులు ఇచ్చిన నాటి నుంచి కేసీఆర్ ఇప్పటికే 5 సార్లు హరీశ్‌తో చర్చించారు. మరిన్ని విషయాలను నివృత్తి చేసుకునేందుకు ఇంజనీర్లతోనూ ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. బుధవారం (ఈ నెల 11న) ఉదయం 11 గంటలకు కమిషన్ ఎదుట కేసీఆర్ విచారణకు హాజరుకానున్నారు.

భారీగా గులాబీ శ్రేణుల సమీకరణ..

బుధవారం కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరవుతున్న నేపథ్యంలో ఆయనకు మద్దతుగా నిలిచేందుకు బీఆర్ఎస్ కార్యాచరణ రూపొందించింది. ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచి భారీ కాన్వాయ్‌తో కేసీఆర్ తెలంగాణ భవన్‌కు చేరుకోవడం, అక్కడి నుంచి బీఆర్‌కే భవన్ వద్దకు రావడం.. అన్నీ ప్రత్యేకంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. భారీగా పార్టీ శ్రేణులు తరలివచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డితోపాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ పిలుపునిచ్చినట్లు తెలుస్తోంది. తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలతోపాటు మాజీ ప్రజాప్రతినిధులకు కూడా తెలంగాణ భవన్ నుంచి సందేశం పంపినట్లు సమాచారం.

కాంగ్రెస్ నోటీసులకు భయపడేదే లే..!

- కేసీఆర్‌ను బద్నామ్ చేయడమే కాంగ్రెస్, బీజేపీ అజెండా
- కాళేశ్వరంలో అవకతవకలు జరగలేదు
- హరీశ్ అన్ని రుజువులూ అందజేశారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ , జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఏదో ఒక రకంగా తమను ఇబ్బంది పెట్టాలన్న దుర్బుద్ధితో తప్పుడు ఆరోపణలతో కాంగ్రెస్ ఇచ్చే నోటీసులకు తాము భయపడేదేలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తాటాకు చప్పుళ్లకు భయపడే వారెవరూ తమ పార్టీలో లేరన్నారు. మీడియా మేనేజ్‌మెంట్‌తో ప్రధాని మోదీ దృష్టిలో పడేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒక వ్యక్తి నిర్ణయం కాదని, అప్పటి తెలంగాణ మంత్రివర్గం సమష్టిగా నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఇదే విషయాన్ని గతంలో మంత్రులుగా పనిచేసిన ఈటల రాజేందర్‌తో పాటు హరీశ్ రావు స్పష్టం చేశారన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణం ప్రభుత్వ విధానపర నిర్ణయమని, ఆచరణలో పెట్టే బాధ్యత అధికారులు, యంత్రాంగంపై ఉంటుందని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, పారదర్శకంగా జరిగిన పనిలో దాచాల్సిందేమీ లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ ఒకే అజెండాతో పనిచేస్తున్నాయని, ఏదో ఒకటి చేసి కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూస్తున్నాయన్నారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. అందులో ఏదో తప్పు జరిగిందని భ్రమలు కల్పించేందుకే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారన్నారు. అయితే ఇప్పటికే కమిషన్ విచారణకు హాజరైన హరీశ్‌రావు ఆ ప్రాజెక్టుపై అన్ని రుజువులు అందజేశారని, దీనిపై కేసీఆర్‌ను ప్రశ్నించే అవకాశమే లేదని చెప్పారు. కాళేశ్వరంపై తమ పార్టీ నేత హరీశ్‌రావు ఇచ్చిన ప్రజెంటేషన్‌ను చూసిన వారికి ఆ ప్రాజెక్ట్ ప్రాధాన్యత, ప్రయోజనం సులభంగా అర్థమైందని పేర్కొన్నారు. భాక్రానంగల్, నాగార్జునసాగర్, నర్మద, ఎస్సారెస్పీ ప్రాజెక్టులు నిర్మించడానికి కాంగ్రెస్ ప్రభుత్వాలకు దశాబ్దాలు పట్టిందన్నారు. అదే 45 లక్షల ఎకరాలకు నీరందించేలా కాళేశ్వరం లాంటి ప్రాజెక్ట్‌ను ప్రపంచంలో ఏ నాయకుడూ నాలుగేళ్లలో పూర్తిచేయలేదని పేర్కొన్నారు. మన దేశంలో రాజకీయ కుట్రలకు ఈ గొప్ప ప్రాజెక్టు పావుగా మారిందని చెప్పారు. రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగిస్తోందని, ఎన్నికలకు ముందు 420 హామీలిచ్చి అధికారం చేపట్టి.. ఇప్పుడు ప్రజలను మోసం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు.

బీవోటీ విధానంలో ఉత్తర భాగం!

- ఆరు వరుసలతో ఆర్ఆర్ఆర్ నిర్మాణం
- నెలాఖరుకల్లా కేంద్రానికి సమగ్ర నివేదిక
- కేంద్ర మంత్రి వర్గం ఆమోదించే అవకాశం

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర, దక్షిణ భాగం మార్గాలపై మళ్లీ కదలిక వచ్చింది. ఉత్తరభాగానికి సంబంధించి పలు మార్పులతో కూడిన సమగ్ర నివేదిక ఈ నెలాఖరుకు కేంద్రానికి వెళ్లనుంది. అనంతరం కేంద్ర మంత్రివర్గం కూడా ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. మరోవైపు దక్షిణభాగం అలైన్‌మెంట్ ఖరారు ప్రక్రియ కూడా తుది దశకు చేరుకుంది. ఇటీవలే డ్రోన్ సర్వే పూర్తవగా, సమగ్ర నివేదిక తయారవుతోంది. వాస్తవానికి ఉత్తర భాగం(సంగారెడ్డి-చౌటుప్పల్ 161కి.మీ) నిర్మాణం కోసం గత ఏడాది డిసెంబరులోనే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) టెండర్లను ఆహ్వానించింది. అయితే, ఆ టెండర్లలో 4 వరుసలతో, ఇంజినీరింగ్-ప్రొక్యూర్‌మెంట్-కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో రోడ్డు నిర్మించాలని పేర్కొంది. ఆ తర్వాత ఉత్తర భాగంపై మరోసారి నిర్వహించిన సమీక్షలో 'ట్రాఫిక్ సర్వే'ను మళ్లీ చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుత ట్రాఫిక్, రహదారి నిర్మాణం పూర్తయ్యాక పెరిగే వాహనాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఆరు వరుసల రోడ్డు అవసరమని ఆ సర్వేలో గుర్తించారు. దీంతో ఆరు వరుసలతో కూడిన రోడ్డుతోపాటు సర్వీస్ రోడ్లు, కల్వర్టులు, సహా ఇతరత్రా అంశాలన్నింటిపై ఎన్‌హెచ్ఏఐ అధికారులు మరో సారి సమగ్ర నివేదిక రూపొందించారు. ఈపీసీ విధానం కాకుండా బిల్డ్-ఆపరేట్-టోల్ అండ్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానంలో నిర్మిస్తే కేంద్రంపై భారం పడకుండా ఉంటుందని అందులో పొందుపర్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే పిలిచిన టెండర్లను రద్దు చేసి, 6 వరుసల రోడ్డుకు మళ్లీ కొత్తగా టెండర్లు పిలవాలా? లేదా? అనే అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ అంశాలన్నింటిపై స్పష్టత వచ్చాక.. నెలాఖరు నాటికి నివేదికను కేంద్రానికి పంపేలా ఎన్‌హెచ్ఏఐ కసరత్తు చేస్తోంది. అయితే, ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగానికి అన్ని అనుమతులు వచ్చినప్పటికీ..ఈ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ ఇంకా ఆమోదించలేదు. ఈ నేపథ్యంలో తాజా నివేదిక అందాక.. కేంద్ర క్యాబినెట్‌లో చర్చించి ప్రాజెక్టుకు ఆమోదం తెలిపే అవకాశం ఉందని తెలిసింది. తర్వాత నిర్మాణ విధానం, టెండర్ల ఖరారు వంటి పనులు కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు.



తుది దశకు దక్షిణభాగం అలైన్‌మెంట్

ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం విషయంలోనూ అడుగులు ముందుకు పడుతున్నాయి. ఈ ప్రాజెక్టు మంజూరైనప్పుడు ఎన్‌హెచ్ఏఐ ఇచ్చిన 189 కిలోమీటర్ల అలైన్‌మెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పలు మార్పులు చేసింది. అదనంగా 11 కిలోమీటర్లను పెంచి మొత్తం 200 కిలోమీటర్లు చేసింది. తద్వారా చాలా ప్రాంతాలకు ఈ రోడ్డు అనుసంధానం కానుంది. ఇప్పటికే డ్రోన్ సర్వే, క్షేత్రస్థాయి పరిశీలనలు పూర్తయ్యాయి. ప్రస్తుతం అలైన్‌మెంట్ ఖరారు ప్రక్రియ తుది దశకు చేరుకుంది. దీనికి సంబంధించిన సమగ్ర నివేదిక త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి అందనుంది. ఆ నివేదికను సైతం రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రానికి సమర్పించనుంది.

సమసమాజ స్థాపనే ప్రభుత్వ లక్ష్యం

- పదేళ్లు దోపిడీ చేసినోళ్లే.. మళ్లీ బురద జల్లుతున్నారు: భట్టి
- అన్ని కులాలకు సముచిత గౌరవం: పొంగులేటి
- గౌడలు అన్ని రంగాల్లోనూ రాణించాలి: పొన్నం
- ఖమ్మం.. కాంగ్రెస్‌కు కంచుకోట: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో గౌడ సంక్షేమ భవన్‌కు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, పొన్నం, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

ఖమ్మం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్రంలో సమ సమాజ స్థాపన, అన్నివర్గాలకు ప్రభుత్వ ఫలాలు అదించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కులగణన సర్వే నిర్వహించి, కుల జనాభా ఆధారంగా ప్రభుత్వ పథకాలు లబ్ధి చేకూర్చేలా కార్యక్రమం రూపొందించడం ద్వారా దేశానికే దిక్సూచిగా నిలిచామన్నారు. ఖమ్మం నియోజకర్గంలోని రఘునాథపాలెంలో నిర్మించ తలపెట్టిన గౌడ సంక్షేమ భవన్‌కు సోమవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో భట్టి మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు సమాజంలో వెనుకబడిన వర్గాలకు సమ న్యాయం అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రఘునాథపాలెంలో నిర్మించే గౌడ సంక్షేమభవన్‌ను ఏడాదిలోపు పూర్తిచేస్తామని ఇక్కడే కోచింగ్‌సెంటర్, విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించడంతో పాటు సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, సమాజంలోని అన్ని కులాల వారికి సముచిత గౌరవం ఇస్తోందన్నారు. ఖమ్మంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గౌడలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఖమ్మంజిల్లా కాంగ్రెస్‌కు కంచు కోట అని, ఇక్కడ మెజారిటీ సీట్లు గెలవడం ద్వారానే కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగిందన్నారు.

ఒకటి రెండు నెలల్లో పదవులన్నీ భర్తీ చేస్తాం

పదేళ్లు రాష్ట్రాన్ని దోపిడీ చేసినోళ్లే ఇప్పుడు ప్రజలకు మేలు చేస్తున్న కాంగ్రెస్‌పై బుర ద జల్లు తు న్నా ర ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను పార్టీ కార్యకర్తలు తీసుకోవాలని కోరారు. తద్వారా రాబోయే పదేళ్లు కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదిహేనేళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డ వారందరికీ న్యాయం చేస్తామన్నారు. కొన్ని రోజుల్లోనే నామినేటెడ్, ఇతర పదవులను భర్తీ చేస్తామన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని పదేళ్లలో ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన ఘనత బీఆర్ఎస్‌ది అని దుయ్యబట్టారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ ప్రభుత్వంలో ప్రతి కార్యకర్త భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో 11,104 ఇందిరమ్మ ఇళ్లు

- లబ్ధిదారులకు 98.64 కోట్లు విడుదల
- ప్రతి సోమవారం బిల్లుల చెల్లింపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మిర్యాలగూడలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేత

మిర్యాలగూడ/హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 11,104 ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. లబ్ధిదారులకు రూ.98.64 కోట్లు విడుదల చేశామన్నారు. నాలుగు విడతల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3500 చొప్పున 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేశామన్నారు. లబ్ధిదారులు ఎంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తే అంత త్వరగా బిల్లులు చెల్లిస్తామన్నారు. సోమవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తల తాకట్టు పెట్టి అయినా సరే ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. ప్రతిసోమవారం లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తామన్నారు. వారం పది రోజుల్లో పైలట్ గ్రామాల్లో గృహ ప్రవేశాలు చేసుకోబోతున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఒక్క రోజు కూడా నిధుల కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా, నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తామని చెప్పారు.


నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న పొంగులేటి, కోమటిరెడ్డి, ఉత్తమ్

బనకచర్ల పై

న్యాయ పోరాటం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

మిర్యాలగూడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిపై బనకచర్ల ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో కట్టనివ్వబోమని, అందుకోసం న్యాయపోరాటం చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడలో ఆయన మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ తన నిర్ణయాన్ని విరమించుకోవాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు అడ్డొచ్చినా నిర్మాణాన్ని అడ్డుకుని తీరుతామని అన్నారు. కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ ఎదుట హరీశ్‌రావు అన్నీ అబద్ధాలే చెబుతున్నారని విమర్శించారు.


కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న తుమ్మల, చిత్రంలో ఎంపీ కొండా

కొబ్బరి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని నెలకొల్పాలి!

- పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపు పునఃసమీక్షించాలి
- హార్టికల్చరల్ వర్సిటీకి రూ. 100 కోట్లు ఇవ్వాలి
- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటుచేయాలని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రికి తుమ్మల ఈ మేరకు వినతిపత్రం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ కేంద్రంగా కొబ్బరి బోర్డు కార్యాలయం ఉండేదని, విభజన అనంతరం విజయవాడకు తరలిపోయిందని ఆయన వివరించారు. రాష్ట్రంలో 3,300 ఎకరాల్లో కొబ్బరి తోటలు సాగవుతుంటే, ఇందులో 75 శాతం తోటలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఉన్నాయన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పామాయిల్ విత్తనాలు దేశీయంగా సరిపడా అందుబాటులో లేనందున విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం పునఃసమీక్షించాలని మంత్రి తుమ్మల కోరారు. శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీకి రూ. 100 కోట్లు మంజూరుచేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రికార్డు!

- 72 లక్షల టన్నులు కొనుగోలు చేశాం: ఉత్తమ్

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో రైతుల నుంచి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్లు రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,378 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి 72 లక్షల టన్నుల ధాన్యం సేకరించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023లో కొనుగోలు చేసిన ధాన్యంతో పోలిస్తే.. 13 లక్షల టన్నులు అదనంగా కొనుగోలు చేసినట్లు చెప్పారు. పౌరసరఫరాల సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ధాన్యం సేకరణ గణాంకాలను ఉత్తమ్ వెల్లడించారు. ఈ సీజన్‌లో 12.33 లక్షల మంది రైతుల నుంచి 72 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.15,121 కోట్లు చెల్లించామన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే జూన్ 8 నాటికి రూ.9,139 కోట్లు అదనంగా చెల్లించామన్నారు. 2023 జూన్ 8 నాటికి 59 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుచేస్తే, 2025 జూన్ 8 నాటికి 72 లక్షల టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు.

కవులు, రచయితలు, కళాకారులు.. సమాజ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

- రచనలు, ఆట పాటలు, ప్రదర్శనలతో చైతన్యం తేవాలి
- అవసరమైతే వీటి కోసం రూ.10 కోట్లు ఇస్తాం: జూపల్లి

బేగంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సరిపోవని, సామాజిక రుగ్మతులను రూపుమాపినప్పుడే నవ సమాజం నిర్మితమవుతుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సమాజ సర్వతోముఖాభివృద్ధికి కవులు, రచయితలు, సాహితీవేత్తలు, కళాకారులు, మేధావులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 'ప్రభుత్వ పథకాలు- సమాజాభివృద్ధి, సాంస్కృతిక అంశాలపై కవులు, కళాకారులు, రచయితలు, మేధావులతో నిర్వహించిన సదస్సులో మంత్రి జూపల్లి మాట్లాడారు. ప్రజల ఆలోచనా విధానాల్లో మార్పులు తీసుకురావడానికి కవులు, రచయితలు కలాలకు పదును పెట్టాలని.. కళాకారులు ఆట పాటలు, ప్రదర్శనలు, వీధి నాటకాలు, నాట్యం ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించడానికి కృషి చేయాలన్నారు. అవసరమైతే వీటి కోసం రూ.10 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. పాటతో పాటు రచనలు, సినిమాను సాధనంగా ఉపయోగించుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు, మేధావులు కలిసి ఒక అజెండాను తీసుకువచ్చి దానిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ సూచించారు.

మహిళా సాధికారతతోనే తెలంగాణ అభివృద్ధి

- అభివృద్ధికి ప్రత్యేక సాధనాలేమీ ఉండవు: మంత్రి దుద్దిళ్ల
- అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి: సినీ నటి శ్రీలీల
- 'షీ ఈజ్ ద హీరో ఆల్వేస్' యాప్ ఆవిష్కరణ


'సీత' యాప్ ఆవిష్కరణలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నటి శ్రీలీల

హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ప్రత్యేకంగా సాధనాలు, ఫార్ములాలు ఏమీ ఉండవని, మహిళా సాధికారితతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మహిళా గిగ్ వర్కర్లకు నైపుణ్య ఆధారిత సంపాదన అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా వ్యాపారవేత్త స్వాతి నేలభట్ల రూపొందించిన 'షీ ఈజ్ ద హీరో ఆల్వేస్ (సీత)' యాప్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో సినీ నటి శ్రీలీల, దర్శకుడు హరీశ్ శంకర్, ఝాన్సీరెడ్డి హనుమంతుల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ 'సీత' యాప్ విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ ఉన్న ప్రతి మహిళా ఓ హీరోనే అని అభిప్రాయపడ్డారు. స్వాతి నేలభట్ల మాట్లాడుతూ దేశ విదేశాల్లో మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం అందించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. 'సీత'.. కేవలం ఒక యాప్ మాత్రమే కాదని, ఓ విప్లవాత్మక ఉద్యమమని తెలిపారు. సినీ నటి శ్రీలీల మాట్లాడుతూ విభిన్న రంగాల్లో ఎదగాలనుకుంటున్న మహిళలకు సీత యాప్.. చక్కటి వేదికగా నిలుస్తుందని తెలిపారు.

'మహాలక్ష్మి'తో అభివృద్ధి పథంలో ఆర్టీసీ

- జీరో టికెట్ ప్రయాణాలకు రూ.6,200 కోట్లు చెల్లింపు: భట్టి
- ఎలక్ట్రిక్ బస్సులతో పర్యావరణ పరిరక్షణ: మంత్రి పొన్నం

సూర్యాపేట అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'మహాలక్ష్మి' పథకంతో ఆర్టీసీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఇప్పటివరకు 182 కోట్ల జీరో టికెట్ ప్రయాణాలకు సంస్థకు రూ.6,200 కోట్లు చెల్లించామని తెలిపారు. సోమవారం సూర్యాపేట ఆర్టీసీ డిపోలో 45 ఎలక్ట్రిక్ బస్సులను రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, ఆర్టీసీ సంస్థ పరిరక్షణ నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ బస్సులతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునని, పర్యావరణాన్ని కాపాడుకుంటూ ఆర్టీసీ ముందుకు వెళుతోందని అన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్య రహిత ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేస్తున్నాయన్నాయని తెలిపారు.

పీసీసీ పదవుల్లోనూ సామాజిక న్యాయం

(మొదటిపేజీ తరువాయి)

వర్గాలకు 67 శాతం దక్కాయి. ఇక 69 ప్రధాన కార్యదర్శి పదవుల్లో బీసీలకు అత్యధికంగా 26 మందికి అవకాశం కల్పించారు. తొమ్మిది మంది ఎస్సీలు, నలుగురు ఎస్టీలు, ఎనిమిది మంది ముస్లింలను నియమించారు. మొత్తంగా ప్రధాన కార్యదర్శి పదవుల్లో ఈ వర్గాలన్నింటికీ కలిపి 68 శాతం దక్కాయి. కాగా, పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి, విధేయులకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇరవై ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ, చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేస్తున్న సీనియర్ నేతలకు అవకాశమిచ్చారు. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐలో పనిచేసిన వారికీ కార్యవర్గంలో చోటు దక్కింది.

ఎక్కువ మందిని ప్రతిపాదించినా..

వాస్తవానికి రాష్ట్ర నాయకత్వం మరింత ఎక్కువ మందితో జాబితాను ప్రతిపాదించింది. 40 మంది ఉపాధ్యక్షులు, 85 మంది ప్రధాన కార్యదర్శులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అధిష్ఠానానికి ప్రతిపాదించారు. ముఖ్యనేతలతో సంప్రదింపుల తర్వాతే ఈ ప్రతిపాదిత జాబితా రూపొందించి పంపారు. పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో ఎక్కువ మందికి పదవుల్లో అవకాశాన్ని ఇవ్వడానికి వీలుగా తమ ప్రతిపాదనను ఆమోదించాలని మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డి కూడా పలుమార్లు అధిష్ఠానం పెద్దలను కోరారు. పాత కార్యవర్గంలో సీనియర్ ఉపాధ్యక్షులు, ఉపాధ్యక్షులు కలుపుకొని 35 మంది ఉన్నారని, ప్రధాన కార్యదర్శులు 86 మంది ఉన్నారని గుర్తు చేశారు. అయితే ఈ ప్రతిపాదనను అధిష్ఠానం ఆమోదించలేదు. జాబితాను కుదించాల్సిందిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించడంతో సంఖ్యను తగ్గించారు. కాగా, ఈసారి ఉపాధ్యక్షుల్లో ఒక ఎంపీ, ఇద్దరు చొప్పున ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు చోటు కల్పించారు. ప్రధాన కార్యదర్శుల్లో ముగ్గురు ఎమ్మెల్సీలకు చోటు దక్కింది. ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బసవరాజు సారయ్యలకు ఉపాధ్యక్ష పదవులు వరించింది.

టీపీసీసీ ఉపాధ్యక్షులు వీరే..

టి.కుమార్ రావు, కె.రఘువీర్‌రెడ్డి(ఎంపీ), నాయిని రాజేందర్‌రెడ్డి(ఎమ్మెల్యే), చిక్కుడు వంశీకృష్ణ(ఎమ్మెల్యే), బల్మూరి వెంకట్(ఎమ్మెల్సీ), బసవరాజు సారయ్య(ఎమ్మెల్సీ), హనుమండ్ల ఝాన్సీరెడ్డి, బండి రమేశ్, కొండ్రు పుష్పలీల, కోట నీలిమ, బిక్షైలాష్ కుమార్, నమిండ్ల శ్రీనివాస్, ఆత్రం సుగుణ, గాలి అనిల్‌కుమార్, చిట్ల సత్యనారాయణ, లకావత్ ధన్వంతి, ఎం.వేణుగౌడ్, కోటింరెడ్డి వినయ్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, ఎం.ఎ.ఫహీమ్ (సంగారెడ్డి), ఎస్.సురేశ్‌కుమార్, బొంతు రామ్మోహన్, అఫ్సర్ యూసుఫ్ జాహీ, ఎస్.జగదీశ్వర్‌రావు, నవాబ్ ముజాహిద్ ఆలం ఖాన్, గుమ్మల మోహన్‌రెడ్డి, చిన్నపటాల సంగమేశ్వర్.

పెండింగ్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులు..

టీపీసీసీ కమిటీలు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను ప్రకటించిన ఏఐసీసీ.. కార్యనిర్వాహక అధ్యక్ష పదవులను మాత్రం ఇంకా పెండింగ్‌లోనే పెట్టింది. రెడ్డి, ఎస్సీ మాదిగ, ఎస్టీ లంబాడా, ముస్లిం మైనార్టీలకు ఒక్కొక్కటి చొప్పున ఇవ్వాలని నిర్ణయం జరిగిన సంగతి తెలిసిందే. అయితే ప్రతిపాదిత పేర్లపై ఏకాభిప్రాయం రాకపోవడంతో పక్కన పెట్టింది. అలాగే పలు టీపీసీసీ కమిటీలపైనా అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు..

వెడ్మ బొజ్జు(ఎమ్మెల్యే), సీహెచ్ పర్ణికారెడ్డి(ఎమ్మెల్యే), మట్టా రాగమయి(ఎమ్మెల్యే), సీహెచ్.రాంభూపాల్, సంజీవ్ ముదిరాజ్, బొజ్జా సంధ్యారెడ్డి, మల్లాది రాంరెడ్డి, అబ్దేశి సదాలక్ష్మి, ఎం.బేబి స్వర్ణ కుమారి, దారాసింగ్ తాండూరు, జి.శశికళా యాదవరెడ్డి, కత్తి వెంకటస్వామి, ముహమ్మద్ అబ్దుల్ ఫహీమ్, సంతోష్‌కుమార్ రుద్ర, దుర్గం భాస్కర్, ముహమ్మద్ ఖాజా ఫఖ్రుద్దీన్, వి.జగదీశ్వర్‌గౌడ్, నరేశ్ జాదవ్, అల్లం భాస్కర్, గిరిజా షెట్కార్, కొప్పుల ప్రవీణ్‌కుమార్, ఎ.జంగారెడ్డి, కస్పా శ్రీనివాస్‌రావు, దుద్దిళ్ల శ్రీనివాస్, బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, చనగాని దయాకర్, పీసరి మహిపాల్‌రెడ్డి, గజ్జెల కాంతం, ఈడుపుగంటి సుబ్బారావు, చకిలం రాజేశ్వరరావు, ఈర్ల కొమరయ్య, ఏ.రవిబాబు, నాగ సీతారాములు, ఎస్.శ్రీనివాస్‌గౌడ్, పృథ్వీచౌదరి వేణుల, అంబడి రాజేశ్వర్, డి.డి.వెంకట్‌రాజ్, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పల్లె శ్రీనివాస్‌గౌడ్, మొహమ్మద్ సబీర్ అలీ, కట్ల రంగారావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సత్యనారాయణగౌడ్, టి.అనంతకిషన్, వి.రామారావుగౌడ్, అచ్యుత్ రమేష్‌బాబు, పెద్దనోల్ల బాలమురళీకృష్ణ (చిన్నా), ఎం.రాజీవ్‌రెడ్డి, ఆదం రాజ్ దేకపాటి, షమీం ఆఫా, ఇ.వి.శ్రీనివాస్‌రావు, మిథున్‌రెడ్డి, ఎ.వెంకటేశ్ పవార్, రాయగిరి కల్పనాయాదవ్, రాజేష్ కాశిపాక, రహమత్ హుస్సేన్, పి.ప్రసన్నకుమార్ శర్మ, ముహమ్మద్ అసదుద్దీన్, నందిమల్ల యాదయ్యముదిరాజ్, దైద రవీందర్, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, జి.నాగభూషణం, ఉపేందర్‌రెడ్డి, ధర్మారావు, నూతి సత్యనారాయణగౌడ్, దుర్గాప్రసాద్, సి.వెంకట గోవిందరావు, పెండ్లి శ్రీనివాసులురెడ్డి.

పామాయిల్ సాగులో తెలంగాణ భేష్

- మోదీ పాలనలో 40% వ్యవసాయ ఉత్పత్తి పెరిగింది
- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్
- ఐఐఎంఆర్‌లో మిల్లెట్స్ పరిశోధన సంస్థకు శంకుస్థాపన

ఆదిభట్ల/ఇబ్రహీంపట్నం/రాజేంద్రనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పామాయిల్ సాగు బాగుందని.. ఇక్కడి పరిస్థితుల దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో సాగును మరింత ప్రోత్సహించాల్సిన అవసరముందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. 11 ఏళ్ల మోదీ పాలనలో 40 శాతం వ్యవసాయ ఉత్పత్తి పెరిగిందని, వ్యవసాయ వృద్ధి రేటు 5.4 శాతంగా ఉందని ఈ రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించామని చెప్పారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మన్‌సాన్‌పల్లి, రామచంద్రగూడలలో ఉద్యానపంటలను పరిశీలించిన ఆయన.. ఆదిభట్ల మునిసిపల్ పరిధిలోని కళ్లెం జంగారెడ్డి గార్డెన్‌లో కేంద్రీయ మెట్ట పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ వరి, పత్తి పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతున్నాయని.. వీటికి కేంద్రం మద్దతు ధర ఇస్తోందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ, తెలంగాణలో రేవంత్‌రెడ్డి పాలనతో రైతులకు మంచి రోజులు వచ్చాయన్నారు. రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్(ఐఐఎంఆర్)లో రూ.250 కోట్లతో నిర్మించనున్న గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఆన్ మిల్లెట్స్ (శ్రీఅన్న) అండ్ అడ్వాన్స్ ఫెనోమిక్స్ భవన సముదాయానికి కేంద్ర మంత్రి చౌహాన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన ఐఐఎంఆర్ సంస్థ ఆవరణలో అతిథులతో కలసి మొక్కలు నాటారు.

'శవయాత్రకు రండి' వ్యాఖ్యల కేసులో విచారణ ఎదుర్కోండి

- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'హుజురాబాద్ ఎమ్మెల్యేగా నేను గెలిస్తే విజయయాత్రకు వస్తాను.. ఓడిపోతే మీరు మా శవయాత్రకు రండి' అంటూ వ్యాఖ్యానించి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ నమోదైన కేసులో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో విచారణ ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది. నాంపల్లి స్పెషల్ మేజిస్ట్రేటు కోర్టులో విచారణలో ఉన్న కేసును కొట్టేయాలని కోరుతూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం నిర్ణయాన్ని వెలువరించింది. పోలీసులు పెట్టిన కేసులో ఒక్క సెక్షన్‌ను మాత్రమే కొట్టేసిన హైకోర్టు.. మిగతా సెక్షన్లకుగాను విచారణ ఎదుర్కోవాలని స్పష్టం చేసింది.



జగిత్యాల కాంగ్రెస్‌లో

ఫ్లెక్సీ రగడ

- లక్ష్మణ్‌ను అభినందిస్తూ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గీయుల ఫ్లెక్సీలు
- ఫ్లెక్సీలో 'ఒరిజినల్ కాంగ్రెస్' అని రాసిన జీవన్‌రెడ్డి వర్గం
- నియోజకవర్గానికి నేనే రాజు.. నేనే మంత్రి: ప్రేమ్ సాగర్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్) ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పదవి వచ్చిన సందర్భంగా జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి వర్గం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదాస్పదంగా మారింది. లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు చెబుతూ జగిత్యాలలో జీవన్‌రెడ్డి వర్గం, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ వర్గం పోటాపోటీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద జీవన్‌రెడ్డి వర్గానికి చెందిన టీపీసీసీ ప్రచార కమిటీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముంజాల రఘువీర్ గౌడ్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో 'ఒరిజినల్ కాంగ్రెస్' అని రాసుకున్నారు. దీనిపై ఎమ్మెల్యే సంజయ్ వర్గీయులు మండిపడుతున్నారు. జీవన్‌రెడ్డి వర్గీయులు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సంజయ్ అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. మరోవైపు, నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి క్యాబినెట్‌లో చోటు దక్కకపోవడంతో నియోజకవర్గ నేతలు రాజీనామాల పర్వానికి తెరలేపారు. మండల, బ్లాక్ కాంగ్రెస్, మార్కెట్ కమిటీ చైర్మన్లతో పాటు ఇతర నేతలు తమ పదవులకు రాజీనామా చేస్తూ ఓ లేఖ రాసి అందులో అందరి సంతకాలు చేశారు. రాజీనామా లేఖతో పీసీసీ అధ్యక్షుడిని కలిసేందుకు హైదరాబాద్ వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడారు. వచ్చే క్యాబినెట్‌లోనైనా సుదర్శన్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని కోరారు. కాగా, 'మంచిర్యాల నియోజకవర్గానికి నేనే రాజు.. నేనే మంత్రి' అని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. లక్షెట్టిపేటలో ఆయన మాట్లాడుతూ మంత్రి పదవి రాలేదని తాను బాధపడేది లేదని తెలిపారు. జిల్లాలో ఎవరికి మంత్రి పదవి వచ్చినా మంచిర్యాల నియోజకవర్గంలో తన నిర్ణయమే ఫైనల్ అని అన్నారు.కాగా, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి తగిన గుర్తింపు, ప్రాధాన్యం వచ్చేలా ప్రయత్నం చేస్తానని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. మంత్రివర్గంలో చోటు లభించక పోవడంతో అసంతృప్తిగా ఉన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని బుజ్జగించేందుకు శ్రీధర్‌బాబు సోమవారం తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చారు. మల్‌రెడ్డికి తగిన గుర్తింపు లభించాలని తాను కూడా కోరుకుంటున్నట్లు చెప్పారు.

శాఖలపై కసరత్తు!

కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై చర్చ

న్యూఢిల్లీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖల కేటాయింపుపై హస్తినలో కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయి దాదాపు గంటసేపు చర్చించారు. మంత్రులకు శాఖల కేటాయింపుపైనే ప్రధానంగా వీరి చర్చ సాగినట్టు తెలిసింది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఎవరెవరి దగ్గర ఏయే శాఖలున్నాయి? రెండు, మూడు మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారెవరు? కొత్తగా మంత్రివర్గంలో చేరిన వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కు ఏ శాఖలు కేటాయించాలి? అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. దీనికి సంబంధించిన జాబితాను కేసీ వేణుగోపాల్‌కు సీఎం రేవంత్ అందించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలను కొత్తవారికి కేటాయించే అంశంపై సమాలోచన జరిగినట్టు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. అందులో ప్రధానమైనవి.. విద్య, పురపాలకం, హోం, గనులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమం, వాణిజ్య పన్నులు, పశుసంవర్ధక శాఖ, న్యాయ, కార్మిక, క్రీడలు యువజన శాఖ. వీటిలో విద్యా శాఖను తనకు కేటాయించాలని గడ్డం వివేక్ కోరుతున్నట్టు తెలిసింది. ఇదే విషయాన్ని మల్లికార్జున ఖర్గేకు సైతం తెలియజేసినట్టు సమాచారం. అయితే, వివేక్‌కు కార్మిక, మైనింగ్, క్రీడల శాఖ.. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ ఎస్టీ సంక్షేమం, వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, యువజన, న్యాయ లేదా మత్స్య శాఖ కేటాయించే అవకాశం ఉన్నట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతోపాటు.. మంత్రివర్గంలో స్థానం దక్కుతుందని ఆశించి నిరాశ చెందిన వారి ప్రభావమెంత? వారిని శాంతింపజేయడం ఎలా? అనే అంశాలపై కూడా కేసీ, రేవంత్ మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. మంత్రివర్గంలో మరో ముగ్గురికి అవకాశం ఉన్న నేపథ్యంలో మిగిలిన వారికి ఈసారి చోటు కల్పిస్తామనే నమ్మకం కలిగించాలని రేవంత్ రెడ్డికి కేసీ సూచించినట్టు తెలిసింది. అలాగే.. ప్రస్తుతం కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారి వ్యవహారశైలి, పని తీరు తదితర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఒకరిద్దరి మంత్రుల శాఖల్లో మార్పులు చేసే అవకాశం ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.


సీఎంతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ఈ వారంలోనే కొలిక్కి?

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం సమావేశం కానున్నారు. ఖర్గేతో జరిగే సమావేశంతో.. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు అంశం ఒక కొలిక్కి వచ్చే అవకాశముందని.. ఈ వారంలోనే కొత్తమంత్రులకు శాఖల కేటాయింపు ప్రక్రియ పూర్తవుతుందని తెలిసింది. ఇక.. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రివర్గంలో, మరో విప్ రామచంద్ర నాయక్‌కు డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం కల్పించిన నేపథ్యంలో వారి స్థానంలో మరో ఇద్దరికి అవకాశం కల్పించడంపైనా చర్చించినట్టు తెలిసింది. మంత్రి పదవులు ఆశించి నిరాశ చెందిన వారిలో ఇద్దరికి విప్‌లుగా అవకాశం కల్పించనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదిలా ఉండగా.. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యాలయం లోపలికి వెళ్లిన కొద్దిసేపటికే రాజకీయ వ్యూహకర్త సునీల్ కనుగోలు సైతం లోపలికి వెళ్లారు. రేవంత్ బయటికి వచ్చిన కొద్దిసేపటకే ఆయనా బయటికి వెళ్లిపోయారు. అయితే, ఆయన కేసీ వేణుగోపాల్, రేవంత్ సమావేశంలో పాల్గొన్నారా? లేదా? అనే దానిపై మాత్రం స్పష్టత లేదు.

సీఎంను కలిసిన అడ్లూరి, రాంచందర్‌నాయక్

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు డిప్యూటీ స్పీకర్‌గా ఎంపికైన రాంచందర్‌నాయక్ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎంను వారు కుటుంబసమేతంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఏ శాఖ అప్పగించినా ఓకే

- ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పనిచేస్తా: వివేక్


ఖర్గేతో వివేక్ దంపతులు

న్యూఢిల్లీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మంత్రులకు శాఖల కేటాయింపు అంశం ముఖ్యమంత్రి చేతిలో ఉంటుందని నూతన మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. అయితే తనకు ఏ శాఖ అప్పగించినా ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా పనిచేస్తానన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను వారి నివాసాల్లో కలిశారు. అనంతరం వివేక్ మీడియాతో మాట్లాడుతూ.. మంత్రివర్గ విస్తరణలోనూ సామాజిక న్యాయం చేయాలన్న రాహుల్ గాంధీ ఆలోచన పట్ల రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఓసీ, ఇతర సామాజిక వర్గాల్లోని ఆశావహులకు ఖాళీగా ఉన్న మరో మూడు మంత్రి పదవుల్లో అవకాశం కల్పించనున్నట్లు ఖర్గే చెప్పారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఖర్గే, వేణుగోపాల్ అభిప్రాయపడ్డారని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాల్సిందిగా సూచించారని తెలిపారు.

రూ.కోటి పెట్టి గెలిచాం.. ఎక్కడికెళ్లి వస్తాయి

- ఎవరేం చేసినా నాకు రావాల్సింది రావాల్సిందే
- వైన్స్ సిండికేట్ నుంచి ముడుపులకు డిమాండ్
- ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యే వీడియో వైరల్
- కనిపించని ఎమ్మెల్యే ముఖం.. జిల్లా అంతటా సర్వత్రా చర్చ

నల్లగొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజాసేవ చేయడానికి ఎన్నికైన ఎమ్మెల్యే ఒకరు ముడుపుల వసూళ్ల కోసం సొంతింట్లోనే వైన్స్ దుకాణాల నిర్వాహకులను డిమాండ్ చేస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరలైంది. అందులో ముఖం కనిపించడం లేదు గానీ ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన సదరు ఎమ్మెల్యే.. ఇవ్వాళ రేపు ఎవరు శుద్ధపూస.. ఎవరు సొక్కం.. తనకు మర్యాద ఇవ్వకుంటే వాళ్లకు బే మర్యాద అవుతుంది.. నాతో మాట్లాడుదామనే వారికి అసలు ఎదుటి వాడికి నాకు ఫోన్ చేసే దమ్ము ఉండాలి.. అని వైన్స్‌షాపుల నిర్వాహకులతో అంటున్నట్లు వినిపిస్తున్నది. ఇలాంటి చిల్లర చిల్లర ఏమొచ్చినా అవి మెయింటెనెన్స్‌కే సరిపోతయి. దాదాపు రూ.కోటి ఖర్చుపెట్టి గెలిచాం.. ఎక్కడికెళ్లి వస్తాయి.. నా బండి డీజిల్‌కే ఒక రోజుకు రూ.7,000 ఖర్చవుతుంది. కొడితే ఏదైనా పులిని కొడితే ఏమైనా ఉపయోగం ఉంటుంది. ఎవరేం చేసినా తనకు రావాల్సింది ఇవ్వాల్సిందేనని ఆయన డిమాండ్ చేస్తున్నట్లు మాటలు వినిపించాయి. ఈ వీడియోలో ఎమ్మెల్యే ముఖం కనిపించకపోయినా ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఓ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నేతేనని అంతటా సర్వత్రా చర్చ జరుగుతోంది.



డీజీపీ జితేందర్‌ను సన్మానిస్తున్న సుచాతశ్రీ, మంత్రి జూపల్లి, జయేశ్

తెలంగాణ నాకెంతో ప్రత్యేకం!

- కృతజ్ఞత సభలో మిస్ వరల్డ్ విజేత ఓపల్ సుచాతశ్రీ
- అడ్డంకులు ఎదురైనా లక్ష్యాన్ని సాధించాం: జూపల్లి

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ నాకు ఎంతో ప్రత్యేకం.. ఇక్కడ సాధించిన ప్రపంచ సుందరి కిరీటం కేవలం నా దేశం థాయ్‌లాండ్‌కే కాదు.. మొత్తం ప్రపంచానికీ గుర్తుండిపోతుంది. 40 రోజుల నుంచి హైదరాబాద్‌లో ఉంటున్నాను. తెలంగాణ పర్యాటకం, సంస్కృతిని పరిశీలించాను. ఇక్కడి ఆతిథ్యాన్ని స్వీకరించాను. హైదరాబాద్ ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అని మిస్ వరల్డ్ విజేత ఓపల్ సుచాతశ్రీ భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. మిస్ వరల్డ్ పోటీలుముగిసిన సందర్భంగా.. సోమవారం మాదాపూర్‌లోని తెలంగాణ ఆర్ట్ గ్యాలరీలో 'చాంపియన్స్ బిహైండ్ ద క్రౌన్' పేరుతో పర్యాటకశాఖ కృతజ్ఞత సభ నిర్వహించింది. పోటీల విజయవంతానికి కృషి చేసిన పలు శాఖలతోపాటు మీడియా ప్రతినిధులను సన్మానించారు. ఈ సందర్భంగా సుచాతశ్రీ మాట్లాడుతూ.. మిస్‌వరల్డ్ పోటీలకు ఆతిథ్యమిచ్చిన తెలంగాణ ప్రభుత్వం.. ఇక్కడి పర్యాటక ప్రాంతాలను వినూత్న రీతిలో ప్రపంచానికి పరిచయం చేసిందన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పోటీలను అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించినా.. విజయవంతంగా నిర్వహించామన్నారు. తెలంగాణ పర్యాటకం, సంస్కృతిని ప్రపంచానికి చాటాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందన్నారు.

హరిత వేతనాన్ని కొనసాగించండి

- ఖమ్మం కలెక్టర్‌కు వనజీవి రామయ్య సతీమణి వినతి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వనజీవి రామయ్యకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన రూ.50 వేల హరిత వేతనాన్ని ఇప్పుడు కూడా కొనసాగించాలని ఆయన సతీమణి ఖమ్మం కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వెళ్లిన రామయ్య భార్య జానమ్మ.. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిశారు. భర్త మృతితో తన జీవితం కకావికలమైందని, ఆసరా కరువైందని, తన భర్తకు ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చిన హరిత వేతనాన్ని తనకూ కొనసాగించాలని వేడుకున్నారు. ఆమె వినతిపై స్పందించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఈ విషయాన్ని ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించామని భరోసా ఇచ్చారు.

'కన్నప్ప'లో ఆ సన్నివేశాలు తొలగించాలి

- బ్రాహ్మణ సేవా సమాఖ్య డిమాండ్

రాంనగర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కన్నప్ప సినిమాలో పిలక, గిలక సన్నివేశాలను తొలగించి బ్రాహ్మణులకు మంచు మోహన్‌బాబు క్షమాపణ చెప్పాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్రాహ్మణులను, ఇతర కులాలు, మతాల వారిని మోహన్‌బాబు తరచూ సినిమాల్లో కించపరుస్తున్నారని ఆరోపించారు. మోహన్‌బాబు క్షమాపణ చెప్పకపోతే తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య తరపున సినిమా రిలీజ్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు.

వాదనలు వినకుండానే రేవంత్‌రెడ్డికి బెయిల్

- కొవిడ్ సమయంలో ఘటనను గుర్తుచేసిన జడ్జి

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంలోని 21వ అధికరణను సమర్థించే క్రమంలో హైకోర్టు అధికారాలపై వాదనల సందర్భంగా సోమవారం జస్టిస్ కె.లక్ష్మణ్ గతంలో జరిగిన ఓ ఘటనను సరదాగా ప్రస్తావించారు. "కొవిడ్ మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో.. ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ కేసులో అరెస్టయ్యారు. 18 రోజులు జైలులో ఉన్నారు. కొవిడ్ కారణంగా హైకోర్టు 30%సామర్థ్యంతో పనిచేస్తోంది. అప్పటి చీఫ్ జస్టిస్ నాకు కాల్ చేశారు. వందకు పైగా కేసులున్నాయని, ఒక్క జడ్జితో కాదని.. నన్ను సగం కేసుల విచారణ చేపట్టాలని కోరారు. ఆ రోజు రేవంత్ రెడ్డి బెయిల్ పిటిషన్ నా వద్దకు వచ్చింది. అప్పటికే పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. రేవంత్ తరఫున సల్మాన్‌ఖుర్షీద్ వాదనలకు సిద్ధమవుతుండగా..వాదనలు వినకుండానే మీ క్లైంట్‌కి బెయిల్ ఇస్తున్నాం. మీకేమైనా అభ్యంతరమా?"అని ప్రశ్నించినట్లు గుర్తుచేసుకున్నారు.

రిటైర్డ్ ఐఏఎస్ దమయంతి దాతృత్వం

- ఎల్వీ ప్రసాద్ ట్రస్టుకు 10.88 ఎకరాలు దానం

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ చారిటబుల్ ట్రస్టుకు రిటైర్డ్ ఐఏఎస్ కానరనేని దమయంతి 10.88ఎకరాల భూమిని దానం చేశారు. ఏలూరు జిల్లాలోని పెదవేగి మండలం వంగూరులో రెండు వేర్వేరు సర్వే నెంబర్లలో ఉన్న రూ.2.61 కోట్ల విలువైన 10.88ఎకరాల భూమిని.. గిఫ్ట్ డీడ్ రూపంలో రిజిస్ట్రేషన్ చేస్తారు. అయితే ఈ రిజిస్ట్రేషన్‌పై.. స్టాంపు డ్యూటీ, ఫీజును మినహాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రేవంత్ మా స్కూల్ డ్రాపవుట్

- ఆయన దారి తప్పి ఎక్కడో కొలువులో చేరారు
- రాష్ట్ర గౌరవాన్ని రాహుల్ వద్ద తాకట్టు పెట్టారు: లక్ష్మణ్



హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి తమ స్కూల్ డ్రాపవుట్ అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. "దేశం కోసం జాతీయ భావంతో పనిచేసే ఆలోచనా విధానాన్ని మా స్కూల్లో నేర్పిస్తారు. కానీ ఆ విధానంలో రేవంత్ దారితప్పారు. ఎక్కడో కొలువులో చేరడం వల్ల స్కూల్లో చదివిన మూలాలు పోయాయి. ఆయన మా స్కూల్లోనే చదివి ఉంటే మరో స్థాయికి ఎదిగేవారు" అని అన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. ఏ పదవిలో ఎంత కాలం ఉన్నామన్నది ముఖ్యం కాదని, ప్రజలు హర్షించేలా ఉండడం ముఖ్యమన్నారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన, సీఎం రేవంత్ 18 నెలల పాలనను బేరీజు వేస్తే రేవంత్ పాలన ఎలా ఉందో తెలుస్తుందని అన్నారు. రేవంత్‌కు రాహుల్ జపం తప్ప మరొకటి లేదని విమర్శించారు. తెలంగాణ నుంచి ఢిల్లీకి మూటలు మోస్తున్నారుగానీ రాష్ట్రానికి ఒక్క రూపాయి పెట్టుబడులు తీసుకురాలేదని విమర్శించారు. అవినీతిలో తెలంగాణ దూసుకుపోతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి పదవిని రాహుల్ గాంధీ వద్ద తాకట్టుపెట్టి, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని రేవంత్ దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు.

రాతపూర్వక ఆదేశాలిచ్చానా?

(మొదటి పేజీ తరువాయి)

ఎట్టకేలకు సోమవారం సిట్ అధికారుల ముందు విచారణకు ప్రభాకర్‌రావు హాజరయ్యారు. తాను ఎవరి ఫోన్లనూ అక్రమంగా ట్యాపింగ్ చేయించలేదని తెలిపారు. ఇందుకు సంబంధించి తాను రాతపూర్వకంగా ఇచ్చిన ఆదేశాలేవైనా ఉంటే చూపించాలన్నారు. తన కింద పనిచేసిన సిబ్బంది.. అరెస్టు సమయంలో ఇచ్చిన వాంగ్మూలాలు చెల్లుబాటు కావన్నారు. తనపై ఇంకా ఉన్నతాధికారులు ఉన్నారని, ఆనాడు ఏం జరిగిందో వారందరికీ తెలుసనని పేర్కొన్నారు. మొత్తంగా సిట్ విచారణ జరిగే తీరుపై పూర్తి అవగాహనతో వచ్చిన ప్రభాకర్‌రావు.. పోలీసుల ప్రశ్నలను తిప్పికొట్టినట్లు తెలిసింది. సోమవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రభాకర్‌రావును పీఎస్‌లోని రెండో అంతస్తులో ఉన్న సిట్ కార్యాలయంలో డీసీపీ విజయకుమార్, ఏసీపీ వెంకటగిరి ఆధ్వర్యంలోని బృందం ప్రశ్నించింది. విచారణ మొత్తాన్ని వీడియో రికార్డు చేశారు. సుదీర్ఘకాలం పోలీసుశాఖలో పని చేసి ఐజీ స్థాయిలో పదవీ విరమణ పొందిన ప్రభాకర్‌రావు.. ఆపై ఓఎస్‌డీ హోదాలో ఎస్ఐబీలో కొనసాగిన విషయం తెలిసిందే. దీంతో ఆ స్థాయి నేపథ్యం ఉన్న మాజీ పోలీసు అధికారిని విచారించాలంటే అందుకు తగ్గట్లే ప్రశ్నలు ఉండాలని ఉన్నతాధికారులు భావించారు. ఈ మేరకు కేసుపై ఇటీవలే సమీక్ష నిర్వహించి పలు కీలక అంశాల ఆధారంగా ప్రభాకర్‌రావును ప్రశ్నించాలని సిట్ బృందానికి సూచించారు. మరోవైపు ప్రభాకర్‌రావు సైతం పరారీలో ఉన్న పదిహేను నెలల కాలంలో.. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన వారు ఇచ్చిన వాంగ్మూలాలను తెప్పించుకుని అధ్యయనం చేసినట్లు సమాచారం. తద్వారా సిట్ ప్రశ్నావళి ఏ విధంగా ఉంటుందన్నదానిపై స్పష్టమైన అవగాహనతో విచారణకు హాజరవుతారని, ఆయన నుంచి వాస్తవాలు బయట పెట్టించాలంటే అత్యంత నేర్పు, ఓర్పు అవసరమని ఉన్నతాధికారులు భావించారు. ఈమేరకు ఒక్కో అంశంపై లోతుగా ప్రశ్నించేలా వ్యూహం సిద్ధం చేశారు.

ట్యాపింగ్ ఎందుకు చేయించారు?

"ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి డిజిగ్నేటెడ్ అధికారిగా మీకున్న పరిధి ఏంటి? ట్యాపింగ్ చేయమని ఫోన్ నంబర్లను మీకు ఎవరిచ్చారు? ఎవరి ఆదేశాలతో చేయించారు? ప్రైవేటు వ్యక్తి అయిన శ్రవణ్‌రావు ఈ ఫోన్ ట్యాపింగ్‌లోకి ఎలా ప్రవేశించాడు?" అంటూ సిట్ అధికారులు ప్రభాకర్‌రావును అడిగినట్లు తెలుస్తోంది. అయితే ప్రభాకర్‌రావు ఏమాత్రం తడబడకుండా..ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి తాను ఇచ్చిన రాతపూర్వక ఆదేశాలుంటే చూపించాలని అన్నట్లు సమాచారం. తన డ్యూటీ తాను చేశానని సమర్థించుకోవడానికి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. కాగా, ప్రభాకర్‌రావు తన పదవికి రాజీనామా చేసిన రోజు రాత్రి మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఎస్ఐబీ ఆఫీసులోకి అక్రమంగా ప్రవేశించడం, ఫోన్ ట్యాపింగ్ ఆధారాలున్న హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేయడంపై ప్రశ్నించగా.. ఆ ఘటనతో తనకేం సంబంధమని ప్రభాకర్‌రావు ఎదురు ప్రశ్నించినట్లు సమాచారం. "ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు కాగానే అమెరికా ఎందుకు వెళ్లారు? అది ముందస్తు షెడ్యూల్ కాదు కదా?"అని సిట్ అధికారులు ప్రశ్నించగా.. అనారోగ్య కారణాలతో మెరుగైన వైద్యం కోసం వెళ్లానని ప్రభాకర్‌రావు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఇటీవల తన బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా తన తరఫు న్యాయవాది వాదించిన అంశాన్ని ఈ సందర్భంగా దర్యాప్తు అధికారుల ముందు ప్రస్తావించినట్లు తెలుస్తోంది.



హైదరాబాద్‌లోని సిట్ కార్యాలయానికి వస్తున్న ప్రభాకర్‌రావు

రివ్యూ కమిటీలో సభ్యుడిని కాదు..

చీఫ్ సెక్రటరీ, హోంశాఖ సెక్రటరీ ఆధ్వర్యంలోని రివ్యూ కమిటీకి ఫోన్‌ట్యాపింగ్ గురించి ప్రభాకర్‌రావు ఏనాడూ సమాచారం ఇవ్వలేదంటూ నాటి హోంశాఖ కార్యదర్శి రవిగుప్తా గతంలో హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. ఇదే విషయాన్ని సిట్ అధికారులు ప్రభాకర్‌రావుకు వివరిస్తూ, "మీ సొంత నిర్ణయాల ప్రకారమే ట్యాపింగ్ చేయించారా? ఆదేశాలు ఇచ్చిందెవరు? ట్యాపింగ్ తర్వాత ఆ ఆడియోలను మీరు ప్రభుత్వంలోని వారికి ఎవరికైనా పంపారా?" అని సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే.. పోలీసు వ్యవస్థలో తనపై ఇంకా అధికారులున్నారని, అక్కడేమి జరిగిందో ఉన్నతాధికారులందరికీ తెలుసునని ప్రభాకర్‌రావు జవాబిచ్చినట్లు సమాచారం. ఆయనను ఎనిమిది గంటలపాటు విచారించిన అధికారులు.. తిరిగి ఈ నెల 11న తదుపరి విచారణకు రావాల్సిందిగా ఆదేశించారు.

సహకరించే అవకాశాలు తక్కువే..

పోలీసుశాఖలో సుదీర్ఘకాలం కొనసాగిన ప్రభాకర్‌రావు విచారణకు సహకరించే అవకాశాలు తక్కువేనని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో సాంకేతిక ఆధారాల ద్వారా ఆయన నేరాన్ని నిర్ధారించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభాకర్‌రావు బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 5కి వాయిదా వేయడంతో.. ఆయనను అప్పటివరకు ఈ కేసులో అరెస్టు చేసే అవకాశాలు పోలీసులకు ఏమాత్రం లేవు. ఇదే ధీమాతో ప్రభాకర్‌రావు తొలిరోజు వ్యవహరించారని ఉన్నతాధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు. ఇక ఈ నెల 11న తదుపరి విచారణకు హాజరయ్యే సమయంలో ప్రభాకర్‌రావు తాను ఉపయోగిస్తున్న రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేయాలని సిట్ అధికారులు ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతోపాటు ఎన్నికల సమయంలో వాడిన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, మ్యాక్‌బుక్‌ను కూడా సిట్‌కు అప్పగించాలని ప్రభాకర్‌రావును ఆదేశించినట్లు సమాచారం.



చొప్పదండిలో మంచి నీటి సరఫరా పథకానికి శంకుస్థాపన చేస్తున్న బండి సంజయ్

ప్రభాకర్‌రావు నీచుడు

- భార్యాభర్తల సంభాషణలను కూడా ట్యాప్ చేశాడు
- అమెరికాలోనే ఆయనకు కేసీఆర్ కుటుంబం కౌన్సెలింగ్: సంజయ్

కరీంనగర్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు పథకం ప్రకారమే లొంగిపోయి సిట్ ఎదుట హాజరయ్యారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. అమెరికాలోనే ప్రభాకర్‌రావుకు కేసీఆర్ కుటుంబంతో కౌన్సెలింగ్ తంతు పూర్తయిందని ఆరోపించారు. విచారణలో ఆయన ఇచ్చిన వాంగ్మూలాన్ని బహిరంగ పరచాలని డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ జిల్లా చొప్పదండిలో మంచినీటి సరఫరా పథకానికి సంజయ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభాకర్‌రావు మామూలోడు కాదని, తనలాంటి అనేక మంది కార్యకర్తల ఉసురుపోసుకున్నాడని అన్నారు. తనతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు, జడ్జిల ఫోన్లను కూడా ట్యాప్ చేసిన ఘనుడు ప్రభాకర్‌రావు అని మండిపడ్డారు. ఆయన వల్ల అనేక మంది జీవితాలు నాశనమయ్యాయని, ఎన్నో కుటుంబాలు రోడ్డునపడ్డాయని తెలిపారు. భార్యాభర్తల సంభాషణలను కూడా ట్యాప్ చేసిన నీచుడని, ఆయన వల్ల భార్యాభర్తలు కూడా ఫోన్‌లో మాట్లాడుకోలేని దుస్థితి ఏర్పడిందని అన్నారు. ఎవరి ఆదేశం మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారో ప్రజలకు తెలియాలని అన్నారు. ట్యాపింగ్ ఆడియోలను ఎవరికి పంపారు..? వాటిని అడ్డుపెట్టుకుని ఎవరెవరిని బెదిరించారు..? వంటి వివరాలు వెల్లడి కావాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోందని, 18 నెలల్లో ఏ ఒక్క అవినీతి కేసులో కూడా విచారణ ముందుకు సాగలేదని విమర్శించారు. ఇకనైనా కోర్టులో గట్టిగా వాదనలు వినిపించి, ప్రభాకర్ రావు, ఆయన వెనకున్న సూత్రధారులను దోషులుగా తేల్చాలని సంజయ్ డిమాండ్ చేశారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు

రద్దు చేయాలి

- పెద్ద ధన్వాడ రైతులపై కేసులు ఎత్తివేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్
- కలెక్టరేట్‌లో పెద్ద ధన్వాడ వాసుల ఆందోళన
- ప్రాణాలు పోయినా ఫ్యాక్టరీని అడ్డుకుంటామని స్పష్టం

గద్వాల క్రైం/హైదరాబాద్/గద్వాల న్యూ టౌన్: జూన్ 9(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాడిన రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని, ఆ ఫ్యాక్టరీకి అనుమతులను రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రైతుల కుటుంబాలను పరామర్శించడానికి వెళుతున్న తమను అక్రమంగా అరెస్టు చేయడం విడ్డూరమన్నారు. సోమవారం గద్వాల పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతులపై బౌన్సర్లతో దాడులు చేయించిన ఫ్యాక్టరీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండగా ఈ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాడిందని, అదే పార్టీ నాయకులు ఇప్పుడు దగ్గరుండి రైతులపై దాడులు చేయించడంతో పాటు అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేస్తున్నారని విమర్శించారు. మంచి పంటలు పండే భూములను అక్రమంగా కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జాన్‌వెస్లీ, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుల అరెస్టును ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ఖండించింది. అలాగే, కేసులు బనాయించి, జైల్లో పెట్టిన రైతులను విడుదల చేయాలని, దళిత మహిళ మరియమ్మపై దాడి చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఆపకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని గ్రామస్థులు పేర్కొన్నారు. సోమవారం వారు జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన చేశారు. గ్రామస్థురాలు రాములమ్మ మాట్లాడుతూ గతంలో కొందరు రాజకీయ నాయకులు ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని నిలుపుదల చేస్తామని హామీ ఇచ్చారని, మళ్లీ రాత్రికి రాత్రి నిర్మాణం చేపట్టారన్నారు. పోలీసులు కూడా ఫ్యాక్టరీ యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. తమ ప్రాణాలు పోయినా సరే ఫ్యాక్టరీని గ్రామంలో ఏర్పాటు కానివ్వబోమన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

తంగళ్లపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో డబ్బులు పోగొట్టుకుని, చేసిన అప్పులు తిరిగి చెల్లించలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా దేశాయిపల్లెకి చెందిన తుమ్మల వంశీ (20) ఇంటర్ పూర్తి చేశాడు. కరీంనగర్‌లోని ఓ మెకానిక్ షాప్‌లో పని చేస్తున్నాడు. మూడు సంవత్సరాల నుంచి ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నాడు. అందిన కాడికి అప్పులు చేసి బెట్టింగ్ గేమ్స్ ఆడాడు. ఇందులో దాదాపు రూ.10 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడం, తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన వంశీ సోమవారం పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

బస్‌పాస్ చార్జీల బాదుడు!

(మొదటి పేజీ తరువాయి)

వరకు రూ.150 వసూలు చేస్తుండగా ఆ మొత్తాన్ని రూ.225కి పెంచారు. రూట్‌పాస్ గరిష్ఠంగా 22 కి.మీ.కు రూ.450 ఉండగా దాన్ని రూ.675కి పెంచారు. జిల్లాల్లో ప్రతి నెలా రూట్‌పాస్‌కు 5 కి.మీ. వరకు రూ.150 ఉండగా దాన్ని రూ.225కి పెంచారు. గరిష్ఠంగా 35 కి.మీ.కు రూ.550 ఉండగా రూ.825కి పెంచారు. విద్యార్థుల సాధారణ పాస్ (నెలవారీ) రూ.400 నుంచి రూ.600కు పెంచారు. 3 నెలలకు రూ.1200 నుంచి రూ.1800కు పెంచారు. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు పెంచినప్పటికీ ఇకపై హైదరాబాద్‌లో మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ అనుమతించనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల తలెత్తుతున్న ఇబ్బందుల్ని అధిగమించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు గత మూడేళ్లుగా పెంచలేదన్నారు. ప్రస్తుతం పెరిగిన ఖర్చుల కారణంగా విద్యార్థి, సాధారణ ప్రయాణికుల బస్‌పాస్‌ల ధరలు పెంచినట్లు అధికారులు వెల్లడించారు. పెంచిన ధరలతో ఆర్టీసీకి ప్రతి నెల సుమారు 2కోట్ల వరకు ఆదాయం సమకూరనుంది. కాగా, ఈ పెంపు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల బస్‌పాస్‌లు సుమారు 11 లక్షల వరకు ఉన్నాయి.

టోల్‌ప్లాజా వినియోగ చార్జీల సవరణ..

టోల్‌ప్లాజా వినియోగ చార్జీలను సైతం ఆర్టీసీ సవరించింది. ఒక్కో ప్రయాణికుడి నుంచి ఇకపై ప్రతి టోల్ ప్లాజాకు రూ.10 వసూలు చేయనుంది. తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో టోల్‌ప్లాజా మీదుగా రోజూ సుమారు 6 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. కాగా, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఏటా టోల్ రుసుమును సవరిస్తోందని, దానికి అనుగుణంగా వినియోగ చార్జీలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 24 జారీ చేసిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆ మేరకు టోల్ ప్లాజా వినియోగ చార్జీని సవరించినట్లు చెప్పారు.

పెంచిన చార్జీలను ఉపసంహరించండి: సీపీఎం

బస్‌పాస్ చార్జీలను 20 శాతానికి పైగా పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. చార్జీలు పెంచడం ద్వారా సాధారణ ప్రజలు, విద్యార్థులపై భారం పడుతోందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఒక్కో ప్రయాణికుడిపై నెలకు రూ.250-300 వరకు అదనపు భారం పడుతుందన్నారు. తక్షణమే పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సాధారణ ప్రజలకు పెంచిన ధరలు ఇలా..

బస్‌పాస్	ప్రస్తుత ధర (రూ.ల్లో)	పెంచింది	శాతం
నెలవారీ ఆర్డినరీ	1150	1400	21.74
మెట్రో ఎక్స్‌ప్రెస్	1300	1600	23.08
మెట్రో డీలక్స్	1450	1800	24.14
గ్రేటర్ హైదరాబాద్ పాస్	1150+200	1400+250	21.74
గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ పాస్	1800+జీఎస్టీ	2200+జీఎస్టీ	22.22
పుష్పక్ ఏసీ పాస్	5000+జీఎస్టీ	5000+జీఎస్టీ	-

ఎన్జీవో ప్రయాణికులకు..

బస్‌పాస్	ప్రస్తుత ధర	పెంచింది
ఆర్డినరీ	400	600
మెట్రో ఎక్స్‌ప్రెస్	550	800
మెట్రో డీలక్స్	700	1000

ఇక ఎంఎంటీఎస్, ఆర్టీసీ కోంబో టికెట్ ధర రూ.1350 నుంచి రూ.1650కి పెంచారు.

కాచిగూడకు సరికొత్త వెలుగు

- ఫసాడ్ లైటింగ్‌తో ఆకర్షణీయంగా స్టేషన్
- దేశాభివృద్ధిలో జీఎస్ఐ పాత్ర అద్భుతం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సరికొత్త ఫసాడ్ లైటింగ్ వ్యవస్థతో చారిత్రక కాచిగూడ రైల్వే స్టేషన్ దేదీప్యమానంగా వెలిగిపోతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. 1916లో గోతిక్ శైలిలో నిర్మించిన ఈ స్టేషన్‌ను మరింత ఆకర్షణీయంగా చూపించడానికి 785 ఇల్యూమినేషన్ లైట్లను ఏర్పాటు చేశామని, ఆ కాంతుల్లో స్టేషన్ ప్రాంగణం కనువిందుగా ఉందని పేర్కొన్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద కేంద్ర పర్యాటక శాఖ రూ.2.23 కోట్లతో ఏర్పాటు చేసిన ఫసాడ్ లైటింగ్ వ్యవస్థను ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్ బాబు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌తో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. అమృత్ భారత్ పథకం కింద రూ.421.66 కోట్లతో కాచిగూడ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీని ఉపయోగించుకుంటూ కాచిగూడ స్టేషన్ పర్యావరణ పరిరక్షణలో తన వంతు పాత్ర పోషిస్తోందని చెప్పారు. గ్రీన్ రైల్వే స్టేషన్లకు రేటింగ్ ఇచ్చే ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ కాచిగూడ స్టేషన్‌కు ప్లాటినం రేటింగ్ ఇచ్చిందని గుర్తు చేశారు. కాగా, దేశంలోని వనరుల అన్వేషణ, ఖనిజాలను గుర్తించి భద్రపరచడంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) 175 ఏళ్లుగా అందిస్తున్న సహకారం అద్భుతమని కిషన్‌రెడ్డి కొనియాడారు. నాగోల్ బండ్లగూడలోని 'నెక్స్ట్ జెన్ జియోఫిజిక్స్-2025' సదస్సును కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. జీ-7, జీ-20 వంటి ప్రపంచ వేదికలపై భారత దేశం కీర్తి గడిస్తోందని, కీలకమైన ఖనిజాలను భద్రపరచడంలో దేశం వ్యూహాత్మక దృష్టితో ముందుకు సాగుతోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఖనిజ భద్రత, పర్యావరణ స్థితిస్థాపకత, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో భౌగోళిక శాస్త్రీయ పరిశోధన కీలకంగా వ్యవహరిస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఖనిజ పరిశోధన, స్థిరమైన వనరుల నిర్వహణలో జీఎస్ఐ పాత్ర అభినందనీయమన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు యోగా అంబాసిడర్ కావాలని కిషన్‌రెడ్డి సూచించారు. పద్మారావునగర్‌లోని సీబీవో కార్యాలయంలో యోగా వేడుకల కోసం జరిగిన సన్నద్ధత కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు.



హైడ్రాలిక్ డ్రిల్లింగ్ గురించి తెలుసుకుంటున్న కిషన్‌రెడ్డి, ఈటల

'పసుపు బోర్డు' ప్రారంభోత్సవానికి అమిత్ షా

నిజామాబాద్‌లోని పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించేందుకు రావాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఎంపీ అర్వింద్, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి ఆహ్వానించారు. తమ విజ్ఞప్తికి షా అంగీకరించారని, ఈ నెలాఖరులోగా కార్యక్రమం ఉంటుందని అర్వింద్ తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.